

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 172

సోమవారం 11-9-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



జనవరి 21న ప్రారంభం
అయోధ్య రామ మందిరం ప్రారంభానికి ముమ్మరంగా ఏర్పాట్లు -6లో



నేటికి వాయిదా...
భారత్, పాక్ ఆసియా కప్ 'సూపర్–4' మ్యాచ్‌కు వర్షం అంతరాయం -14లో

రూ. 241 కోట్లు కొల్లగొట్టిన స్కిల్ స్కామ్ ముద్దాయి

చంద్రబాబు జైలుకు

14 రోజుల పాటు రిమాండ్ విధించిన ఏసీబీ కోర్టు

రాజమండ్రి జైలుకు తరలించాలని ఆదేశం

- ప్రత్యేక గదిలో ఉంచాలని, భద్రత కల్పించాలని ఆదేశం
- ఇంటి భోజనం, మందులు తెప్పించుకునేందుకు అనుమతి.. అంతకు ముందు సుదీర్ఘంగా కొనసాగిన ఇరుపక్షాల వాదనలు
- చంద్రబాబు జైలు కెళ్లకుండా తప్పించుకునేందుకు ఎత్తుగడలు.. హౌస్ అరెస్ట్‌లో ఉండేలా ఆదేశాలు ఇవ్వాలంటూ పిటిషన్
- అభ్యంతరం తెలిపిన సీఐడీ న్యాయవాదులు
- వారెంట్ సిద్ధం కావడంతో జైలుకు తరలించిన పోలీసులు
- దోపిడీయే చంద్రబాబు విజన్, మిషన్ అని నివేదించిన అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి.. ప్రజాధనాన్ని లూటీ చేయడంలో బాబు తన 'స్కిల్' చూపారు
- షెల్ కంపెనీలు సృష్టించి కోట్ల రూపాయలు దారి మళ్లించారు.. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం తీవ్రమైన నేరం కాబట్టి రిమాండ్ విధించాల్సిందేనని వాదన
- రాజకీయ కక్షతోనే అరెస్ట్ చేశారన్న బాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా
- 409తో సహా ఏ సెక్షన్లూ వర్తించవని కోర్టును ఒప్పించేందుకు విఫలయత్నం

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఆదివారం సాయంత్రం 14 రోజులపాటు రిమాండ్ విధించింది. ఈ మేరకు న్యాయమూర్తి బి.సత్య వెంకట హిమబిందు ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రబాబును రాజమండ్రి జైలుకు తరలించాలని పోలీసులను ఆదేశించారు. అక్కడ ఆయనను ప్రత్యేక గదిలో ఉంచాలని స్పష్టం చేశారు. జైలులో తగిన భద్రతను కూడా కల్పించాలని ఆదేశించారు. ఇంటి నుంచి భోజనం, మెడిసిన్స్ తెప్పించుకునేందుకు అనుమతించారు. న్యాయమూర్తి ఉత్తర్వులు వెలువరించిన తర్వాత వారెంట్ కాపీ సిద్ధం చేసేందుకు కొంత సమయం పట్టడంతో చంద్రబాబు తన న్యాయవాదులతో కలిసి కోర్టు ప్రాంగణంలో ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయంలో కూర్చున్నారు. ఈ లోపు జైలుకెళ్లకుండా తప్పించుకునేందుకు చంద్రబాబు, ఆయన న్యాయవాద బృందం ఎత్తులు వేసింది. ఇంటి నుంచి

మిగతా 2వ పేజీలో ▶



ఆదివారం అర్ధరాత్రి రాజమండ్రి సెంట్రల్ జైల్‌లోకి వెళ్తున్న చంద్రబాబు

ఖైదీ నంబర్ 7691

- రాజమండ్రి సెంట్రల్ జైలుకు చంద్రబాబు..
- పటిష్ట భద్రత మధ్య ప్రత్యేక కాన్వాయ్ ద్వారా తరలింపు
- రిమాండ్ ఖైదీగా నంబర్ కేటాయించిన జైలు అధికారులు
- కోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక గది, ఆహారం

"స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు కోట్లాది రూపాయలను దోచేశారు. షెల్ కంపెనీలను సృష్టించి పెద్ద మొత్తాలను దారి మళ్లించారు. అదంతా పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన డబ్బు.

- అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి



వివరాలు, మరిన్ని వార్తలు 2,10,11పేజీల్లో

పక్కా కుట్రతోనే 'స్కిల్' దోపిడీ

- నిధుల తరలింపులో లోకేశ్‌కూ పాత్ర..
- రిమాండ్ రిపోర్ట్‌లో సీఐడీ సిట్

దయచేసి రావాలి!

- కృష్ణా జిల్లా టీడీపీ నేతలతో అచ్చెన్నాయుడు ఆవేదన.. లీకైన అచ్చెన్న కాన్ఫరెన్స్ ఆడియో
- చంద్రబాబును అరెస్ట్ చేసినా జనం రావట్లేదు.. బాధగా ఉంది
- సెకండరీ లీడర్లు భయపడుతున్నారు: ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఆర్థిక నేరం చేసి దబాయిస్తావా?



- చంద్రబాబుపై మండిపడ్డ సజ్జల.. ఏసీబీ కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం
- చంద్రబాబు పాల్పడిన అన్ని కుంభకోణాలపై విచారణ చేస్తాం
- శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించారు
- సొంత పుత్రుడి కంటే దత్తపుత్రుడే ఎక్కువగా వీరంగం వేశాడు

- వివరాలు 10లో



ఆదివారం ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీ స్మారకం వద్ద నివాళులర్పించేందుకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఇతర దేశాధినేతలతో కలిసి వెళ్తున్న భారత ప్రధాని మోదీ

ఐరాసను సంస్కరించాలి

- ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని విస్తరించాలి
- జీ20 సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- ముగిసిన జీ20 శిఖరాగ్ర సదస్సు
- నవంబర్‌లో వర్చువల్ సదస్సు
- కూటమి తదుపరి అధ్యక్ష బాధ్యతలు బ్రెజిల్‌కు అప్పగింత

6లో

తీవ్రవాద శక్తులపై కఠిన చర్యలు తీసుకోండి
కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు నరేంద్ర మోదీ సూచన
- వివరాలు 6లో



బీసీలకు 60 సీట్లు ఇవ్వాల్సిందే

- అన్ని రాజకీయ పార్టీలకు బీసీ సింహగర్జన సభ డిమాండ్
- కులానికో సీటు..బీసీలకే ఓటు నినాదంతో ముందుకెళ్తామని ప్రకటన
- సీఎం అభ్యర్థిగా కూడా బీసీనే ప్రకటించాలని విజ్ఞప్తి
- సరూర్‌నగర్ స్టేడియంలో సభకు భారీగా తరలివచ్చిన కార్యకర్తలు

5లో

హైదరాబాద్‌లో జరిగిన బీసీ గర్జన సభలో సంఘీభావం తెలుపుతున్న నేతలు. చిత్రంలో జాజుల

మొరాకో విలయం.. మృతులు రెండు వేల పైనే..



- సహాయక చర్యలు ముమ్మరం
- చేయూత ప్రకటించిన ప్రపంచదేశాలు
- భారతీయులంతా సురక్షితమేనన్న దౌత్య కార్యాలయం

- వివరాలు 6లో



చంద్రబాబు జైలుకు



విజయవాడ జీజీహెచ్‌లో చంద్రబాబుకి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



కారులో చంద్రబాబును రాజమహేంద్రవరానికి తరలిస్తున్న దృశ్యం

▶ మొదటి పేజీ తరువాయి

భోజనం, మెడిసిన్స్ తెప్పించుకునేందుకు ఓ పిటిషన్, జైలుకు కాకుండా ఇంటి వద్దనే హౌస్ అరెస్ట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ మరో పిటిషన్ దాఖలు చేశారు. హౌస్‌మోషన్ రూపంలో ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై న్యాయమూర్తి విచారణ జరిపారు. ఇంటి నుంచి భోజనం, మెడిసిన్స్ తెప్పించుకునేందుకు సీఐడీ న్యాయవాదులు ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. అయితే హౌస్ అరెస్ట్ విషయంలో మాత్రం తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఓసారి నిందితునికి రిమాండ్ విధించిన తర్వాత ఆ ఉత్తర్వులను మార్చడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అసాధారణ, అరుదైన పరిస్థితుల్లో మాత్రమే హౌస్ అరెస్ట్ ఉత్తర్వులు ఇవ్వడానికి ఆస్కారం ఉందని తెలిపారు. ప్రస్తుతం అలాంటి అసాధారణ, అరుదైన పరిస్థితులు ఏవీ లేవన్నారు. ఈ పిటిషన్ విషయంలో అధికారులతో సంప్రదించి అన్ని వివరాలు తెలుసుకోవాల్సి ఉందని, అందుకు తమకు ఓ రోజు గడువు కావాలని న్యాయమూర్తిని కోరారు. హౌస్ అరెస్ట్ ఉత్తర్వుల కోసం చంద్రబాబు తరఫు న్యాయవాదులు గట్టిగా పట్టుబడ్డారు. అయితే న్యాయమూర్తి ఈ పిటిషన్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇదే సమయంలో రిమాండ్‌కు సంబంధించిన వారెంట్ కాపీ సిద్ధం కావడంతో పోలీసులు ఆ కాపీని చంద్రబాబుకు చూపారు. తాము దాఖలు చేసిన హౌస్ అరెస్ట్ పిటిషన్ పెండింగ్‌లో ఉందని, అందువల్ల జైలుకు తరలించలేరని కొందరు టీడీపీ న్యాయవాదులు పోలీసులతో ఒకింత వాగ్వాదానికి దిగారు. అయితే పోలీసులు మాత్రం కోర్టు వారెంట్ జారీ చేసిన నేపథ్యంలో జైలుకు తరలించి తీరాల్సిందేనని చంద్రబాబుకు స్పష్టం చేశారు. అనంతరం ఆయన్ను విజయవాడ కోర్టులోని మూడో అంతస్తు నుంచి లిఫ్ట్‌లో కిందకు తీసుకొచ్చి వాహనాల్లో రాజమండ్రి జైలుకు తీసుకెళ్లారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఇరు పక్షాల వాదనల వివరాలు ఇలా ఉన్నాయి.

తనకేం సంబంధం లేదన్న బాబు

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో కీలక నిందితునిగా ఉన్న చంద్రబాబును సీఐడీ అధికారులు శనివారం ఉదయం ఆరు గంటలకు నంద్యాలలో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం 5.40 గంటలకు సీఐడీ అధికారులు ఆయన్ను ఏసీబీ కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా పోలీసులు ఏసీబీ కోర్టు చుట్టుపక్కల గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. న్యాయవాదులను మినహా మిగిలిన వారెవ్వరినీ కోర్టు ప్రాంగణంలోకి అనుమతించలేదు. 6.40 గంటలకు చంద్రబాబు కోర్టు హాలులోకి వచ్చి కూర్చున్నారు. 8 గంటలకు విచారణ మొదలైంది. ఈ సందర్భంగా చంద్రబాబును న్యాయమూర్తి కొన్ని ప్రశ్నలు అడిగారు. వాటికి చంద్రబాబు నాయుడు సమాధానం ఇస్తూ, ప్రభుత్వం అరాచకంగా వ్యవహరిస్తోందని.. చట్టం, నిబంధనలు ఏమీ పట్టించుకోకుండా ఇష్టారీతిన అరెస్టులు చేస్తోందని వివరించారు. తనను ఎప్పుడు అరెస్ట్ చేశారు.. అధికారులు తన పట్ల ఎలా వ్యవహరించారు.. తదితర వివరాలను కోర్టుకు వివరించారు. అర్ధరాత్రి 11 గంటల సమయంలో తనను నిర్బంధంలోకి తీసుకుని, ఉదయం 6 గంటలకు అరెస్ట్ చూపారని తెలిపారు. రెండేళ్ల తర్వాత స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో పోలీసులు తనను 37వ నిందితునిగా చూపి అరెస్ట్ చేశారని చెప్పారు. ఈ స్కామ్‌తో తనకు ఏ మాత్రం సంబంధం లేదన్నారు.

దోచేసిన మొత్తమంతా ప్రజల డబ్బే..

సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, చంద్రబాబును శనివారం ఉదయం 6 గంటలకే అరెస్ట్ చేశామని కోర్టుకు నివేదించారు. దీనిని ధ్రువీకరిస్తూ చంద్రబాబు సంతకం కూడా చేశారని తెలిపారు. అరెస్ట్ సమయంలో చంద్రబాబు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదన్నారు. ఆయన్ను 24 గంటల ముందే కోర్టు ముందు హాజరు పరిచామన్నారు. ఇది కూడా పాపమేనా? అని ప్రశ్నించారు. చట్ట ప్రకారం కోర్టు ముందు హాజరు పరిచినా ఎందుకు గగ్గోలు పెడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు రూ.371 కోట్లను దోచేశారని ఆయన కోర్టుకు నివేదించారు. షెల్ కంపెనీలను సృష్టించి పెద్ద మొత్తాలను దారి మళ్లించారని వివరించారు. ఈ మొత్తం అంతా పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన డబ్బు అని తెలిపారు.

దోచేయడమే చంద్రబాబు విజన్, మిషన్

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో 35వ నిందితునికి గతంలో ఇదే కోర్టు రిమాండ్ తిరస్కరించిందని, దీనిపై తాము హైకోర్టును ఆశ్రయించి రిమాండ్ తిరస్కరణ ఉత్తర్వులను రద్దు చేయించామని సుధాకర్‌రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా హైకోర్టు, రిమాండ్ సమయంలో కింది కోర్టులు ఎలా వ్యవహరించాలో స్పష్టంగా చెప్పిందన్నారు. రిమాండ్ సమయంలో మినీ ట్రయల్ నిర్వహించడం తగదని, ఏ సెక్షన్ వర్తిస్తుంది.. ఏ సెక్షన్ వర్తించదు అన్న విషయాలను తేల్చరాదని తెలిపిందన్నారు. ఈ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం తీవ్రమైనదని, ప్రజాధనాన్ని లూటీ చేయడంలో చంద్రబాబు 'స్కిల్' చూపారని తెలిపారు. ప్రజాధనాన్ని దోచేయడమే చంద్రబాబు విజన్, మిషన్ అని కోర్టుకు నివేదించారు. సీమెన్స్ కంపెనీ ద్వారా రూ.371 కోట్లను దారి మళ్లించడంలో చంద్రబాబుది కీలక పాత్ర అని తెలిపారు. దీనిపై జర్మనీలోని సీమెన్స్ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించగా, అసలు సీమెన్స్ ఇండియా కుదుర్చుకున్న ఒప్పందాల సంగతి ఏమీ తమకు తెలియదని చెప్పిందన్నారు. సీమన్స్ ఇండియా కార్యకలాపాలపై అంతర్గత విచారణ జరిపించిందని తెలిపారు. ఇందులో సీమెన్స్ అక్రమాలన్నీ వెలుగు చూశాయన్నారు.

ఈ స్కామ్‌ను ఓ విజన్‌గా భావించారు

అసలు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌ను రాష్ట్ర ప్రభుత్వం గానీ, సీఐడీ గానీ వెలికి తియ్యలేదు. పూణే జీఎస్టీ అధికారులు ఈ స్కామ్‌ను వెలుగులోకి తెచ్చి, గత ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారన్నారు. అయితే గత చంద్రబాబు ప్రభుత్వం ఈ విషయాన్ని తమతో కుమ్మక్కైన కంపెనీలకు తెలియజేసిందన్నారు. ఆ తర్వాత స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిందన్నారు. చంద్రబాబు ప్రతి దానిని విజన్ కోణంలోనే చూస్తారని, ఈ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌ను కూడా విజన్‌లో భాగంగానే ఆయన భావించారని నివేదించారు. ఎలాంటి సంతకాలు, తేదీలు లేకుండా అప్పనంగా రూ.371 కోట్లను విడుదల చేసేయాలని ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారన్నారు. షెల్ కంపెనీలు, బోగస్ బిల్లులు సృష్టించి రూ.కోట్లు కొల్లగొట్టారన్నారు. ఈ కుంభకోణంలో చంద్రబాబు కీలక పాత్రధారి అని తెలిపారు. అందువల్ల ఆయనకు రిమాండ్ విధించాల్సిన అవసరం ఉందన్నారు.

రాజకీయ కారణాలతోనే అరెస్ట్

చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ, ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. అందులో భాగంగానే దురుద్దేశాలతో చంద్రబాబును అరెస్ట్ చేసిందన్నారు. రాజకీయ కారణాలతోనే ఆయన్ను అరెస్ట్ చేశారని తెలిపారు. సిద్ధాంతాలు, నైతిక విలువలను పక్కన పెట్టేసిందని చెప్పారు. సీఆర్‌పీసీ సెక్షన్ 164 కింద నమోదు చేసే వాంగ్మూలాలకు ఎలాంటి విలువ లేదన్నారు. 2.30 లక్షల మంది విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచేందుకు సీమెన్స్‌తో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఇందులో ఎలాంటి అవకతవకలు జరగలేదని తెలిపారు. ఈ ఒప్పందంలో అప్పటి అధికారులు కొందరు కీలక పాత్ర పోషించారని, ప్రభుత్వం వారి జోలికి వెళ్లడం లేదన్నారు. ఏమీ జరగని దానికి ఏదో జరిగినట్లు చెబుతూ, దానిని ఓ స్కామ్‌గా పేర్కొంటూ చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబుపై నమోదు చేసిన ఒక్కో సెక్షన్ ఆయనకు ఏ విధంగా వర్తించదో వివరించారు. చంద్రబాబుపై నమోదు చేసిన సెక్షన్లలో ఒక్క అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్) కింద నమోదు చేసిన కేసులు మినహా మిగిలినవన్నీ నామమాత్రపు కేసులేనన్నారు. ఐపీసీ సెక్షన్ 409 (నేరపూరిత విశ్వాస ఘాతుకం) అసలు వర్తించదన్నారు. పీసీ యాక్ట్ కింద నమోదు చేసిన కేసులకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరన్నారు. అయితే ప్రస్తుతం చంద్రబాబుపై నమోదు చేసిన కేసులో ప్రభుత్వ అనుమతి తీసుకోకుండానే దర్యాప్తు కొనసాగిస్తున్నారని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటు క్యాబినెట్ నిర్ణయమని, ఆ నిర్ణయాలకు నేరపూరిత చర్యలను ఆపాదించడానికి వీల్లేదన్నారు. చంద్రబాబును నంద్యాలలో అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. ఆయనను అరెస్ట్ చేసిన, విచారించిన అధికారుల సెల్ డేటా వివరాలను భద్రపరిచేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టును కోరారు.

కొనసాగిన సుదీర్ఘ వాదనలు

అనంతరం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు వాదనలు కొనసాగాయి. ఈ మధ్యలో న్యాయమూర్తి రెండుసార్లు విరామం ఇచ్చారు. భోజన విరామం తర్వాత ఓ గంటపాటు వాదనలు కొనసాగాయి. అనంతరం న్యాయమూర్తి ఉత్తర్వులను రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో తన ఉత్తర్వులను వెలువరించారు. చంద్రబాబు నాయుడుకు 14 రోజుల రిమాండ్ విధిస్తున్నట్లు న్యాయమూర్తి ఓపెన్ కోర్టులో ఉత్తర్వులు చదివి వినిపించారు. దీంతో కోర్టు హాలులో ఉన్న చంద్రబాబుతో సహా టీడీపీ న్యాయవాదులంతా ఒక్కసారిగా షాక్ తిన్నారు. కోర్టు హాలులో ఉన్న నారా లోకేష్ ముఖకవళికలు మారిపోయాయి. పోలీసులు చంద్రబాబును కోర్టు హాలులో నుంచి కోర్టు ప్రాంగణంలో ఉన్న పీపీ కార్యాలయంలో కూర్చోబెట్టారు. జైలుకెళ్లడం ఖాయం కావడంతో చంద్రబాబు, ఆయన న్యాయవాద బృందం అప్రమత్తమై అప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేసినా ఫలించలేదు.



రాజమహేంద్రవరం సెంట్రల్‌జైల్ వద్ద చంద్రబాబు

శనివారం మధ్యాహ్నం నుంచే హడావుడి

చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో విజయవాడలోని ఏసీబీ కోర్టులో శనివారం మధ్యాహ్నం నుంచే ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. చంద్రబాబును నంద్యాల నుంచి తీసుకుని సీఐడీ పోలీసులు విజయవాడకు బయలుదేరడంతో మధ్యాహ్నం 1 గంటకే టీడీపీ న్యాయవాదులు ఏసీబీ కోర్టుకు చేరుకున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సిద్దార్థ లూథ్రా వచ్చారు. ఆయనతో పాటు చంద్రబాబు న్యాయవాద బృందం అంతా కూడా వాదనలకు సర్వం సిద్ధం చేసుకుంది. చంద్రబాబును కోర్టు ముందు హాజరు పరిచేందుకు ఎదురు చూస్తూ కోర్టులోనే కూర్చొన్నారు. రాత్రి 8 గంటల వరకు వేచి చూసిన బాబు న్యాయవాద బృందం, ఎంతకూ కోర్టు ముందు హాజరు పరచకపోవడంతో హౌస్ మోషన్ రూపంలో ఓ పిటిషన్‌ను దాఖలు చేసింది. చంద్రబాబును తక్షణమే కోర్టు ముందు హాజరు పరిచేలా ఆదేశాలు ఇవ్వడంతో పాటు తన విచారణకు సంబంధించిన వివరాలను మీడియాకు లీక్ చేయకుండా, తనను అరెస్ట్ చేసిన పోలీసుల కాల్ డేటాను భద్రపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను తీసుకుని టీడీపీ న్యాయవాదులంతా న్యాయమూర్తి ఇంటి వద్దకు చేరుకున్నారు. అయితే ఈ పిటిషన్‌ను విచారించే పరిస్థితి లేకపోవడంతో వారు వెనుదిరిగారు. రాత్రి కావడంతో సిద్దార్థ లూథ్రా తదితరులు హోటల్‌కు వెళ్లిపోయారు. మిగిలిన న్యాయవాదులు కోర్టు ప్రాంగణంలోనే తమ తమ కార్లలో నిద్రపోయారు.


పోటాపోటీగా ఇరుపక్షాల న్యాయవాద బృందాలు

చంద్రబాబు రిమాండ్ విషయంలో అటు టీడీపీ న్యాయవాద బృందం, ఇటు సీఐడీ తరఫున ప్రభుత్వ న్యాయవాద బృందం పోటా పోటీగా వాదనలు వినిపించాయి. ఎలాగైనా చంద్రబాబుకు రిమాండ్ విధించకుండా చూడాలన్న పట్టుదలతో టీడీపీ న్యాయవాదులు వ్యవహరించగా, రిమాండ్ విధించేలా చేయాలని సీఐడీ తరఫున ప్రభుత్వ న్యాయవాదులు అంతే పట్టుదల చూపారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, తెలుగుదేశం పార్టీ నేతలకు ప్రతీ కేసులో న్యాయవాదిగా వ్యవహరిస్తున్న సిద్దార్థ లూథ్రా నేతృత్వంలో సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు పనిచేశారు. మరో వైపు అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి నేతృత్వంలో న్యాయవాదులు గట్టి వాదనలను వినిపించారు. ఇరుపక్షాలు కూడా వాదనల సమయంలో పెద్ద సంఖ్యలో సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టుల తీర్పులను ఉదహరించారు. ఆయా చట్ట నిబంధనలకు తమదైన భాష్యం చెప్పారు. ఓ దశలో చంద్రబాబు తనయుడు నారా లోకేష్ తమ న్యాయవాదులను అభినందించి, తమదే విజయం అన్న ధీమాను ప్రదర్శించారు. వాదనలు జరుగుతున్నంత సేపు లోకేష్ కోర్టు హాలులోనే ఉన్నారు. అలాగే చంద్రబాబును చూసేందుకు తెలుగుదేశం పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో కోర్టు వద్దకు తరలివచ్చారు. చంద్రబాబుకు ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు.

న్యాయవాదులతో కిక్కిరిసిన కోర్టు హాలు

ఆదివారం తెల్లవారుజామున 2 గంటల నుంచి కోర్టు ప్రాంగణంలో హడావుడి మొదలైంది. ఏ క్షణమైనా సిఐడీ అధికారులు చంద్రబాబును కోర్టు ముందు హాజరు పరచే అవకాశం ఉందనే వార్తలు రావడంతో అందరూ కోర్టు హాలు వద్దకు చేరుకున్నారు. సిద్దార్థ లూథ్రా సైతం 5.30 గంటలకల్లా కోర్టుకొచ్చేశారు. ఆయనతో పాటు సీనియర్ న్యాయవాదులు కనకమేడల రవీంద్ర కుమార్, దమ్మాలపాటి శ్రీనివాస్, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు, న్యాయవాదులు ప్రణతి, గింజుపల్లి సుబ్బారావు, సువ్వారి శ్రీనివాస్, పుల్లగూర నాగరాజు, అప్పసాని వినీత్ తదితరులు శనివారం నుంచే కోర్టు వద్ద ఉన్నారు. సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగిరెడ్డి, అదనపు పీపీ ఎస్.దుష్యంత్‌రెడ్డి, స్పెషల్ పీపీ వివేకానంద, ఏజీపీలు బాలకృష్ణ, సుమన్, న్యాయవాదులు శరణ్, కృష్ణలతో పాటు విజయవాడకు చెందిన న్యాయవాదులు ఉదయం 5.20 గంటలకు ఏసీబీ కోర్టుకు చేరుకున్నారు. న్యాయవాదులతో కోర్టు హాలు కిక్కిరిసింది. 5.40 గంటలకు సీఐడీ అధికారులు చంద్రబాబును ఏసీబీ కోర్టు ముందు హాజరు పరిచారు. కోర్టు హాలులో పెద్ద సంఖ్యలో ఉన్న న్యాయవాదుల వల్ల విచారణకు అటంకం కలుగుతుండటంతో న్యాయమూర్తి కొందరు న్యాయవాదులను బయటకు పంపి విచారణను కొనసాగించారు.

లూటీనే లక్ష్యంగా..



- రూ.6 లక్షల కోట్లకు పైగా చంద్రబాబు అక్రమార్జన
- స్కిల్ కుంభకోణం ఓ మచ్చుతునక మాత్రమే

సాక్షి, అమరావతి: వంద గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలి వానకు కూలినట్టుగా 27 కేసుల్లో స్టేలతో తప్పించుకున్న మాజీ సీఎం చంద్రబాబు స్కిల్ కుంభకోణంలో కటకటాలపాలయ్యారు. అవినీతి ఆరోపణలతో జైలు పాలైన తొలి తెలుగు మాజీ సీఎంగా చరిత్రలో నిలిచిపోయారు. టీడీపీ అధికారంలో ఉండగా చంద్రబాబు ప్రజాధనం లూటీకి పాల్పడిన తీరుపై సర్వత్రా చర్చ నడుస్తోంది. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి అవినీతి అజెండాగా పాలన కొనసాగించి ప్రజాధనాన్ని కొల్లగొట్టారని మేధావులు మండిపడుతున్నారు. 2014–19 మధ్య టీడీపీ పాలనలో అనేక స్కామ్‌లకు పాల్పడి రూ.6 లక్షల కోట్లను చంద్రబాబు అక్రమంగా ఆర్జించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఏలేరు నుంచి స్కిల్ స్కామ్ వరకూ అనేక రూపాల్లో ఆయన దోపిడీ చేసిన తీరు సర్వత్రా చర్చనీయాంశం అయింది. 1978లో రాజకీయాల్లో అరంగేట్రం చేసిన నాటి నుంచే దోపిడీలు, దౌర్జన్యాలు, రౌడీయిజంతో అక్రమార్జనే లక్ష్యంగా చంద్రబాబు రెచ్చిపోయారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో దిట్టగా పేరొందిన ఆయన 1995లో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారాన్ని కైవసం చేసుకుని అక్రమార్జనే లక్ష్యంగా వ్యవహరించారు. ఏలేరు రిజర్వాయర్ నిర్మాణం, కాలువల తవ్వకం కోసం జరిపిన భూకుంభకోణంలో అక్రమాలకు పాల్పడిన తీరు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇక రాష్ట్ర విభజన అనంతరం 2014లో అధికారంలోకి వచ్చిన అనంతరం చంద్రబాబు అవినీతికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి.

పంచభూతాల నుంచి ప్రభుత్వ శాఖల వరకూ

ఐదేళ్ల టీడీపీ పాలనలో నీరు, చెట్టు, మట్టి పంచభూతాల నుంచి ప్రభుత్వ శాఖలన్నింటిలో చంద్రబాబు పెద్ద ఎత్తున దోపిడీ చేశారు. కేవలం స్కామ్‌లు చేయడం కోసమే ప్రభుత్వ స్కీములను ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగానే స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి పాల్పడ్డారు. ఇక రాజధాని పేరిట రూ.లక్షల కోట్ల దోపిడీకి స్కెచ్ వేశారు. అధికారులను బెదిరించి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పులు చేసి చంద్రబాబుతో పాటు పొంగూరు నారాయణ రూ. రెండు వేల కోట్ల భూ దోపిడీకి ప్రణాళిక వేశారు. ఈ వ్యవహారంపై సీఐడీ సమగ్ర దర్యాప్తు చేపట్టింది. నారా లోకేశ్, లింగమనేని ఇందులో నిందితులుగా ఉన్నారు. పట్టణ పేదలకు టిడ్కో ఇళ్ల నిర్మాణాల పేరుతో రూ.8 వేల కోట్లకు పైగా అవినీతికి తెరతీశారు. ఫైబర్ గ్రిడ్‌లో టెరాసాఫ్ట్ పేరుతో రూ.284 కోట్లు కొట్టేశారు. ఇక కార్మికుల కష్టార్జితాన్ని సైతం వదల్లేదు. ఈఎస్ఐలో మందులు, పరికరాల కొనుగోళ్ల రూపంలో రూ.150 కోట్లకు పైగా దోపిడీకి పాల్పడ్డారు. అప్పటి కార్మిక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఇచ్చిన సిఫార్సు లేఖల ఆధారంగా టెండర్లు లేకుండా కంపెనీలకు కాంట్రాక్టులు అప్పగించి లూటీ చేశారు. ఈ వ్యవహారంపై ఏసీబీ కేసులు నమోదు చేసి అచ్చెన్నాయుడును సైతం అరెస్ట్ చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే. ప్రైవేట్ విద్యుత్ కొనుగోళ్ల రూపంలో చంద్రబాబు రూ.15 వేల కోట్ల అవకతవకలకు పాల్పడ్డారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసే ముసుగులో అడ్డగోలుగా దోచేశారు. ఇక సాగునీటి ప్రాజెక్టుల్లో కమిషన్‌ల రూపంలో పెద్ద ఎత్తున దండుకున్నారు.

మరోసారి మభ్యపెట్టే క్రమంలో..

2014–19 మధ్య ఐదేళ్ల పాలనలో రూ.6 లక్షల కోట్లకుపైగా కొల్లగొట్టిన చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని ప్రజలను మభ్యపెట్టే పనిలో పడ్డారు. మరోసారి టీడీపీకి అధికారం ఇస్తే ఆకాశమే హద్దుగా అవినీతి పెచ్చుమీరిపోతుందని, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి దోపిడీనే పరమావధిగా వ్యవహరిస్తుందని మేధావులు హెచ్చరిస్తున్నారు. స్కిల్ కుంభకోణం చంద్రబాబు కుంభకోణంలో కేవలం ఒక మచ్చుతునక మాత్రమేనని త్వరలో ఇలాంటివి మరిన్ని నిర్ధారణ అవుతాయని స్పష్టం చేస్తున్నారు.

'స్కిల్' స్కామ్ సమయంలో నేను ఆ శాఖ మంత్రి కాదు

- నాకు ఒక్క రూపాయి ఇచ్చారని నిరూపిస్తే పీక కోసుకుంటా
- అప్పటి మంత్రి వర్గంలో చర్చించాకే తుది నిర్ణయం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



మహారాణిపేట (విశాఖ దక్షిణ): స్కిల్ స్కామ్ సమయంలో తాను సంబంధిత శాఖ మంత్రిని కాదని, తొలుత విద్యా శాఖ పరిధిలో స్కిల్ డెవలప్‌మెంట్ ఉండేదని, ఆ తర్వాత కార్మిక శాఖతో అనుసంధానం చేశారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. తనకు గానీ, తన కుటుంబ సభ్యులకు గానీ ఈ ప్రాజెక్టు వల్ల ఒక్క రూపాయి వచ్చిందని నిరూపిస్తే పీక కోసుకుంటానని చెప్పారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అప్పటి మంత్రివర్గంలో ఎంతో మంది చదువుకున్న వారు ఉన్నారని, తాను.. చంద్రబాబు కలిసి ఏదో మాయ చేశామని చెప్పడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. 'రెండేళ్ల క్రితం కేసు పెట్టారు. అప్పుడు నా పేరు గాని, చంద్రబాబు పేరుగాని లేదు. మరి చంద్రబాబును ఎలా అరెస్టు చేశారు? తెలుగుదేశం హయాంలో కేబినెట్‌లో చర్చించాకే తుది నిర్ణయం తీసుకున్నాం. ఈ ప్రాజెక్టు వల్ల ఎంతో మంది యువకులకు లబ్ధి చేకూరింది. సీఐడీ చెబుతున్నట్టుగా రూ.371 కోట్ల అవినీతి అనేది ఒక ఊహ. ఆ రోజు ఈ ప్రాజెక్టును అమలు చేసిన అజేయ కల్లం, ప్రేమ చంద్రారెడ్డి పేర్లు ఎందుకు ప్రస్తావించలేదు. 409 సెక్షన్ ఎందుకు పెట్టారో తెలియదు. ఇది రాజకీయ కక్ష' అని అన్నారు. చంద్రబాబుకు సంఘీభావం ప్రకటించే హక్కు పవన్ కళ్యాణ్‌కు లేదా?' అని ప్రశ్నించారు.



ఇంత 'స్కిల్' ఉండి కూడా 'స్కిల్ డెవలప్‌మెంట్' స్కాంలో ఇరుక్కుపోవడం అస్సలు నచ్చలేదు!

ఖైదీ నంబర్ 7691

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు చంద్రబాబు

- పటిష్ట భద్రత మధ్య ప్రత్యేక కాన్వాయ్ ద్వారా తరలింపు
- రిమాండ్ ఖైదీగా నంబర్ కేటాయించిన జైలు అధికారులు
- కోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక గది, ఆహారం

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విజయవాడ/రాజమహేంద్రవరం : రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో ప్రధాన ముద్దాయి నారా చంద్రబాబు నాయుడును సీఐడీ అధికారులు ఆదివారం అర్ధరాత్రి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. జైలు అధికారులు ఆయనకు రిమాండ్ ఖైదీ నంబర్ 7691 కేటాయించారు. షెల్ కంపెనీల ముసుగులో నిధులు కొల్లగొట్టడంలో ప్రధాన భూమిక పోషించిన ఆయనపై సిట్ మోపిన అభియోగాలతో విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం ఏకీభవించింది. చంద్రబాబుకు న్యాయస్థానం 14 రోజులపాటు అంటే ఈ నెల 22 వరకు రిమాండ్ విధించింది. దాంతో చంద్రబాబును జ్యుడిషియల్ రిమాండ్ కోసం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించాలని సిట్ అధికారులు నిర్ణయించారు. న్యాయస్థానంలో అధికారిక లంఛనాలు పూర్తి చేశాక సిట్ అధికారులు జైళ్ల ఎస్కార్ట్‌తో ప్రత్యేక కన్వాయ్‌లో విజయవాడ నుంచి తరలించారు. ప్రతిపక్ష నేతగా ప్రభుత్వం కల్పించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంతో కూడిన కాన్వాయ్‌తోపాటు ప్రత్యేక బస్‌లో భద్రతా సిబ్బందితోపాటు ఎన్ఎస్‌జీ భద్రతా సిబ్బంది కూడా అనుసరించారు. విజయవాడ నుంచి ఆదివారం రాత్రి 10 గంటలకు చంద్రబాబు కాన్వాయ్ బయలుదేరింది. మార్గం మధ్యలో కాన్వాయ్‌లోని ఓ వాహనం (చంద్రబాబు ప్రయాణిస్తున్న వాహనం కాదు) బ్రేక్ డౌన్ అయ్యింది. దాంతో ఆ వాహనాన్ని పక్కన పెట్టేశారు. విజయవాడ నుంచి రాజమహేంద్రవరం వరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ముందుగానే పోలీసులు రోడ్డు క్లియరెన్స్ చేశారు. చంద్రబాబును తరలిస్తున్న కాన్వాయ్ అర్ధరాత్రి ఒంటి గంట అనంతరం సురక్షితంగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు చేరుకుంది. అనంతరం రిమాండ్ ఖైదీ చంద్రబాబును జైలు అధికారులకు అప్పగించారు. జ్యుడిషియల్ రిమాండ్‌కు సంబంధించిన అధికారిక లాంఛనాలు పూర్తి చేసి, ఆయనకు రిమాండ్ ఖైదీ నంబర్ 7691 కేటాయించారు. ఆ తర్వాత జైలులో స్నేహ బ్లాక్‌లోని ప్రత్యేక గదికి తరలించారు. న్యాయస్థానం ఆదేశాలతో ఆయనకు ప్రత్యేకంగా ఆహారం, అవసరమైన మందులు, ఇతర వసతులు కల్పించనున్నారు. రిమాండ్ ఖైదీగా చంద్రబాబును సెంట్రల్ జైలుకు తరలించడంతో ఎన్ఎస్‌జీ భద్రతా సిబ్బంది తాత్కాలికంగా ఆయన భద్రతా విధుల నుంచి వైదొలిగారు. తూర్పు గోదావరి జిల్లా పోలీసులు, జైళ్ల శాఖ అధికారులు చంద్రబాబుకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు.

జైలు అధికారుల సమావేశం

చంద్రబాబుకు రిమాండ్ విధించిన నేపథ్యంలో రాజమహేంద్రవరం జైలు అధికారులు అత్యవసర సమావేశం నిర్వహించారు. బాబుకు గది కేటాయింపు మొదలు వివిధ అంశాలపై చర్చించారు. మాజీ ముఖ్యమంత్రి కావడంతో ఖైదీలకు ఇచ్చే డ్రెస్ ఉండదని, మామూలుగా ఆయన ధరించే దుస్తులకు అనుమతిస్తామని చెప్పారు. కాగా, రాజమండ్రిలో భద్రతా ఏర్పాట్లను పోలీసు ఉన్నతాధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు.

ఖైదీ నంబర్.. సోషల్ మీడియాలో వైరల్

రిమాండ్ ఖైదీగా చంద్రబాబుకు 7691 నంబరు కేటాయించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 7 + 6 + 9 + 1 = 23 కావడమే అందుకు కారణం. 2019 ఎన్నికల్లో టీడీపీకి 23 సీట్లే వచ్చాయి. చంద్రబాబు అరెస్ట్ అయిన తేదీ 9-9-23. ఆ అంకెలు కలిపితే మొత్తం 23 అవుతోంది. దాంతో ఈ అంశంపై సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అయ్యాయి.

సెప్టెంబర్ 17 సంబురాలు ఘనంగా చేయండి: కేటీఆర్

విచ్ఛిన్నకర శక్తుల కుటిలయత్నాలను తిప్పికొట్టాలని పిలుపు

సాక్షి, హైదరాబాద్: ఈనెల 17వ తేదీన జాతీయ సమైక్యతా దినోత్సవ సంబురాలను ఘనంగా చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కె.తారకరామారావు పిలుపునిచ్చారు. జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని బీఆర్ఎస్ ఘనంగా నిర్వహి స్తోందని, రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ ఉత్సవాల్లో పాల్గొనాలని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్రం భారత సమాఖ్యలో విలీనమైన ఈ రోజున హైదరాబాద్ నగరంలో ని ర్వహించే వేడుకల్లో సీఎం కేసీఆర్ స్వయంగా పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభు త్వం అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించే సంబురాలకు మంత్రులు హాజరై జాతీయ జెండా ఎగరేస్తారని, ఈ కార్యక్రమాలను బీఆర్ఎస్ కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. సువిశాల భారతదేశంలో తెలంగాణ అంతర్భాగంగా మారి, రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్యంలోకి పరివర్తన చెందిన మహోజ్వల సందర్భం యావత్ తెలంగాణ సమాజానికి గుర్తుంటుందని, ఈ సందర్భాన్ని కూడా కొన్ని రాజకీయ పార్టీలు వక్రీకరిస్తున్నాయని విమర్శించారు. ప్రతి అంశాన్నీ మతంతో జోడించి చిచ్చుపెట్టే విచ్ఛిన్నకర శక్తుల కుట్రలను ప్రజలు గమనించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

కాంగ్రెస్‌వి దొంగ డిక్లరేషన్లు

- వాటిని ప్రజలు నమ్మబోరు: మంత్రి హరీశ్‌రావు
- వచ్చే ఎన్నికల్లో గెలిచేది బీఆర్ఎస్ పార్టీనేనని వ్యాఖ్య


చేప పిల్లలను వదులుతున్న హరీశ్ రావు, తలసాని, కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు

సిద్దిపేట జోన్: కాంగ్రెస్ నేతలు దొంగ డిక్లరేషన్లు ప్రకటిస్తున్నా రని, వా టిని ప్రజలెవరూ నమ్మబోరని మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీయే గెలుస్తుందని పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేటలో డిప్యూటీ స్పీకర్ పద్మారావు, మంత్రి శ్రీనివాస్ యాదవ్‌లతో కలిసి కేటీఆర్ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నా రు. స్థానిక చెరువులో చేప పిల్లలను వదిలారు. గంగపుత్రులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. ''కాంగ్రెస్ నేతలు ఏఐసీసీ పేరిట మీటింగులు పెట్టి దొంగ డిక్లరేషన్లు పెడతారు. దొంగ డిక్లరేషన్ చేసే కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మబోరు. వచ్చే ఎన్నికల్లో గెలిచేది బీఆర్ఎస్ పార్టీనే. ఇప్పటికే ప్రజలంతా కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా సెల్ఫ్ డిక్లరేషన్ చేశారు..'' అని హరీశ్‌రా వు పేర్కొన్నారు. హైదరాబాద్ తరహాలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నీరా కేఫ్‌లను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. కాగా ఒకప్పుడు తాను చూసిన సిద్దిపేట, ఇప్పుడు చూస్తున్న సిద్దిపేటకు చాలా తేడా ఉందని మంత్రి తలసాని పేర్కొన్నారు.

ఆ 3 నియోజకవర్గాలకేనా మీరు సీఎం, మంత్రులు?

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ సూటి ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలుంటే కేవలం గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట మాత్రమే అభివృద్ధి చెందాయని, కేవలం ఆ మూడు నియోజకవర్గాలకే మీరు సీఎం, మంత్రులా అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఆ మూడు నియోజకవర్గాలకే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లు ఎక్కువ నిధులు ఇస్తున్నారని, కొడంగల్ నియోజకవర్గం ఈ రాష్ట్రంలో భాగం కాదా అని వ్యాఖ్యానించారు. కొడంగల్ నియోజకవర్గంలోని బొమ్రాస్‌పేట మండలంతో పాటు దౌల్తాబాద్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రేవంత్ అనంతరం మాట్లాడుతూ, అభివృద్ధి చేస్తామని చెప్పి కొడంగల్ ప్రజల ఓట్లు వేయించుకున్న బీఆర్ఎస్ నేతలు ఐదేళ్లలో ఆ నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలోనే కొడంగల్ అభివృద్ధి జరిగిందని, మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈనెల 17న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే విజయభేరి బహిరంగసభకు పెద్దఎత్తున ప్రజలు హాజరు కావాలని రేవంత్ పిలుపునిచ్చారు.

బీసీబంధు కోసం దుబ్బాకలో బీజేపీ ఆందోళన

ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆధ్వర్యంలో రాస్తారోకో, అరెస్టు


హబ్షీపూర్‌లో రోడ్డుపై ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బీజేపీ శ్రేణులు

దుబ్బాక టౌన్: బీసీబంధు పథకాన్ని (ఆర్థిక సాయం) అర్హులందరికీ ఇవ్వాలని.. కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకు ఇవ్వడం దారుణమంటూ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు ఆదివారం దుబ్బాక మండలం హబ్షీపూర్ చౌరస్తాలో భారీ ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఉదయం 11 గంటలకు సిద్దిపేట-మెదక్ ప్రధాన రహదారిపై హబ్షీపూర్ చౌరస్తాలో వందలాది మంది బీజేపీ శ్రేణులతో కలసి రఘునందన్‌రావు బైఠాయించారు. సుమారు 3 గంటలకు పైగా రోడ్డుపై ఆందోళన చేపట్టారు. వర్షం పడుతున్నా లెక్కచేయకుండా రోడ్డుపైనే వంటావార్పుతో నిరసనకు దిగారు. బీజేపీ ఆందోళనతో రహదారికి ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రఘునందన్‌రావును అరెస్టు చేసి భూంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘునందన్‌రావు పోలీసులపై మండిపడ్డారు. తాను శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే ఎందుకు అరెస్టు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ అసమ్మతి నేత విందు భేటీకి కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్

హాజరుకాని బీఆర్ఎస్ అసమ్మతి నేతలు



కోదాడ: ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌పై అసమ్మతి బావుటా ఎగురవేసిన మార్కెట్ తాజా మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నాయకురాలు బుర్రా సుధారాణి ఆదివారం కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర వద్ద ఇచ్చిన విందు సమావేశానికి బీఆర్ఎస్ అసమ్మతి నేతలు హాజరుకాలేదు. అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరుకావడం పట్టణంలో చర్చనీయాంశమైంది. రెండు రోజులుగా చైర్‌పర్సన్‌తో అసమ్మతి నేతలైన శశిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావుతో జరుపుతున్న చర్చలు ఒక కొలిక్కిరాకపోవడంతో వారు సమావేశానికి దూరంగా ఉన్నట్లు తెలిసింది. తాము పార్టీలకు అతీతంగా విందు సమావేశానికి అందరినీ పిలిచామని, దానిలో భాగంగానే బీఆర్ఎస్ నాయకులతో పాటు, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి హాజరయ్యారని సుధారాణి తెలిపారు.

దొరా..ఇదేనా రైతు రాజ్యం: షర్మిల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కేసీఆర్ పాలన ఎట్లున్నదో సొసైటీల ముందట ఎరువుల కోసం నిలుసున్న రైతన్నలను చూస్తే అర్థమవుతుందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. ఇదేనా దొరా.. మీరు చెబుతున్న రైతు రాజ్యమని.. ఆమె ఆదివారం ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. ఎరువుల కోసం పడిగాపులు కాయడమేనా రైతు సంక్షేమం? అని నిలదీశారు. పంట పండించేందుకు సాయం లేదు.. పండిన పంట కొనేందుకు దిక్కులేదని మండిపడ్డారు. 26 లక్షల టన్నుల ఎరువులు ఉచితమని, 55 లక్షల రైతు కుటుంబాలకు ప్రయోజనకరమని ఊదరగొట్టారని ఎద్దేవా చేశారు. కానీ ఇచ్చిన హామీ నెరవేర్చాలన్న చిత్తశుద్ధి కేసీ ఆర్‌కు లేదన్నారు. ఉచితం మాట అటుంచితే ఎరువులు కొందామన్నా దొరకని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఈ ఖరీఫ్ కైనా ఉచిత ఎరువులు ఇచ్చి మాట నిలబెట్టుకోవాలని షర్మిల కోరారు.

కాంగ్రెస్‌తో పొత్తుకు సూత్రప్రాయ అంగీకారం

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



ఖమ్మం మయూరిసెంటర్: తెలంగాణలో జరిగే ఎన్నికల నేపథ్యంలో జాతీయ స్థాయిలో ఒకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, వామపక్షాలు కలిసి పోటీ చేయాలని సూత్రప్రాయంగా అంగీకారానికి వచ్చాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. సీపీఐ శతజయంతోత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా లక్ష మంది యువకులకు శిక్షణ ఇచ్చే జాతీయ స్థాయి ఇన్‌స్ట్రక్టర్లకు ఖమ్మంలో పది రోజుల శిక్షణ శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని ఆదివారం ప్రారంభించిన నారాయణ ఆ తర్వాత విలేకరులతో మాట్లాడారు. దేశంలో విపక్షాల 'ఇండియా' కూటమికి సంబంధించి ప్రధాని మోదీకి ఫోబియా పట్టుకుందని ఎద్దేవా చేశారు.

బీజేపీకి 6,003 దరఖాస్తులు

ఆదివారం చివరి రోజే 2,780 సమర్పణ • శనివారం దాకా అందిన అప్లికేషన్లు 3,223

- దరఖాస్తు ప్రక్రియకు కిషన్‌రెడ్డి, బండి సహా పలువురు ముఖ్య నేతలు దూరం!
- 90 వరకు అసెంబ్లీ స్థానాల్లోనే అభ్యర్థుల ఎంపికకు వడపోత?


ముషీరాబాద్ నుంచి పోటీకి దరఖాస్తు సమర్పించిన దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ టికెట్ల కోసం బీజేపీ ఆశావహుల నుంచి మొత్తం 6,003 దరఖాస్తులు అందాయి. ఇందుకు చివరి రోజైన ఆదివారం నాడే ఏకంగా 2,780 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో పార్టీ కార్యాలయం కోలాహలంగా మారింది. కాగా ఈ నెల 4 నుంచి శనివారం వరకు 3,223 దరఖాస్తులు అందడంతో మొత్తం దరఖాస్తుల సంఖ్య 6,003కు చేరుకుంది. అయితే రాష్ట్ర పార్టీకి చెందిన ముఖ్యనేతలు జి.కిషన్‌రెడ్డి, డా.కె.లక్ష్మణ్, డీకే అరుణ, బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, సోయం బాపూరావు, ఆయా నియోజకవర్గాల్లో పట్టు ఉన్న పలువురు నాయకులు దరఖాస్తు చేసుకోకపోవడం గమనార్హం. కాగా పార్టీలో, రాజకీయంగా అత్యంత సీనియర్లుగా ఉంటూ, ఆయా స్థానాల్లో తిరుగులేని నాయకులుగా ఉన్న తమను కూడా అందరిలాగే పోటీకి దరఖాస్తు చేసుకోవాలని సూచించడంపై కొందరు ముఖ్యనేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తనకు కేంద్ర కేబినెట్ బెర్త్ దాదాపుగా ఖరారు అయినట్టేనని, అందువల్ల తాను ఎంపీగానే పోటీ చేస్తానని, పార్టీ ఆదేశిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని పార్టీ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పార్టీ నాయకులు చెప్పినట్టు తెలుస్తోంది. తాను ప్రస్తుతం నిజామాబాద్ ఎంపీగా ఉన్నానని, పార్టీ ఆదేశిస్తే అసెంబ్లీకి పోటీ చేస్తానని ధర్మపురి అర్వింద్ స్పష్టం చేసినట్టు సమాచారం. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నట్టుగా చెబుతున్నారు.

25–30 మందితో తొలి జాబితా ఇప్పటికే రెడీ?

ఇటీవల జరిగిన రాష్ట్ర కోర్ కమిటీ భేటీలో 25–30 నియోజకవర్గాలకు ముఖ్య నేతల పేర్లతో కూడిన తొలి అభ్యర్థుల జాబితా ఖరారు చేసినట్లు రాష్ట్ర పార్టీ కార్యాలయ వ్యవహారాలు చూసే ఓ ముఖ్య నాయకుడు 'సాక్షి'కి తెలిపారు. అందువల్లే కీలక నేతలు దరఖాస్తు చేసుకోలేదని, మిగిలిన 90 వరకు అసెంబ్లీ స్థానాల్లోనే అభ్యర్థుల ఎంపికకు వడబోత చేపట్టాల్సి ఉంటుందని పార్టీవర్గాల సమాచారం. అదే సమయంలో రాష్ట్రంలో అధికార బీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్, ఇతర పార్టీలలో మారుతున్న రాజకీయ పరిణామాలకు అనుగుణంగా బలమైన నేతలు బీజేపీలోకి వచ్చే అవకాశమున్నందున కొన్ని స్థానాలు రిజర్వ్‌లో పెట్టాల్సి ఉంటుందని కూడా అంటున్నారు.

బండారు దత్తాత్రేయ కుమార్తె దరఖాస్తు

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ముషీరాబాద్ నుంచి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి, ఖైరతాబాద్ నుంచి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, శేరిలింగంపల్లికి మాజీ ఎమ్మెల్యే కుమారుడు రవికుమార్‌యాదవ్, ఎల్బీనగర్ సీటుకు డా. జి.మనోహర్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ కోసం డా.ఎస్.మల్లారెడ్డి, కొత్తగూడెం స్థానానికి కేవీ రంగా కిరణ్ దరఖాస్తు చేసుకున్నారు. సినీనటి జీవితా రాజశేఖర్ 5 సీట్లకు (జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, కూకట్‌పల్లి, సనత్‌నగర్, శేరిలింగంపల్లి) దరఖాస్తు చేసినట్లు తెలిసింది. హుజూరాబాద్ నుంచి పార్టీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, గజ్వేల్ నుంచి ఈటల సతీమణి జమున తమ ప్రతినిధుల ద్వారా దరఖాస్తులు పంపించినట్లు చెబుతున్నారు.

35 వేల బూత్‌ల నుంచి జన సమీకరణ!


- విజయభేరి విజయవంతంపై కాంగ్రెస్ దృష్టి
- డీసీసీ అధ్యక్షులతో జూమ్ ద్వారా సమావేశమైన నేతలు
- నేటి నుంచి మండల స్థాయిలో సమావేశాలు
- 12, 13, 14 తేదీల్లో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమీక్షలు

సాక్షి, హైదరాబాద్: పార్టీ అతిరథ మహారథులు హాజరు కావడంతో పాటు రానున్న ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చే ఐదు గ్యారంటీ కార్డు స్కీంలను ప్రకటించే 'విజయభేరి'పై కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించింది. ఈ సభను విజయవంతం చేయడం ద్వారా ఉత్సాహంగా ఎన్నికల శంఖారావాన్ని పూరించాలని భావిస్తోంది. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణకు, తుక్కుగూడకు సమీపంలో ఉన్న మహబూబ్‌నగర్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లోని నియోజకవర్గాల ప్రజలను కూడా పెద్ద సంఖ్యలో తరలించేందుకు పార్టీ నేతలు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులతో టీపీసీసీ ముఖ్య నేతలు జూమ్ సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 11 నుంచి మండల స్థాయి సమావేశాలు ఏర్పాటు చేయాలని, 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 35 వేల బూత్‌ల నుంచి సభకు కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చేలా చూడాలని సూచించారు. సోమవారం పార్లమెంటు పరిశీలకులు, టీపీసీసీ ఉపాధ్యక్షు లతో సమీక్ష నిర్వహించాలని, ఆ తర్వాత 12, 13, 14 తేదీల్లో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహించి జనసమీకరణ కసరత్తును పకడ్బందీగా పూర్తి చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

సమన్వయం చేసుకోండి: రేవంత్



విజయభేరి సభ విజయవంతం చేసే కార్యక్రమాన్ని పార్టీ నేతలతో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సమన్వయం చేసుకోవాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఈనెల 17న సోనియాగాంధీ ఐదు గ్యారంటీ కార్డు స్కీంలను ప్రకటిస్తారని, సభ ముగిసిన వెంటనే కాంగ్రెస్ నేతలు నియోజకవర్గాలకు వెళ్లి ఇంటింటికీ ఈ గ్యారంటీ కార్డులను అందజేయాలని కోరారు. ఈనెల 18న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటింటికీ వెళ్లి ఈ స్కీంల గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు.



"నావికులు, శాస్త్రవేత్తలు, తత్వవేత్తలను చూసినప్పుడు నాకు ప్రాణులన్నింటిలో మనిషి ఇంత వివేకవంతుడా అనిపిస్తుంది. పూజారులు, ప్రవక్తలను చూసినప్పుడు మనిషి ఇంత నీచుడా అనిపిస్తుంది.
– డైయొజినీజ్

సాక్షి

సోమవారం, 11 సెప్టెంబర్ 2023

జర్నలిస్టు రచయిత

ప్రపంచంలోని గొప్ప రచయితల్లో కొంతమంది వృత్తిరీత్యా జర్నలిస్టులుగా పనిచేశారు. ఒక రచయిత జర్నలిస్టు అయితే తన రోజువారీ 'స్టోరీ'లకు కథనబలాన్ని ఇవ్వగలడు. కానీ తమలోని రచయితనూ, జర్నలిస్టునూ వేరుగా ఉంచుకోవడానికే చాలామంది ప్రయత్నించారు. అనివార్యంగా ఆ రెండు పాత్రలూ కలిసిపోయే సందర్భాలు రావొచ్చు. అయితే, పూర్తి స్పృహతో తనలోని రచయితతో జర్నలిస్టును మేళవించినవాడు ట్రూమన్ కపోటి. ఆ మేళన ఫలితంగా నాన్-ఫిక్షన్ నవల ఉద్భవించింది. సాహిత్యానికి ఒక కొత్త ప్రక్రియను 'పరిచయం' చేసిన ట్రూమన్ కపోటి (30 సెప్టెంబర్ 1924 – 25 ఆగస్టు 1984) శతజయంతి సంవత్సరానికి ప్రారంభం ఇది.

యూఎస్‌లోని లూసియానా రాష్ట్రంలో జన్మించిన ట్రూమన్ కపోటీ ఐదేళ్లప్పుడే బడికి నిఘంటువు మోసుకెళ్లేవాడు. ఎనిమిదేళ్ల వయసులోనే రచయిత అవుతాననుకున్నాడు. చాలామందికి జీవితం సగం ముగిసేదాకా తమకు ఏం కావాలో తెలీదు. కానీ తాను ఆ కోవలోకి చెందని ప్రత్యేక జీవినని కపోటికి తెలుసు. 'ద న్యూయార్కర్' సహా ఇతర పత్రికలకు పనిచేస్తూనే, కథలు రాశాడు. ఇరవైల్లోకి వచ్చేనాటికే ఆయన సెలబ్రిటీ. 'ఆధునిక సాహిత్యపు ఆశాదీపం' అని మెచ్చుకున్నాడు సోమర్‌సెట్ మామ్. 'బ్రేక్‌ఫాస్ట్ ఎట్ టిఫనీస్' (1958) నవలికతో కపోటి పేరు మార్మోగిపోయింది.

రోజూ కనబడే చంద్రుడు కొన్నాళ్లుగా వార్తల్లో ఉన్నాడు. 1959లో రష్యా చంద్రుడి మీద దిగింది. అదే ఏడాది అమెరికాలో పెరోల్‌లో ఉన్న ఇద్దరు నేరస్థులు కాన్సాస్‌లోని ఒక ధనిక రైతును దోచుకోవడానికి పథకం వేశారు. ఇంట్లోకి ప్రవేశించి, యజమాని, ఆయన భార్య, వాళ్ల ఇద్దరు కౌమార కూతుళ్లను బంధించారు. తీరా నగదు రూపంలో ఏమీ దొరకదు. కేవలం సాక్ష్యంగా మిగిలిపోతారని నలుగురినీ హత్య చేశారు. అది అమెరికాలో పెను సంచలనం సృష్టించిన నేరవార్తల్లో ఒకటి. దాని ఆధారంగా ఆరేళ్ల పరిశోధన అనంతరం 'ఇన్ కోల్డ్ బ్లడ్' (1965) రాశాడు కపోటి. దీనికి వాడిన కథనాత్మక పాత్రికేయ టెక్నిక్‌ను 'నాన్‌ఫిక్షన్ నవల' అన్నాడు. జర్నలిజం, కథనం కలిసి కొత్త కళారూపానికి దారి తీయగలదని భావించాడు. సృష్టించే సామర్థ్యం ఉన్నప్పుడు, వాస్తవ కథనం కోసం శ్రమ పడటం దేనికి అన్న వైఖరి కొందరు రచయితల్లో ఉంటుంది. సీరియస్ రచయితల కళాత్మక స్థాయికి జర్నలిజం తగనిది అన్న అభిప్రాయమూ ఉండకపోదు. ఇదంతా కాదన్నా, ఒక మనిషి వ్యక్తిత్వాన్ని వడగట్టి రచనలోకి తేవడం అంటే చాలా రకాలుగా సిద్ధపడాలి. 'బ్రేక్‌ఫాస్ట్ ఎట్ టిఫనీస్' తన క్యారెక్టర్‌నే పెట్టి రాశాడని ఒకావిడ 8 లక్షల డాలర్లకు తెచ్చిన (విఫల) దావాను ఎదుర్కొన్న చేదు అనుభవం అప్పటికే కపోటికి ఉంది. పైగా, ఎంత నిజజీవిత కథనానికైనా ఊహాశక్తి లేకపోతే ప్రాణం పోయలేము. 'లిటెరరీ ఫొటోగ్రాఫర్'లా సూక్ష్మాంశాలను మనసులోకి ఎక్కించుకోవాలి. 'హ్యూమన్ టేప్ రికార్డర్'లా మారాలి. మరి విషయ సేకరణ ఎట్లా? తలుపులు తట్టడం సరే, వాళ్ల మనసులను మీటడం ఎలా? కపోటి ముందు ఆ ప్రాంతానికి వెళ్లి, అక్కడ కొన్నాళ్లు ఉన్నాడు. ఒక ఇంటర్వ్యూలా మాట్లాడితే అసౌకర్యం కాబట్టి, టేప్ రికార్డర్లు ఉపయోగించలేదు. వెళ్లేముందు ఒక సాధన చేశాడు: స్నేహితుడు ఓ పుస్తకంలోని పేజీలను చదివి వినిపిస్తాడు. దాన్ని కపోటి విని, తిరిగి రాసేవాడు. 'దాదాపు 95 శాతం కచ్చితత్వం' సాధించాడు. ఇన్ని చేసినా వార్తా కథనాలకు కాలం చెల్లిపోయే ప్రమాదం ఎక్కువ. వాస్తవ ఘటన ఒక తార్కిక ముగింపునకు వస్తే తప్ప రచనను ముగించలేం. ఈ సందర్భంలో తార్కిక ముగింపు అంటే, నేరస్థుల ఉరిశిక్ష అమలు కావడమే. రచయిత ఆ క్షణం కోసం ఎదురుచూడాలి. 'ఇది హింస,' అంటాడు కపోటి. ఆఖరికి 6,000 పేజీల నోట్సుతో– హంతకులు, బాధితులు, గ్రామీణ సమాజపు మనుషులు– మూడు కోణాల్లో చిత్రించిన 340 పేజీల 'ఇన్ కోల్డ్ బ్లడ్' తక్షణ బెస్ట్ సెల్లర్‌గా, కపోటి అత్యుత్తమ రచనగా సాహిత్య చరిత్రలో నిలిచిపోయింది. నాన్-ఫిక్షన్ నవల అనే ప్రక్రియను తాను పరిచయం చేయడం అనడం కంటే, అప్పటికే ఉన్నదాన్ని తాను అత్యున్నత స్థితికి తీసుకెళ్లానని మాత్రమే అనేవాడు కపోటి.

చిన్నతనంలోనే తల్లిదండ్రులు విడిపోవడంతో, బంధువుల ఇంట్లో పెరిగాడు కపోటి. ఎప్పుడూ వ్యాకులతతో ఉండేవాడు. ఆయన ఒంటరితనంలో స్నేహపు సెలయేరు పొరుగున ఉండే హార్పర్ లీ. అనంతర కాలంలో 'టు కిల్ ఎ మాకింగ్‌బర్డ్' నవలా రచయిత్రి. అందులోని 'డిల్' పాత్రను ఆమె కపోటి నమూనాగా తీర్చిదిద్దారు. కపోటి రచన 'అదర్ వాయిసెస్, అదర్ రూమ్స్'లో ఇడాబెల్ పాత్రకు లీ ప్రేరణగా నిలిచారు. వారి బాల్య స్నేహం చివరిదాకా కొనసాగింది. 'ఇన్ కోల్డ్ బ్లడ్' క్షేత్రస్థాయి పరిశోధనలో లీ సహాయం చేశారు. ముఖ్యంగా ఇంటర్వ్యూలు సాధించడంలో. హోమోసెక్సువల్ అని ప్రకటించుకున్న కపోటి, దాని తాలూకు తిరస్కరణను ఎదుర్కొన్నాడు. ఆ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. తన జీవితాన్ని పునర్నిర్మించుకునే అవకాశమే ఉంటే, వ్యాకులత లేకుండా చూసుకుంటానన్నాడు. 'ఒక కథను ఎంత సహజంగా చెప్పవచ్చో ఆ రూపాన్ని రచయిత కనుక్కున్నాడనేదానికి పరీక్ష ఏమిటంటే– ఆ కథ చదివాక, నువ్వు దాన్ని ఇంకోలా ఊహించగలుగుతున్నావా లేక అది నీ ఊహను నెమ్మదించేలా చేసి, అదే సంపూర్ణమూ, అంతిమమూ అనిపిస్తోందా? ఒక నారింజ ఫలాన్ని ప్రకృతి సరిగ్గా ఎలా చేసిందో అలా' అన్నాడు కపోటి. సాహిత్య జీవితం గురించి సరేగానీ, అరవై ఏళ్లు నిండకుండానే కన్నుమూసిన కపోటి జీవితం సంపూర్ణ ఫలమేనా అంటే చెప్పడం కష్టం!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, తిథి: బ.ద్వాదశి రా.12.04 వరకు తదుపరి త్రయోదశి, నక్షత్రం: పుష్యమి రా.9.29 వరకు తదుపరి ఆశ్లేష, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ప.12.20 నుండి 1.11 వరకు, తదుపరి ప.2.47 నుండి 3.36 వరకు, అమృతఘడియలు: ప.2.30 నుండి 4.15 వరకు.

సూర్యోదయం : 5.50
సూర్యాస్తమయం: 6.04
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సహకార పునరుద్ధరణకు ఉత్ప్రేరకం

జీ20 ప్రపంచ నాయకుల న్యూఢిల్లీ శిఖరాగ్ర సదస్సు విజయవంతంగా ముగిసింది. 2022 డిసెంబర్ 1న అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన భారత్ పదవీకాలం ఈ ఏడాది నవంబర్ 30న ముగియనుంది. అంతర్జాతీయ పరిణామాలు సవాలు విసురుతున్న సమయంలో అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటికీ, తన ఏడాది పదవీ కాలంలో భారత్ అన్ని దేశాలనూ కలుపుకొని పోవడానికే ప్రయత్నించింది. బహుముఖ ప్రపంచంలో సంపన్నమైన, సురక్షితమైన భవిష్యత్తును రూపొందించడానికి ఏకైక మార్గం సహకారమే అని గుర్తు చేసింది. ప్రపంచ సహకారాన్ని పునరుజ్జీవింపజేయడానికి ఇది ఒక నమూనాగా ఉపయోగపడుతుంది. చెప్పాలంటే, ఇండియా చేయాల్సినదానికంటే ఎక్కువే చేసింది.

వైఫల్యాలున్నా... కీలకమే!

సందర్భం



దామియన్ కేవ్

జీ20 వార్షిక సదస్సు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కోసం ఒక ఉన్నతమైన లక్ష్యాలతో కూడిన సమన్వయ విధానాన్ని అనుసరించడం కోసం ప్రపంచ నాయకులను ఒకచోట చేర్చుతుంది. కానీ తన ఆశయాల పట్ల అది ఎంత పురోగతి సాధించింది?

1999లో ఏర్పడినప్పటి నుండి జీ20 ఉమ్మడి ప్రకటనలు చాలావరకు గాలి పొగల వంటి ఘనమైన తీర్మానాలే తప్ప, కార్యాచరణ శూన్యం. సభ్యదేశాల పనితీరు ఆశించినంతగా లేనప్పుడు, స్పష్టమైన పరిణామాలు ఉండవు. ఒక ఉదాహరణ. 2021 రోమ్ సదస్సులో, జీ20 నాయకులు భూతాపాన్ని 'అర్థవంతమైన, సమర్థమైన చర్యలతో' పరిమితం చేస్తామని చెప్పారు. విదేశాలలో బొగ్గు విద్యుత్ ప్లాంట్లకు ఆర్థిక సహాయం అందించడాన్ని ముగిస్తామని చేసిన ప్రతిజ్ఞ హైలైట్ అయింది. కానీ రోమ్ సదస్సు ప్రకటన దేశీయ బొగ్గు పెట్టుబడులను వదిలిపెట్టేసింది. 2022లో, అంతర్జాతీయ ఇంధన సంస్థ ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కొత్త గరిష్ఠ స్థాయికి చేరుకుంది. జీ20 ప్రకటనలో, బొగ్గు వినియోగాన్ని వెంటనే ముగించాలనే విషయంపై శాస్త్రీయ ఏకాభిప్రాయం ఉన్నప్పటికీ, 2023లో బొగ్గుపై పెట్టుబడి మరో 10 శాతం పెరిగి, 150 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

1990ల చివరలో కరెన్సీ విలువ తగ్గింపుల వెల్లువ తర్వాత ఆర్థిక మంత్రుల సమావేశంతో జీ20 ప్రారంభమైంది. ఒక దశాబ్దం తర్వాత ప్రపంచ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ప్రపంచ నాయకుల వార్షిక సమావేశానికి జీ20 నాంది పలికింది. ఈ కూటమిని నెలకొల్పిన దేశాలు, తర్వాత పెరుగుతున్న శక్తులు రెండింటినీ సమావేశపరచడం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మెరుగ్గా పరిరక్షించవచ్చని విశ్వసించారు. ఈ విశ్వాసం సరైందేనని ముందస్తు ఆధారాలు సూచించాయి.

2008, 2009లో నాలుగు ట్రిలియన్ డాలర్ల విలువైన చర్యలకు అంగీకరించడం ద్వారా, విశ్వాసాన్ని పునర్నిర్మించడానికి బ్యాంకు సంస్కరణలను ప్రారంభించడం ద్వారా, ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించినందుకు చాలామంది నిపుణులు జీ20ని ప్రశంసించారు. 2016లో చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో వాతావరణ సమస్యకు సంబంధించి పారిస్ ఒప్పందంపై తమ రెండు దేశాలూ సంతకం చేస్తాయని అమెరికా అప్పటి అధ్యక్షుడు బరాక్ ఒబామా, చైనా నాయకుడు షీ జిన్‌పింగ్ ప్రకటించారు. దీంతో నాయకులను ఒకచోట చేర్చే శక్తిని జీ20 ప్రపంచానికి చూపించింది.



ఇటీవల అంటే 2021లో, ప్రతి దేశానికి కనీసం 15 శాతం ప్రపంచ కనిష్ఠ పన్నుతో కూడిన ప్రధాన పన్ను సవరణకు జీ20 సదస్సు మద్దతునిచ్చింది. అమెజాన్ వంటి బడా అంతర్జాతీయ వాణిజ్య సంస్థలు తమ ఉత్పత్తులను విక్రయించే దేశాలలో కార్యాలయాలు లేకపోయినా, పన్నులు చెల్లించాల్సిన అవసరం ఉన్న కొత్త నిబంధనలకు కూడా ఇది మద్దతిచ్చింది.

ప్రభుత్వ ఆదాయానికి బిలియన్లను అదనంగా జోడించడమే కాకుండా, పన్నుల స్వర్గధామాలను ఏర్పర్చి, కార్పొరేషన్లకు చోదక శక్తిగా మార్చడానికి జీ20 ప్రణాళిక హామీ ఇచ్చింది. కానీ, కూటమి చేసిన అనేక ప్రకటనల మాదిరిగానే, వాటి తదుపరి అమలు బలహీనంగా ఉంటూవచ్చింది. 'గ్లోబల్ ట్యాక్స్ ఒప్పందం సరైన దిశలో ఒక ముఖ్యమైన అడుగు' అని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఈ సంవత్సరం ప్రకటించింది, 'అయితే అది ఇంకా పనిచేయడం లేదు' అని పేర్కొంది.

జీ20 ప్రారంభమైనప్పుడు, ప్రపంచాన్ని ఎలా కలిపి ఉంచాలనే దానిపై మరింత ఏకాభిప్రాయం ఏర్పడింది. స్వేచ్ఛా వాణిజ్యం పెరిగింది. అధికారం కోసం పోటీ ఒక పాత జ్ఞాపకం లాగే కనిపించింది. పైగా, ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ వంటి వయసుడిగిన సంస్థల స్థానంలో జీ20 విస్తృతమైన అధికార స్థావరంగా దారితీస్తుందని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆశావాదులు భావించారు. ఆ ఆశలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. పైగా మరెక్కడో వికసించాయి కూడా! ఇటీవల దక్షిణాఫ్రికాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం తాజా ఉదాహరణ. కానీ విభేదాలు జీ20 జట్టు ప్రయత్నాలను దెబ్బకొట్టాయి. అమెరికా, చైనా తీవ్ర పోటీదారులుగా మారాయి. కోవిడ్ –19 మహమ్మారి, ఉక్రెయిన్‌లో యుద్ధం తర్వాత ఆర్థిక వ్యవస్థలు ప్రమాదకరంగా కనిపించడంతో జాతీయవాదం పెరిగింది. యుద్ధరంగానికి దూరంగా ఉన్న దేశాల్లో ఆహారం, ఇంధన ధరలను పెంచింది.

కొంతమంది విమర్శకులు జీ20ని తొలగించాలని కోరుకుంటున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఈ సంవత్సరం సమావేశాన్ని దాటవేయడంతో అది ఇప్పటికే బలహీనపడిందని వారు అంటున్నారు. అయితే, జీ20 వైఫల్యాలు అంతర్జాతీయ సంస్థలలో ఆధునికీకరణ అవసరాన్ని సూచిస్తాయని చాలామంది విదేశాంగ విధాన నిపుణులు సూచిస్తున్నారు.

వ్యాసకర్త 'న్యూయార్క్ టైమ్స్' పాత్రికేయుడు

మెరుగ్గా వ్యవహరించిన భారత్

సందర్భం



బోర్గే బ్రెండే

అంతర్జాతీయ పరిణామాలు సవాలు విసురుతున్న సమయంలో గత ఏడాది భారతదేశం జీ20 అధ్యక్ష బాధ్యతలు చేపట్టింది. కోవిడ్-19 మహమ్మారి ప్రభావం నుండి ప్రపంచం క్రమంగా కోలుకున్నప్పటికీ, ప్రపంచ వృద్ధి ఇంకా దుర్బలంగానే ఉంది. ద్రవ్యోల్బణం కూడా మొండిగా ఉంది. విపరీతమైన వాతావరణ ఘటనలు పెరుగుతున్న తరుణంలో (రికార్డుల పరంగా జూలై అత్యంత వేడి అయిన నెల అని గ్రహించాలి), వాతావరణ మార్పులు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఈ 'కార్యాచరణ దశాబ్ది'లో తక్షణ చర్యలు అవసరం.

అయితే, అంతర్జాతీయ సహకారాత్మక చర్యకు సంబంధించిన ఆవశ్యకత స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ – భౌగోళిక రాజకీయ పోటీ, ఘర్షణ ప్రమాదాలు ఆ సహకారానికి అడ్డుగా నిలుస్తున్నాయి. ఈ కష్టతరమైన ప్రపంచ ముఖచిత్రాన్ని పరిగణనలోకి తీసుకుంటే, బహుశా భారతదేశ అత్యంత పరిణామాత్మకమైన, అత్యంత బోధనాత్మకమైన నిర్ణయం, జీ20 చర్చా ప్రక్రియకు ఉపక్రమించడం! చెప్పాలంటే, ఇండియా చేయాల్సినదాని కంటే ఎక్కువ చేసింది. అత్యంత సంఘటిత ప్రక్రియను నడిపించడం ద్వారా సహకార విధానంలోకి మొగ్గు చూపింది. భౌగోళిక కమ్యూనిటీలు అన్నింటికీ స్వరాలు ఉండాల్సిన ఈ బహుముఖ, బహుళ వాటాదారుల విధానం... ప్రపంచ సహకారాన్ని పునరుజ్జీవింపజేయడానికి ఒక నమూనాగా ఉపయోగపడుతుంది. మన భాగస్వామ్య ప్రాధాన్యాలపై పురోగతి సాధించడానికి ప్రపంచం తక్షణమే మార్గాలను కనుగొనాల్సిన తరుణంలో ఇది చాలా కీలకమైనది.

ప్రపంచ జనాభాలో 85 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న దక్షిణార్ధ దేశాల సమూహానికి బహుముఖ సంభాషణలలో తరచుగా చోటివ్వరు. అయితే దక్షిణార్ధ ప్రపంచ (గ్లోబల్ సౌత్) వాణికి అవకాశం ఇవ్వడం ద్వారా భారతదేశం భౌగోళికంగా జీ20 చర్చలను విస్తరించింది. జీ20 కూటమి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన మొదటి నెలల్లో భారతదేశం 125 దేశాలకు చెందిన నాయకులు, మంత్రుల భాగస్వామ్యంతో కూడిన 'వాయిస్ ఆఫ్ ది గ్లోబల్ సౌత్' శిఖరాగ్ర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. జీ20 కూటమిలో ప్రాతినిధ్యం వహించని దేశాలతో సంప్రదింపులు జరపడం, వారి ప్రాధాన్యాలను అర్థం చేసుకోవడమే దీని లక్ష్యం.

అటువంటి ప్రాధాన్యాల్లో ఒకటి ప్రపంచ సార్వభౌమాధికార దేశాల రుణ సమస్య. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 50 శాతం దేశాలు తీవ్రమైన రుణ బాధలో ఉన్నట్టు అంచనా. ఈ రుణ విచికిత్స కోసం భారతదేశం గణనీయమైన ప్రోత్సాహాన్ని ఇచ్చింది. 3 ట్రిలియన్ డాలర్ల సామూహిక జీడీపీ ఉన్న 55 ఆఫ్రికన్ రాజ్యాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆఫ్రికన్ యూనియన్‌ను జీ20లో చేర్చాలని కూడా భారతదేశం వాదించింది (ఈ మేరకు సఫలమైంది కూడా).

G20 भारत 2023 INDIA

విభిన్న భౌగోళిక ప్రాంతాల నుండి పెట్టుబడులను తీసుకువచ్చే బహుముఖ ప్రక్రియకు నాయకత్వం వహించడంతో పాటు, భారతదేశం కమ్యూనిటీలలో కూడా వాటాదారులతో చర్చలు జరిపింది. ఉదాహరణకు, థింక్20 కమ్యూనిటీ అనేది, జీ20కి 'ఐడియా బ్యాంక్'గా పనిచేస్తుంది. అదే సమయంలో, ప్రపంచ వాణిజ్య కమ్యూనిటీకి ప్రాతినిధ్యం వహించే అధికారిక డైలాగ్ ఫోరమ్‌గా బి20 వ్యవహరిస్తుంది. గ్లోబల్ స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు మొట్టమొదటిసారిగా 'స్టార్టప్20 ఎంగేజ్‌మెంట్ గ్రూప్' ప్రాతినిధ్యం వహిస్తుంది.

జీ20 కూటమి అధ్యక్ష బాధ్యతల్లో ఉన్న భారత్, సాధారణ సవాళ్లను పరిష్కరించడానికి ఒక సాధనంగా అంతర్జాతీయ బహుళ వాటాదారుల సహకారానికి ప్రాముఖ్యమిస్తోంది. ఈ విధానం స్పష్టమైన హామీని కలిగి ఉంది. పెరుగుతున్న సంక్లిష్ట ప్రపంచంలో– భౌగోళికాలు, వ్యాపార రంగాలు, పర్యావరణ వ్యవస్థలు, కమ్యూనిటీలలోని సవాళ్లను పరిష్కరించడానికి బహుళ వాటాదారుల విధానం చాలా అవసరం. సమ్మిళిత జీ20 ప్రక్రియను తీర్చిదిద్దడానికి చేసిన భారత ప్రయత్నాలను సులభంగా తీసేయకూడదు.

జనాభాలో ప్రపంచంలోనే అతిపెద్ద దేశం భారత్. ప్రస్తుతం నిట్టనిలువుగా ఎదుగుతున్న పథంలో ఉంది. అన్ని పెద్ద ఆర్థిక వ్యవస్థలలో వరుసగా మూడేళ్లుగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. అంతేకాకుండా 2030 నాటికి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది. 100 కంటే ఎక్కువ స్టార్టప్ యునికార్న్స్ (1 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువ కలిగిన స్టార్టప్‌లు) కలిగివుంది. ఇటీవలి సంవత్సరాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పెరుగుదలను చూసింది. ఇవి 2021–22 ఆర్థిక సంవత్సరంలో 85 బిలియన్ డాలర్ల కొత్త రికార్డు స్థాయికి చేరుకున్నాయి. కొన్ని అంచనాల ప్రకారం, ప్రపంచం త్వరలో కొత్త జీ3 యుగానికి స్వాగతం పలుకుతుంది. ఈ అంచనా అమెరికా, చైనాతోపాటు ప్రపంచంలోని ఉత్కృష్ట దేశాలలో భారతదేశాన్ని కూడా చేర్చింది.

ఇది మరోలా ఉండి వుంటే, ఈ పరిణామాలు వేరుగా ఉండేవి. ఇదంతా భారతదేశం దాని తలలోకి ఎక్కించుకొని ఉండవచ్చు. అందరినీ కలుపుకొని పోవడం కాకుండా, కొందరితో ప్రత్యేకంగా చర్చలు జరిపి వుండొచ్చు. కానీ భారతదేశం స్వభావరీత్యా పైనుంచి కిందివరకూ చర్చలను నడిపించడానికి ప్రోత్సహించింది. జీ20 అధ్యక్షతలో తొలి నుండీ 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' మకుటంతో, మరింత సంపన్నమైన, సురక్షితమైన భవిష్యత్తును రూపొందించడానికి ఏకైక మార్గం సహకారమే అని గుర్తు చేసింది. సహకారం పట్ల అంతర్జాతీయ నిబద్ధత క్షీణిస్తున్న తరుణంలో, భారతదేశ జీ20 అధ్యక్షత ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాత్రధారులు తమ సహకార విధానాలకు మళ్లీ కట్టుబడి ఉండాలని గుర్తుచేస్తోంది.

వ్యాసకర్త వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అధ్యక్షుడు; నార్వే మాజీ విదేశాంగ మంత్రి

మాట తప్పిన ఆత్రేయ!

సందర్భం




డా॥ పైడిపాల

మాట తప్పడం ఆత్రేయకు మామూలు అనీ, ఆయన మాటను పాటిస్తే అది విశేషమని లోక వ్యాప్తమైన ప్రతీతి. ఆత్రేయ రాయక నిర్మాతలను ఏడిపించేవారనీ, అందుకే ఆయన పుల్లయ్య నుంచి మురారి వరకూ అనేక నిర్మాతల ఆగ్రహానికీ, ఆ తర్వాత ఆనందానికీ కారకులయ్యేవారని పరిశ్రమలో కథలు వినిపించేవి. వృత్తి రీత్యా ఆత్రేయ సత్యహరిశ్చంద్రుడు కాకపోవడం నిజమైనా, అవసాన కాలంలో ఆయన ఎంతో ముచ్చటపడి ఇచ్చిన మాట విధి వశాత్తూ వమ్ము కావడం ఆయన సుకవి మీద అభిమానులందరికీ సానుభూతి కలిగించే విషాద కరమైన ఉదంతం!

ముద్రణ పట్ల వ్యామోహం లేని ఆత్రేయకు ఆఖరి దశలో తను రాసిన సినిమా పాటల్లో కొన్నిటిని 'నా పాట నీ నోట పలకాలి' అనే పేరుతో పుస్తక రూపంలో తీసుకురావాలనే కోరిక కలిగింది. కొందరు నిర్మాతలు వాగ్దానాలు చేసినా, అది సాకారం కాలేదు. చివరకు చిరకాల మిత్రులైన కొంగర జగ్గయ్య దగ్గర ఈ విషయం వెల్లడించగా, ఆయన ఆత్రేయ అంతవరకు రాసిన మొత్తం సినిమా పాటల్ని రెండు, మూడు సంపుటాలుగా వెలువరిద్దామని ప్రతిపాదించారు. అనుకోకుండా తన కల నెరవేరబోతున్నందుకు ఆనందంతో తలమునకలైన ఆత్రేయ ఆ పాటల సంపుటాలు అట్టపెట్టెల్లో ఉంచే 'సెట్స్'గా రావాలని అభిలషించారు. జగ్గయ్య ఆమోదించారు. ఆ రోజు నుంచే (1989 ఆగస్టు 13) ఆత్రేయ తన పాటల సెట్లను ఊహించుకొని మురిసిపోతూ, ఆ ముద్రణ ముచ్చట గురించి ఆత్మీయులకు చెప్పసాగారు.

సభలకూ, సమావేశాలకూ దూరంగా ఉండే ఆత్రేయ ఒక ఆప్త మిత్రుని బలవంతం మీద ప.గో. జిల్లా భీమవరంలో జరుగుతున్న 'అల్లూరి సీతారామరాజు సంగీత నాటక కళా పరిషత్' నాటక పోటీలకు చూద్దానికి ముఖ్య అతిథిగా వెళ్లారు. ఆ ప్రదర్శనలతో స్ఫూర్తి పొంది తను రాయాలనుకున్న 'ఆఖరి నాటకా'నికి శ్రీకారం చుట్టాలనే తలంపుతో ఆయన రెండ్రోజులపాటు ఆ నాటకాలను చూస్తూ ఉండిపోయారు. అలాంటి అరుదైన అవకాశాన్ని వినియోగించుకోవాలని స్థానిక రామరాజభూషణ సాహిత్య పరిషత్ వారు ఒక సాయంకాల సమావేశానికి ఆత్రేయను అతిథిగా ఆహ్వానించారు. ఆ సమావేశంలో పలువురు కవులు, సాహితీవేత్తలు ఆత్రేయ నాటకాల గురించి, పాటల గురించి అద్భుతమైన ప్రసంగాలు చేసి వారి రచనలను ఆయనకు కానుకలుగా సమర్పించారు. వారి అభిమానానికి ముగ్ధులైన ఆత్రేయ ప్రతిస్పందిస్తూ ముక్తసరిగా మాట్లాడి, మరోసారి వచ్చి ఆ సభ్యులంతా తృప్తిపడేలా సుదీర్ఘోపన్యాసం చేస్తానన్నారు. అంతేగాక త్వరలో అచ్చుకానున్న తన పాటల సంపుటాలను భీమవరం పంపిస్తానని వాటిని తనకు పుస్తకాలనిచ్చిన రచయితలందరికీ అందజేయాలనీ పరిషత్ నిర్వాహకులు రాయప్రోలు భగవాన్ గారిని కోరారు.



ఆత్రేయ

పుస్తక ముద్రణ గురించి చర్చించడానికి జగ్గయ్య గారిని తిరిగి కలవడానికి నిర్ణయించిన 1989 సెప్టెంబరు 13న ఆత్రేయ మాట తప్పారు. ఆకస్మికంగా తిరిగిరాని లోకానికి పయన మయ్యారు. పాటల సంపుటాలతో పాటు మనస్విని సౌజన్యంతో వెలువడిన 7 సంపుటాల 'ఆత్రేయ సాహితి'ని ఆయన చూసుకోలేదు. ఉద్వేగంతో ఆయన మాటిచ్చినట్టు ఆత్రేయ రచనల సెట్ రామరాజ భూషణ సాహిత్య పరిషత్ సాహితీ వేత్తల కందలేదు!

వ్యాసకర్త సినీగేయసాహిత్య పరిశోధకులు
(సెప్టెంబరు 13న ఆత్రేయ వర్ధంతి)

వ్యక్తిగా వినమ్రుడు... వ్యవస్థగా త్రివిక్రముడు

అభిప్రాయం



బి.టి. గోవిందరెడ్డి

ప్రముఖ పారిశ్రామికవేత్త ఎనభై ఆరేళ్ల రతన్ నావల్ టాటాను పరిచయడం చేయడమంటే సూర్యుణ్ణి దివిటీతో చూపే ప్రయత్నం చేయటం. టాటా గురించి మళ్లీ మళ్లీ చెప్పుకోవడం ఎందుకంటే క్యాలెండర్ మారిన ప్రతిసారీ ఆయన కొత్తగా కనిపిస్తారు. పారిశ్రామిక రంగాన్ని సమస్యలు చుట్టిముట్టినప్పుడల్లా ఆయన సరికొత్తగా వెలుగులీనుతారు. తోటి పారిశ్రామికవేత్తలకు మాత్రమే కాదు, సమాజం మొత్తానికి భరోసాగా నిలుస్తారు.

బడా పారిశ్రామికవేత్తగానే కాదు... వ్యక్తిగా కూడా రతన్ టాటా సమున్నతుడు. చదువయ్యాక అమెరికాలోని లాస్ ఏంజెలిస్‌లో ఉద్యోగం చేస్తున్న సమయంలో ఒకమ్మాయిపై రతన్ మనసు పారేసుకున్నారు. ఆమె కూడా ఆయన్ను ప్రేమించింది. ఈలోగా 1962లో భారత-చైనా యుద్ధం వచ్చింది. అంతే! ఈ వివాహానికి తొలుత అంగీకరించిన ఆమె తల్లిదండ్రులు భయంతో మీమాంసలో పడ్డారు. సరిగ్గా అదే సమయంలో నాయనమ్మ నవాజ్ బాయ్ టాటాకు ఒంట్లో బాగోలేదని కబురంది రతన్ భారత్ వెళ్లాల్సి వచ్చింది (రతన్‌కు పదేళ్ల వయసున్నప్పుడే తల్లితండ్రులు నావల్ టాటా, సూనీ టాటా విడాకులు తీసుకున్నారు. అందుకే రతన్ నాయనమ్మ పెంపకంలో పెరిగారు). అంతా సవ్యంగా పూర్తయి అమెరికా వెళ్లేసరికి ప్రియురాలు తల్లితండ్రుల మాట విని వేరే పెళ్లి చేసుకుంది. పర్యవసానంగా రతన్ బ్రహ్మచారిగానే ఉండిపోయారు.

ఒకరోజు ఎల్‌ఈడీ టీవీ బిగించటానికి రతన్ టాటా ఇంటికి వెళ్లిన టెక్నీషియన్ ఆయన సాధారణ జీవితం చూసి ఆశ్చర్యపోయాడట. ఎందరో సంపన్నుల ఇళ్లకు వెళ్లి వాళ్ల వైభోగాన్ని చూసిన అతడు టాటా ఇల్లూ అలాగే ఉంటుందనుకున్నాడు. తీరా వెళ్లి తలుపు తడితే సాధారణ షార్ట్స్, పైన ఒక బనీనుతో ఉన్న రతన్ స్వయంగా తలుపు తీశారట. టీవీ బిగించాల్సిన రూమ్‌లోకి తీసుకెళ్లారట. ఆ గది సైతం ఎంతో సాదాసీదాగా, పాతకాలం నాటి ఫర్నిచర్‌తో ఉందట. ఆ సాంకేతిక నిపుణుడు బిగించిన టీవీ కూడా అతి సాధారణమైన 32 అంగుళాల సోనీ టీవీ!

'సరైన నిర్ణయాలు' తీసుకోవడంలో నాకు నమ్మకం లేదు. నేనొక నిర్ణయం తీసుకుంటాను. అది సరైనది అయ్యేలా చేస్తాను. అంతే...' అని అన్నాడాయన ఒకసారి. అందుకే కావొచ్చు, ఆయన హయాంలో టాటా గ్రూపు ఆదాయం 40 రెట్లు మించి పెరిగింది. ఇవాళ టాటా గ్రూపు బ్రాండ్ విలువ 2,600 కోట్ల డాలర్లు. మొన్న మార్చి నాటికి ఆ గ్రూపు మార్కెట్ వ్యాల్యూ 21.1 లక్షల కోట్లు. ఆయన నెట్‌వర్త్ అక్షరాలా రూ. 8,250 కోట్లు! ఇది ముఖేశ్ అంబానీ నెట్‌వర్త్ రూ. 9,610 కోట్లతో పోలిస్తే కాస్త తక్కువే కావొచ్చు.



రతన్ టాటా

మరో పారిశ్రామికవేత్త అదానీ నెట్‌వర్త్ 5,510 కోట్లతో పోలిస్తే కొంచెం ఎక్కువే కావొచ్చు.

కానీ రాజకీయ రణరంగంలో ఆ ఇద్దరి పేర్లూ తప్ప రతన్ టాటా గురించి మనం ఎప్పుడైనా విన్నామా? ఆయనపై అస్త్రాలు సంధిస్తూ పార్టీలు పరస్పరం ఎన్నడైనా ఆరోపణలు చేసుకోవటం చూశామా? లేదు. అదీ రతన్ టాటా ప్రత్యేకత.

సంస్థ ఎదగడమే కాదు... అనేకమంది జీవితాల్లో వెలుగులు పంచాలన్నది ఆయన సిద్ధాంతం. అందుకే ఇద్దరు పిల్లలున్న మధ్యతరగతి కుటుంబం ఒక స్కూటర్‌పై ఇరుక్కుని కూర్చుని హోరు వానలో ప్రయాణిస్తుండగా చూసి తనకు 'నానో' కారు ఐడియా వచ్చిందని రతన్ చెబితే దేశం విశ్వసించింది. టాటా గ్రూపు సంస్థలకు సామాజిక సేవంటే చాటింపు వేసుకుని మీడియాకు పోజులిచ్చే సందర్భం కాదు. నెరవేర్చి తీరాల్సిన పవిత్ర కర్తవ్యం. అందుకే 'టాటా సన్స్' ఈక్విటీల్లో 66 శాతం టాటా ట్రస్టుల చేతుల్లో ఉంటుంది. వాటిపై వచ్చే డివిడెండ్లు నేరుగా ట్రస్టులు నిర్వహించే సేవాకార్యక్రమాలకు తోడ్పడతాయి.

ఇంకో సంగతి ప్రత్యేకించి చెప్పుకోవాలి. సాఫ్ట్‌వేర్ రంగంలో ఈ మధ్య ఒక అంటువ్యాధిలా మారిన లే–ఆఫ్‌లకు టాటా గ్రూపు అనుబంధ సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ టీసీఎస్ పూర్తి వ్యతిరేకం. టాటా గ్రూప్‌లో సాల్ట్ నుంచి స్టీల్ వరకూ ఉన్న సంస్థల్లో సైతం ఎక్కడా సిబ్బందిని అన్యాయంగా తొలగించారన్న నింద ఏనాడూ రాలేదు.

దేశ నిర్మాణంలో, మరీ ముఖ్యంగా విద్య, వైద్య రంగాల్లో చేసిన గణనీయమైన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం రతన్ టాటాకు పద్మభూషణ్, పద్మవిభూషణ్ పురస్కారాలు ప్రకటించి గౌరవించింది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు

చెప్పండి మేడమ్..



జీ20 సదస్సు వద్ద బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో మోకాలిపై కూర్చుని మాట్లాడుతున్న బ్రిటన్ ప్రధాని రిషి సునాక్

సెల్ఫీ ప్లీజ్..!



ప్రధాని మోదీతో సెల్ఫీ తీసుకుంటున్న ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్, ఆయన పార్ట్‌నర్ జోడీ హేడెన్

ప్రెసిడెంట్‌తో ఫోటో..



వియత్నాం వెళ్లేముందు విమానాశ్రయంలో ఢిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారులతో అధ్యక్షుడు బైడెన్

చిటపట చినుకులు పడుతూ ఉంటే..



అక్షర్‌ధామ్ ఆలయం ఆవరణలో గొడుగు నీడలో బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ దంపతులు

బైడెన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న వేళ.. !

న్యూఢిల్లీ: అత్యంత ప్రతిష్టాత్మకమైన జీ20 శిఖరాగ్ర సదస్సులో చీమ చిటుక్కుమన్నా భద్రతా బలగాలు రెప్పపాటులో స్పందించే పరిస్థితి ఉంటుంది. అలాంటిది ఒకతను విలాసవంతమైన కారును ఎంచక్కా నడుపుకుంటూ ఢిల్లీ తాజ్ హోటల్‌లోకి వచ్చేశాడు. గుర్తు తెలియని వాహనమొకటి హోటల్‌లోకి రావడం చూసిన అక్కడి భద్రతా బలగాలు ఉలిక్కిపడ్డాయి. వెంటనేగా అప్రమత్తమయ్యాయి. ఎందుకంటే అదే హోటల్‌లో అప్పటికే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జయేద్ అల్ నహ్యాన్ బస చేస్తున్నారు. జీ20 సదస్సు కోసం విచ్చేసిన ఆయనకు ఈ హోటల్‌లోనే కేంద్ర ప్రభుత్వం బస ఏర్పాట్లుచేసింది. కారుతో దూసుకొచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఎవరబ్బా.. అని ఆరా తీస్తే అతను అమెరికా అధ్యక్షుడు బైడెన్ వాహనశ్రేణికి చెందిన డ్రైవర్‌గా తేలింది. మరి ఇటువైపు ఎందుకొచ్చావయ్యా ? అని పోలీసులు అతడిని ఆరా తీశారు. 'లోధీ ఎస్టేట్ ప్రాంతం నుంచి ఒక పారిశ్రామికవేత్తను ఈ హోటల్‌కు తీసుకురావాలని చెప్పారు. అందుకే ఇటు వైపు వచ్చా' అని తాపీగా బదులిచ్చాడు. వాస్తవానికి అతను ఎక్కడికి వెళ్లాలనేది ముందుగానే పక్కాగా షెడ్యూల్ అయింది. నిజానికి అతను బైడెన్ బస చేసిన ఐటీసీ మౌర్య హోటల్‌కు ఉదయం తొమ్మిదిన్నర గంటలకు వెళ్లాలి. కానీ అతనికి ప్రోటోకాల్ నిబంధన విభాగం వారు ఆదేశాల్లో గందరగోళం కారణంగా వాహనాన్ని తాజ్ హోటల్‌లోకి తీసుకొచ్చాడు. డ్రైవర్‌కు తప్పుడు ఆదేశాలు వచ్చాయని, తప్పేమీ లేదని నిర్ధారించుకున్నాక అతడిని వదిలేశారు. దాంతో అక్కడి వారంతా ఊపిరిపీల్చుకున్నారు.

ఆర్ఆర్ఆర్ అద్భుతం: బ్రెజిల్ అధ్యక్షుడు

న్యూఢిల్లీ: గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా విడుదలై ఘన విజయం సాధించిన తెలుగు సినిమా 'ఆర్ఆర్ఆర్'పై బ్రెజిల్ అధ్యక్షుడు లూలా మనసు పారేసుకున్నారు. తనకెంతో నచ్చిన సినిమా అని మెచ్చుకున్నారు. జీ20 సదస్సు కోసం ఢిల్లీకి వచ్చిన లూయిజ్ ఒక ఆన్‌లైన్ పోర్టల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ వివరాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఆ ఇంటర్వ్యూలో ' మీకు నచ్చిన భారతీయ సినిమా పేరు చెప్పండి' అన్న ప్రశ్నకు ఆయన ఠక్కున ఆర్ఆర్ఆర్ అని చెప్పారు. 'ఇది చక్కని ఫీచర్ ఫిల్మ్. సరదా సన్నివేశాలు, అలరించే డ్యాన్స్‌లతో కట్టిపడేస్తుంది. బ్రిటిషర్లు భారతీయులను ఎంతగా అణచివేశారనేది కళ్లకు కట్టింది'అని అన్నారు.

బిజీబిజీగా ద్వైపాక్షిక భేటీలు

జీ20 సభ్యదేశాల అధినేతలతో ప్రధాని మోదీ వేర్వేరుగా చర్చలు

న్యూఢిల్లీ: జీ20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా విచ్చేసిన సభ్యదేశాల అధినేతలతో ప్రధాని మోదీ విడివిడిగా భేటీ అయ్యారు. ద్వైపాక్షిక చర్చల్లో బిజీగా కనిపించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, జర్మనీ చాన్స్‌లర్ ఓలాఫ్ స్కోల్జ్, దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ ఇయోల్, తుర్కియే అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్, నెదర్లాండ్స్ ప్రధాని మార్క్ రెటే, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా, యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోండెర్ లెయిన్, నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ తినుబు, ఆఫ్రికా యూనియన్ అధ్యక్షుడు అజలీ అసొమనీ తదితరుల నాయకులతో మోదీ వేర్వేరుగా చర్చలు జరిపారు.

- 'మధ్యాహ్నం భోజనం వేళ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో జరిపిన విస్తృత స్థాయి ద్వైపాక్షిక చర్చలు ఫలవంతమయ్యాయి. ఇండియా–ఫ్రాన్స్ బంధం నూతన సమున్నత శిఖరాలకు చేరేందుకు ఇరువురం కృషిచేస్తాం' అని మోదీ ట్వీట్‌చేశారు.
- జీ20 సారథ్య బాధ్యతలను విజయవంతంగా నిర్వహించినందుకు నేతలంతా మోదీని అభినందించారు. ఇంటర్‌గవర్నమెంటల్ కమిషన్ మరో దఫా చర్చల కోసం వచ్చే ఏడాది భారత్‌కు విచ్చేయాల్సిందిగా జర్మనీ చాన్స్‌లర్ ఓలాఫ్ స్కోల్జ్‌ను మోదీ ఆహ్వానించారు. ఫిబ్రవరిలో భారత్‌లో పర్యటించిన ఓలాఫ్‌కు ఇది రెండో అధికారిక పర్యటన. రక్షణ, హరిత, సుస్థిరాభివృద్ధి, అరుదైన ఖనిజాలు, నైపుణ్యమైన సిబ్బంది, విద్య తదితర రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై స్కోల్జ్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు.
- శుద్ధ ఇంధనం, సెమీ కండక్టర్లు, డిజిటల్ సాంకేతికత తదితరాలపై నెదర్లాండ్స్ ప్రధానితో మోదీ చర్చించారు.
- వాణిజ్యం, పెట్టుబడులు, వ్యవసాయం, చిరు ధాన్యాలు, ఆర్థిక సాంకేతికతలపై నైజీరియా అధ్యక్షుడు తినుబుతో మోదీ చర్చలు జరిపారు.
- జీ20లో శాశ్వత సభ్యత్వానికి కృషిచేసినందుకు ఆఫ్రికా యూనియన్ అధ్యక్షుడు అజలీ మోదీకి కృతజ్ఞతలు చెప్పారు.
- వాణిజ్యం, సాంస్కృతిక, ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం, ఈవీ బ్యాటరీ సాంకేతికతల పరిపుష్టికి మరింతగా కృషిచేయాలని నిర్ణయించామని ద.కొరియా నేత ఇయోల్‌తో భేటీ తర్వాత ప్రధాని మోదీ వెల్లడించారు.
- డిసెంబర్ ఒకటో తేదీ నుంచి బ్రెజిల్ సారథ్యంలో జీ20 మరిన్ని విజయాలు సాధించాలని ఆ దేశ అధ్యక్షుడు డ సిల్వాతో మోదీ వ్యాఖ్యానించారు.
- వాణిజ్యం, సాంకేతికత, అనుసంధానం వంటి కీలకాంశాల్లో యూరప్‌తో భారత్ బంధం మరింత పటిష్టానికి సంబంధించి యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులాతో, ఐరోపా మండలి అధ్యక్షుడు చార్లెస్ మైఖేల్‌తో మోదీ విడిగా చర్చలు కొనసాగించారు.

భారత్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి: ఎర్డోగన్

దక్షిణాసియాలో భారత్ తమకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగన్ పేర్కొన్నారు. భారత్–తుర్కియే పరస్పర సహకారం అవిచ్ఛిన్నంగా కొనసాగుతోందని హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం జీ20 సదస్సు ముగిశాక ఎర్డోగన్ మీడియాతో మాట్లాడారు. ఆదివారం భారత ప్రధాని మోదీతో సమావేశమయ్యాయని, ఇరు దేశాలకు సంబంధించిన ఉమ్మడి అంశాలపై చర్చించామని తెలిపారు. జీ20లో ఆఫ్రియన్ యూనియన్ భాగస్వామిగా మారడాన్ని ఎర్డోగాన్ స్వాగతించారు.



బ్రిటిష్ కౌన్సిల్‌లో దుస్తుల డిజైన్లను పరిశీలిస్తున్న బ్రిటన్ ప్రధాని సతీమణి అక్షతా మూర్తి

భారత్ నేతృత్వంలో జీ20 శిఖరాగ్రం ఓ ముందడుగు

రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్

న్యూఢిల్లీ: భారత్ సారథ్యంలో జరిగిన జీ20 శిఖరాగ్రం ఓ ముందడుగని రష్యా పేర్కొంది. జీ20 సదస్సు సాధించిన ఫలితాలు..సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగడానికి ప్రపంచానికి ఒక మార్గాన్ని చూపించాయి, గ్లోబల్ సౌత్ ప్రాముఖ్యాన్ని చాటాయని తెలిపింది. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఉక్రెయిన్ సహా అనేక అంశాల్లో తమ వైఖరిని రుద్దేందుకు పశ్చిమదేశాలు చేసిన యత్నాలను అడ్డుకోవడంలో భారత్ కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. ప్రపంచదేశాల్లో సైనిక సంక్షోభాలను ఐరాస చార్టర్‌ను అనుసరిస్తూ పరిష్కరించాలే తప్ప, వివిధ సంక్షోభాల పరిష్కారానికి పశ్చిమదేశాలు తమ సొంత వైఖరులతో ముందుకు సాగడానికి వీల్లేదన్న సందేశాన్ని ఈ శిఖరాగ్రం స్పష్టంగా పంపిందని లావ్రోవ్ చెప్పారు. 'ఈ శిఖరాగ్రం ఎన్నో విధాలుగా ఓ ముందడుగు వంటిది. అనేక సమస్యలపై ముందుకు సాగడానికి ఇది మార్గం చూపింది'అని అన్నారు. 'జీ20ని రాజకీయ వేదికగా మార్చేందుకు జరిగిన యత్నాలను అడ్డుకున్న భారత్‌కు ధన్యవాదాలు. అంతర్జాతీయ వేదికపై పశ్చిమ దేశాలు ఆధిపత్యం కొనసాగించలేదని చెప్పారు.

రాష్ట్రీయం

కాళోజీ కుమారుడు కన్నుమూత

- సంతాపం తెలిపిన ప్రముఖులు



కాళోజీ రవికుమార్

సాక్షి, హైదరాబాద్/హన్మకొండ కల్చరల్/దామెర: ప్రజాకవి కాళోజీ నారాయణరావు కుమారుడు కాళోజీ రవికుమార్(68) కన్నుమూశారు. నెలరోజులుగా అనారోగ్యంతో వరంగల్‌లోని ప్రతిమ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. రవికుమార్‌కు భార్య వాణి, కుమారుడు సంతోష్‌కుమార్ ఉన్నారు. వాణి, రవికుమార్ కాళోజీ ఫౌండేషన్ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. రవికుమార్ పార్థివదేహాన్ని నక్కలగుట్టలోని స్వగృహానికి తరలించి సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధుమిత్రులు తెలిపారు. కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ప్రభుత్వం, ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించారు. మరుసటిరోజే ఆయన కుమారుడు మృతి చెందడంపై ప్రముఖులు, సాహితీవేత్తలు విచారం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కాగా, రవికుమార్ నేత్రాలను దానం చేయడానికి ఆయన భార్య, కుమారుడు సమ్మతించడంతో మృతదేహం నుంచి వైద్యులు నేత్రాలను సేకరించారు. మరోవైపు రవికుమార్ మృతిపట్ల కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, మంత్రి ఎర్రబెల్లి, రాష్ట్ర బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ వేర్వేరు ప్రకటనల్లో విచారం వ్యక్తం చేశారు.

బీసీలకు 60 సీట్లు ఇవ్వాల్సిందే

- అన్ని రాజకీయ పార్టీలకు బీసీ సింహగర్జన సభ డిమాండ్
- కులానికో సీటు..బీసీలకే ఓటు నినాదంతో ముందుకెళ్తామని ప్రకటన
- సీఎం అభ్యర్థిగా కూడా బీసీనే ప్రకటించాలని విజ్ఞప్తి



సభలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా/ హుడా కాంప్లెక్స్: అరవై శాతం జనాభా ఉన్న బీసీలకు 60 అసెంబ్లీ సీట్లతో పాటు ముఖ్యమంత్రి పీఠాన్ని సైతం కేటాయించాలని రాజకీయ పార్టీలను బీసీ సింహగర్జన సభ డిమాండ్ చేసింది. బీసీలకు సముచిత స్థానం కల్పించని పార్టీలకు ఇవే చివరి ఎన్నికలు అవుతాయని హెచ్చరించింది. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలన్నా.. బీసీలకు 60 సీట్లు ఇవ్వాలిందేనని, కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నా అంతే సంఖ్యలో సీట్లు కేటాయించాలని స్పష్టం చేసింది. ఈటలను సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తేనే బీజేపీకి రాష్ట్రంలో రాజకీయ మనుగడ ఉంటుందని సభలో నేతలు పేర్కొన్నారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ అధ్యక్షతన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో బీసీ సింహగర్జన సభ జరిగింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు దుర్గయ్యగౌడ్, అమృతరావు, చిన్న శ్రీశైలం యాదవ్, గొడుగు మహేశ్, నవీన్ యాదవ్, కుందారం గణేశ్‌చారి తదితరులు ఇందులో పాల్గొన్నారు. భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు సభకు హాజరయ్యారు.

కులానికో సీటు.. బీసీలకే ఓటు నినాదంతో..

తెలంగాణ వస్తే సామాజిక న్యాయం జరుగుతుందని ఆశించామని, కానీ అలా జరగలేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఇటీవల ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో.. రెడ్లకు 40 టికెట్లు ఇచ్చిందని, జనాభాలో 60శాతం ఉన్న బీసీలకు మాత్రం 23 టికెట్లే ఇవ్వడం దారుణమని మండిపడ్డారు. మంత్రివర్గంలోనూ బీసీలకు సముచిత స్థానం కల్పించలేదని విమర్శించారు. వచ్చే స్థానిక ఎన్నికల నాటికి బీసీల కోసం ప్రత్యేక రాజకీయ పార్టీని ప్రకటిస్తామని.. 'కులానికో సీటు.. బీసీలకే ఓటు'నినాదంతో ఎన్నికల్లో ప్రచారం చేస్తామని ప్రకటించారు. బీసీలకు తగిన గుర్తింపు ఇవ్వని పార్టీలకు ఇవే చివరి ఎన్నికలు అవుతాయని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా జనగణనలో బీసీ కుల గణన చేపట్టాలని.. చట్టసభల్లో బీసీలకు కూడా రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ మహిళలకు ఉప కోటా ప్రకటించాకే మహిళా బిల్లును ఆమోదింపజేయాలన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం 50 శాతానికి పెంచాలని కోరారు. అగ్రకుల అభ్యర్థులపై స్వతంత్ర అభ్యర్థులుగా బీసీలను నిలుపుతామని ప్రకటించారు.


కేంద్రం చెప్పేదొకటి... చేసేదొకటి...

- బీజేపీ బుల్డోజర్ రాజకీయాలను అడ్డుకునేది ఎర్రజెండానే: బృందా కారత్
- సెప్టెంబర్ 17 వేడుకలు కమ్యూనిస్టుల సొత్తు, హక్కు అని వ్యాఖ్య



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చెప్పేది ఒకటి.. చేసేది మరొకటని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ విమర్శించారు. పూర్తిగా అబద్ధాలు, వక్రీకరణలు, విద్వేష ప్రసంగాలతో దేశాన్ని పాలిస్తున్నారని ధ్వజమెత్తారు. కులమతాలతో సంబంధం లేకుండా భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన చారిత్రక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను కూడా ముస్లింరాజుపై హిందువులు చేసిన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం అందులో భాగమేనని వ్యాఖ్యానించారు. ఆదివారం సుందరయ్య పార్కు వద్ద సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో వీర తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా బృందా కారత్ మాట్లాడుతూ బ్రిటిషర్లకు సలాంకొట్టిన ఆర్ ఎస్ఎస్, సంఘ్ పరివార్ శక్తులు ఇప్పుడు తెలంగాణ విమోచన దినం జరుపుతామని బయలుదేరడం సిగ్గుచేటన్నారు. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టులే ఆనాడు బ్రిటిషర్లు, నిజాం, దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం చేశారని ఆమె గుర్తు చేశారు. దాని ఫలితంగానే హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేశారని చెప్పారు. తెలంగాణకు ద్రోహం చేసిన వారే సెప్టెంబర్ 17న హైదరాబాద్‌కు వచ్చి వేడుకలు నిర్వహిస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ పోరాటం కమ్యూనిస్టుల సొత్తు, వారి హక్కు అని స్పష్టం చేశారు. సీపీఎం హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జి. నర్సింహ్మారావు తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఒంటరిగానే పోటీచేస్తాం: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

అచ్చంపేట/ కల్వకుర్తి రూరల్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. ఆదివారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట లో నిర్వహించిన నల్లమల నగారా సభలో, అంతకు ముందు కల్వకుర్తిలో మీడియాతో ఆయన మాట్లా డారు. రాజ్యాధికారం కోసం బహుజనులు ఎవరి వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని, బీసీలకు తమ పార్టీ 70 స్థానాలను కేటాయిస్తుందని చెప్పారు. సూర్యాపేటలో జానయ్యపై చేస్తున్న దాడులను, మణిపూర్, భూపాల్ దాడులను ఖండిస్తున్నామన్నా రు. ఒక శాతం ఉన్న దొరలు 99 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అగ్రవర్ణ పేదలను అణగదొక్కుతున్నారని ఆరోపించారు. 2008 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. తాము ఎవరి వైపున ఉండమని.. రాజ్యాంగం వైపు ఉంటామని ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

త్వరలో ప్రపంచ ఎకనామిక్ లీడర్‌గా భారత్

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్



మొబైల్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న జస్టిస్ వేణుగోపాల్, సోనూసూద్ , లక్ష్మీనారాయణ

బంజారాహిల్స్: ప్రపంచంలోని అన్ని దేశాలు ఇప్పుడు భారత్ వైపు చూస్తున్నాయని... ప్రతి భారతీయుడు ఇది గర్వించే విషయమని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ ఫిలింనగర్‌లోని జేఆర్ఎస్ కన్వెన్షన్‌లో జరిగిన ఎంఎంఎన్ (మిలియన్ మిలియన్ నెట్‌వర్క్) వ్యాపారవేత్తల యాప్‌ను ప్రముఖ సినీనటుడు సోనూసూద్‌తో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ వేణుగోపాల్ మాట్లాడుతూ చంద్రయాన్–3 విజయంతో ప్రపంచం భారత్‌వైపు చూస్తోందన్నారు. కొద్ది నెల్లలోనే ఆర్థికంగా కూడా ప్రపంచ లీడర్‌గా భారత్‌ను చూడబోతున్నామని తెలిపారు. వ్యాపారులంతా దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేయాలని సూచించారు. ఎంఎంఎన్ ఫౌండర్ మడిపడిగె రాజు మాట్లాడుతూ ఎంఎంఎన్ వేదిక ద్వారా ప్రతినెలా బిజినెస్ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, పలు కంపెనీల సీఈవోలు పాల్గొన్నారు.

తల్లీకూతుళ్లను కబళించిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి
- విషయం తెలిసి గుండెపోటుతో కుమార్తె కన్నుమూత



గొర్ల రాఘవమ్మ

సత్తుపల్లి రూరల్: రోడ్డు ప్రమాదం ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరిని మృత్యుఒడికి చేర్చింది. ప్రమాదంలో తల్లి మృతి చెందగా.. విషయం తెలిసిన కుమార్తె సైతం గుండెపోటుతో కన్నుమూసింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రేజర్లకు చెందిన న్యాయవాది గొర్ల రామచంద్రారెడ్డి తల్లి రాఘవమ్మ (70) శనివారం రాత్రి రోడ్డు దాటుతున్నప్పుడు.. అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాఘవమ్మను ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని నూజివీడు సమీపాన జగవెల్లిలో నివసిస్తున్న ఆమె కుమార్తె నాగమణి(40)కు ఫోన్‌లో కుటుంబ సభ్యులు చెప్పారు. దీంతో ఆమె ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయి కన్నుమూసింది. ఆదివారం రేజర్లలో రాఘవమ్మకు అంత్యక్రియలు నిర్వహించాక.. కుటుంబసభ్యులు నాగమణి చివరిచూపు కోసం జగవెల్లి వెళ్లారు.

కన్నకొడుకును కడతేర్చారు

మద్యం మత్తులో వేధిస్తున్నాడని గొంతుకోసిన తల్లిదండ్రులు



దుర్గాప్రసాద్

భద్రాచలం అర్బన్: మద్యం మత్తులో వేధిస్తున్నాడని కన్నకొడుకును తల్లిదండ్రులే హత్య చేశారు. ఆపై సరిహద్దులోని ఏపీ రాష్ట్రానికి మృతదేహాన్ని తీసుకెళ్లి దహనం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని మెడికల్ కాలనీకి చెందిన పగిళ్ల సావిత్రి – రాములు దంపతులకు కుమారుడు దుర్గాప్రసాద్ (30) ఉన్నాడు. రోజువారీ కూలీగా పనిచేసే దుర్గాప్రసాద్‌కు పదేళ్ల క్రితం మౌనికతో వివాహం కాగా వారికి ఓ కుమారుడు ఉన్నాడు. దుర్గాప్రసాద్ నిత్యం మద్యం సేవించి తల్లిదండ్రులను వేధించేవాడు. ఈ వేధింపులు భరించలేకపోయిన సావిత్రి, రాములు కోడలు పుట్టింటికి వెళ్లిన సమయంలో పథకం ప్రకారం శనివారం రాత్రి తమ ఇంట్లోనే దుర్గాప్రసాద్ గొంతుకోసి హత్య చేశారు. అనంతరం భద్రాచలం సరిహద్దున ఉన్న ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఏటపాక పోలీస్ స్టేషన్ పరిధి తుమ్మలనగర్ అడవిలో మృతదేహాన్ని కాల్చివేశారు. ఆదివారం సగం కాలిన మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా విచారణలో అది దుర్గాప్రసాద్ మృతదేహంగా తేలింది. తల్లిదండ్రులే ఆయనను హత్య చేసినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న దుర్గాప్రసాద్ భార్య మౌనిక కుటుంబీకులు ఆయన తల్లిదండ్రులపై దాడి చేశారు. కాగా, హత్యపై ఏటపాక పోలీసులు విచారణ చేస్తుండగా, అధికారికంగా వివరాలు వెల్లడించలేదు.

'సీపీఎస్‌ను పునరుద్ధరించండి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం (సీపీఎస్) ఉద్యోగులకు పాత పింఛన్ వి ధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం ఎంప్లాయిస్ యూని య న్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవి తకు విజ్ఞప్తి చేసింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.స్థితప్రజ్ఞ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఆదివారం కవితను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. కవిత ను కలిసిన వారిలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర ప్ర ధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్ తదితరులున్నారు.

బీజేపీని ఓడించే శక్తులతో స్నేహం

- తమ్మినేని వీరభద్రం



దేవరుప్పుల/ పాలకుర్తి టౌన్: బీజేపీని ఓడించగలిగే శక్తులతో స్నేహం చేస్తామని, ఆ పార్టీతో స్నేహం చేసే పార్టీలను ఓడించడమే సీపీఎం ధ్యేయమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. రైతాంగ సాయుధ పోరాటాన్ని ఓట్ల రాజకీయం కోసం భారతీయ జనతా పార్టీ వక్రీకరించడం సిగ్గుచేటని ఆయన అన్నారు. బీజేపీతో లోపాయకారి ఒప్పందాన్ని ఏర్పరచుకుంటూ ఆ పార్టీ పంచన చేరేందుకు సీఎం కేసీఆర్ ఇండియా కూటమికి దూరంగా ఉంటున్నారని ఆయన ఆరోపించారు. చిట్యాల ఐలమ్మ వర్ధంతిని పురస్క రించుకొని పార్టీ ఆధ్వర్యంలో ధర్మాపురం, జనగామ జిల్లా పాలకుర్తిలో తెలంగాణ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ధర్మాపురంలో నాటి ఉద్యమ సజీవసాక్షి జాటోతు దర్గ్యానాయక్‌తో చర్చా గోష్టి నిర్వహించిన అనంతరం ఆయనను వీరభద్రం సన్మానించారు. అనంతరం తుపాకి గుళ్లకు ఎదురొడ్డి అశువులు బాసిన జాటోతు ఠాణునాయక్ స్మారక స్థూపం నుంచి కామారెడ్డిగూడెం షేక్ బందగీ స్థూపం వరకూ బైక్‌లపై ర్యాలీగా వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ, మొన్నటివరకూ వామపక్ష భావజాల పార్టీలకు వ్యతిరేకంగా వ్యవహరించిన మతోన్మాది బీజేపీ.. నేడు విమోచన ఉద్యమం గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు.



ఢిల్లీలో ఆదివారం మహాత్మాగాంధీ సమాధి 'రాజ్‌ఘాట్' వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘన నివాళులర్పిస్తున్న జీ20 సభ్యదేశాల అధినేతలు. చిత్రంలో భారత ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు బైడెన్ తదితరులు ఉన్నారు.

తీవ్రవాద శక్తులపై కఠిన చర్యలు తీసుకోండి

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు నరేంద్ర మోదీ సూచన

భారత వ్యతిరేక శక్తులకు కెనడా అడ్డాగా మారుతోందని ఆందోళన

న్యూఢిల్లీ: భారత వ్యతిరేక కార్యకలాపాలకు కెనడా అడ్డాగా మారుతుండడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని కెనడా ప్రధానమంత్రి జస్టిన్‌ట్రూడో దృష్టికి తీసుకెళ్లారు. తీవ్రవాద శక్తులు కెనడా కేంద్రంగా భారత్‌పై విషం చిమ్ముతున్నాయని, ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని పేర్కొన్నారు. కెనడాలో నివసిస్తున్న భారతీయులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, భారత దౌత్యవేత్తలకు వ్యతిరేకంగా హింసను ప్రేరేపిస్తున్నాయని వెల్లడించారు. కెనడాలోని భారతీయుల ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని గుర్తుచేశారు. భారత దౌత్య కార్యాలయాలపై దాడులు చేసిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. వ్యవస్థీకృత నేరగాళ్ల ముఠాలతో, మాదక ద్రవ్యాల ముఠాలతో, మానవ అక్రమ రవాణాకు పాల్పడే వారితో తీవ్రవాద శక్తులు అంటకాగుతున్నాయని, ఈ పరిణామం కెనడా భద్రతకు సైతం ముప్పేనని తేల్చిచెప్పారు. ఈ అవాంఛనీయ ధోరణికి తక్షణమే అడ్డుకట్ట వేయాలని, తీవ్రవాద శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని జస్టిన్ ట్రూడోకు సూచించారు. తీవ్రవాదులను ఏరిపారేయడానికి భారత్, కెనడా పరస్పరం కలిసి పనిచేయాలని చెప్పారు. జీ20 సదస్సు నేపథ్యంలో మోదీ, ట్రూడో ఆదివారం ఢిల్లీలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భారత్, కెనడాకు సంబంధించిన ఉమ్మడి అంశాలపై చర్చించుకున్నారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత బలపడాలంటే పరస్పర గౌరవం, విశ్వాసం చాలా ముఖ్యమని మోదీ స్పష్టం చేశారు. విభిన్న రంగాల్లో భారత్–కెనడా సంబంధాలపై ట్రూడోతో విస్తృతంగా చర్చించినట్లు ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు: ట్రూడో

భారత్ తమకు అత్యంత ముఖ్యమైన భాగస్వామి అని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చెప్పారు. ప్రపంచంలో భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని ప్రశంసించారు. వాతావరణ మార్పులపై పోరాటం, ఆర్థిక ప్రగతి వంటి అంశాల్లో భారత్, కెనడా కలిసి పని చేస్తున్నాయని తెలిపారు. మోదీతో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కెనడాలో ఇటీవలి కాలంలో ఖలిస్తాన్ అనుకూల శక్తుల కార్యకలాపాలు పెరగడంపై స్పందిస్తూ.. తమ దేశంలో హింసకు తావులేదని, విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. శాంతియుతంగా ప్రదర్శనలు నిర్వహించుకొనే హక్కు ప్రజలకు ఉందన్నారు. ఎవరో కొందరు వ్యక్తుల చర్యలను మొత్తం సామాజిక వర్గానికి ఆపాదించడం సరైంది కాదన్నారు. మోదీతో జరిగిన చర్చల్లో ఖలిస్తాన్ తీవ్రవాదం ప్రస్తావనకు వచ్చిందని వెల్లడించారు. భారత్, కెనడా మధ్య పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని వివరించారు.

13న 'ఇండియా' సమన్వయ కమిటీ తొలి భేటీ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సమన్వయ కమిటీ మొదటి సమావేశం ఈ నెల 13న ఢిల్లీలో జరుగనుంది. ఎన్సీపీ అధినేత శరద్ పవార్ నివాసంలో ఈ భేటీ జరుగుతుందని కూటమి నేతలు ఆదివారం వెల్లడించారు. భవిష్యత్తు కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. వివిధ పార్టీలకు చెందిన 14 మంది నేతలతో సమన్వయ కమిటీ ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఇండియా కూటమిలో ఈ కమిటీ అత్యున్నత విధాన నిర్ణాయక విభాగంగా పనిచేస్తోంది.

ఐరాసను సంస్కరించాలి

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని విస్తరించాలి | జీ20 సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

- ముగిసిన జీ20 శిఖరాగ్ర సదస్సు
- నవంబర్‌లో వర్చువల్ సదస్సు
- కూటమి తదుపరి అధ్యక్ష బాధ్యతలు బ్రెజిల్‌కు అప్పగింత

న్యూఢిల్లీ: ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని తక్షణమే విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. అన్ని అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని చెప్పారు. ప్రపంచాన్ని భవ్యమైన భవిష్యత్తు దిశగా నడిపించడానికి ఆయా సంస్థలు 'నూతన వాస్తవ పరిస్థితులను' ప్రతిబింబించేలా ఉండాలని సూచించారు. కాలానుగుణంగా మార్పునకు లోనుకానివి సమకాలీనతను కోల్పోతాయని అన్నారు. ఆదివారం ఢిల్లీలో జీ20 శిఖరాగ్ర సదస్సులో భాగంగా 'వన్ ఫ్యూచర్' సెషన్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. అనంతరం సదస్సు ముగింపు కార్యక్రమంలోనూ మాట్లాడారు. అంతర్జాతీయ సంస్థలు ఏవైనా సరే ఇప్పటి అవసరాలను తీర్చేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్యసమితి ఏర్పాటైనప్పటి పరిస్థితులు వేరు, ఇప్పటి పరిస్థితులు వేరు అని పేర్కొన్నారు. అప్పట్లో ఐరాసలో 51 సభ్యదేశాలు ఉండవని, ఇప్పుడు వాటి సంఖ్య దాదాపు 200కు చేరిందని గుర్తుచేశారు. అందుకు తగ్గట్లుగా భద్రతా మండలిని కూడా విస్తరించాలని అన్నారు. ప్రపంచంలో ఎన్నో రంగాల్లో మార్పులు జరిగాయని, ఐరాస భద్రతా మండలిలోని శాశ్వత సభ్యదేశాల సంఖ్యల ఎలాంటి మార్పులు జరగలేదని ఆక్షేపించారు. ఐక్యరాజ్యసమితితోపాటు ఇతర అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణల ఆవశ్యకతను వివరించారు. ఈ ఏడాది నవంబర్ నెలాఖరున జీ20 సదస్సును వర్చువల్‌గా నిర్వహించుకుందామని ప్రతిపాదించారు. ఇప్పటి సదస్సులో తీసుకున్న నిర్ణయాలతోపాటు ఇతర అంశాలపై మరోసారి సమీక్షిద్దామని చెప్పారు. సైబర్ సెక్యూరిటీ, క్రిప్టో కరెన్సీల గురించి మోదీ ప్రస్తావించారు. వర్తమానాన్ని, భవిష్యత్తును ఇవి తీవ్రంగా ప్రభావితం చేస్తాయని చెప్పారు. క్రిప్టో కరెన్సీలను రెగ్యులేట్ చేయడానికి అంతర్జాతీయ ప్రమాణాలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ఉగ్రవాదులు నిధులు సమకూర్చుకోవానికి సైబర్‌స్పేస్ అనేది ఒక కొత్త వనరుగా ఆవిర్భవించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ధోరణికి అడ్డుకట్ట వేయడానికి కఠిన చర్యలు చేపట్టాలని, ప్రపంచదేశాలు పరస్పరం సహకరించుకోవాలని చెప్పారు.

బ్రెజిల్‌కు మోదీ మద్దతు

ప్రధాని మోదీ జీ20 తదుపరి అధ్యక్ష బాధ్యతలను బ్రెజిల్‌కు అప్పగించారు. ఇందుకు గుర్తుగా అధికార దండాన్ని(గావెల్) బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇన్సియో లూలా డా సిల్వాకు అందజేశారు. కూటమి అధ్యక్ష బాధ్యతలను బ్రెజిల్ ఈ ఏడాది డిసెంబర్ 1న అధికారికంగా చేపట్టనుంది. జీ20 అధ్యక్ష బాధ్యతలు స్వీకరించనున్న బ్రెజిల్‌కు నరేంద్ర మోదీ పూర్తి మద్దతు ప్రకటించారు. అధ్యక్షుడు లూయిజ్ ఇన్సియో లూలా డా సిల్వాను అభినందించారు. కూటమి దేశాల ఉమ్మడి లక్ష్యాలను జీ20 సారథిగా బ్రెజిల్ మరింత ముందుకు తీసుకెళ్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. జీ20 సదస్సు ముగిసినట్టు ప్రధాని మోదీ ప్రకటించారు. వసుధైక కుటుంబానికి రోడ్‌మ్యాప్ దిశగా మనం ముందుకు సాగుదామని కూటమి దేశాలకు పిలుపునిచ్చారు.



జీ20 అధికార దండాన్ని మోదీ నుంచి స్వీకరిస్తున్న బ్రెజిల్ అధ్యక్షుడు లూలా

మరిన్ని దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించాలి: లూలా డా సిల్వా

అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు ప్రారంభించాలన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వినతికి బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా మద్దతు పలికారు. కొత్తగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. మరికొన్ని దేశాలకు నాన్–పర్మినెంట్ హోదా కల్పించాలన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్)లోనూ సరైన ప్రాతినిధ్యం ఉండాలని చెప్పారు. ఐరాస భద్రతా మండలిలో ప్రస్తుతం అమెరికా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్, రష్యాకు మాత్రమే శాశ్వత సభ్యత్వం ఉంది.

మానవ కేంద్రిత అభివృద్ధి

జీడీపీ కేంద్రిత ప్రయాణానికి కాలం చెల్లిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మానవ కేంద్రిత అభివృద్ధి ప్రయాణం ప్రారంభించాల్సిన సమయం వచ్చిందని తెలిపారు. ఈ దిశగా తాము ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నామని ఉద్ఘాటించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేశారు. కృత్రిమ మేధ(ఏఐ)ను సామాజిక–ఆర్థిక ప్రగతికి ఉపయోగించాలని అన్నారు.

మోదీపై జీ20 నేతల ప్రశంసల వర్షం

జీ20 శిఖరాగ్ర సదస్సును విజయవంతంగా నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీపై కూటమి నేతలు ప్రశంసల వర్షం కురిపించారు. మోదీ నిర్ణయాత్మక నాయకత్వాన్ని కొనియాడారు. భారతదేశం తమకు అపూర్వమైన ఆతిథ్యం ఇచ్చిందని పేర్కొన్నారు. ఒకే భూగోళం, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు అంటూ భారత్ ఇస్తున్న సందేశాన్ని వారు ప్రత్యేకంగా ప్రస్తావించారు. తమను ఒకే వేదికపై తీసుకొచ్చిన మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. సవాళ్లను కలిసికట్టుగా ఎదిరించగలమనే సామర్థ్యం మనకు ఉందన్న విషయాన్ని మోదీ మరోసారి గుర్తుచేశారని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నారు. డిజిటల్ సాధనాలు, టెక్నాలజీ సాయంతో ప్రభుత్వ సేవలను మారుమూల గ్రామాలకు సైతం సులభంగా చేర్చవచ్చని మోదీ నిరూపించారని యూకే ప్రధానమంత్రి రిషి సునాక్ తెలియజేశారు. జీ20లో ఆఫ్రికన్ యూనియన్‌కు సభ్యత్వం కల్పించడంలో మోదీకి కీలక పాత్ర అని పలువురు నాయకులు వెల్లడించారు. 'గ్లోబల్ సౌత్' గళాన్ని బలంగా వినిపించడంలో మోదీ ముందంజలో ఉంటున్నారని బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా వివరించారు.



రాజ్‌ఘాట్‌లో బైడెన్, మోదీ, సునాక్

మహాత్ముని పలుకులే భారత్–అమెరికా మైత్రికి మూలం

రాజ్‌ఘాట్‌లో గాంధీజీకి ఘన నివాళులర్పించిన అగ్రరాజ్యాధీశుడు

న్యూఢిల్లీ: మహాత్మా గాంధీజీ ప్రబోధించిన సంరక్షణ సూక్తులే భారత్–అమెరికా మధ్య సత్సంబంధాలకు మూలమని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్యానించారు. ఢిల్లీలో మహాత్ముని సమాధి 'రాజ్‌ఘాట్'లో నివాళులర్పించిన సందర్భంగా బైడెన్ పలు ట్వీట్లు చేశారు. ' గాంధీజీ ప్రవచించిన సంరక్షణ సూక్తులే ఇరు దేశాల మధ్య దృఢ బంధానికి మూలం. మన రెండు దేశాలు మధ్య నెలకొన్న పరస్పర నమ్మకం, సంరక్షణ బాధ్యతలే మన పుడమి సంరక్షణకూ దోహదపడుతున్నాయి' అని అన్నారు. 'మోదీతో విస్తృతస్థాయి ద్వైపాక్షిక చర్చలు ఫలవంతంగా ముగిశాయి. 31 అధునాతన డ్రోన్ల కొనుగోలు, భారత్‌లో జీఈ జెట్ ఇంజిన్ల సంయుక్త తయారీసహా పలు కీలక ఒప్పందాలు కుదిరాయి' అని చెప్పారు. 'ఈ రోజు ఇక్కడికి(రాజ్‌ఘాట్)కు తీసుకొచ్చిన మీకు(ప్రధాని మోదీ) నా కృతజ్ఞతలు. అద్భుతంగా అతిథ్యమిచ్చి, జీ20 సదస్సును సజావుగా నిర్వహించి, కూటమికి విజయవంతంగా సారథ్యం వహించారు. రాజ్‌ఘాట్‌కు రావడం నిజంగా గర్వంగా ఉంది. గాంధీజీ ఆచరించి చూపిన సత్యం, అహింసా మార్గాలు ప్రపంచానికి ఆచరణీయాలు. ఇవి ఎల్లప్పుడూ ప్రపంచదేశాలకు స్ఫూర్తిదాయకాలు. ఇదే మన రెండు దేశాల బంధానికి పునాది రాళ్లు' అని మోదీనుద్దేశిస్తూ బైడెన్ ట్వీట్‌చేశారు. జీ20 సదస్సు ముగిశాక భారత్‌కు బైబై చెప్పిన బైడెన్.. వియత్నాంకు పయనమయ్యారు. మహాత్మునికి జీ20 నేతలంతా పుష్పగుచ్ఛాలతో నివాళులర్పిస్తున్న ఫొటోను, కార్యక్రమానికి సంబంధించిన 19 సెకన్ల వీడియోను బైడెన్ ట్వీట్ చేశారు. జీ20 దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలకు కూటమే స్వయంగా పరిష్కార మార్గాలు కనిపెట్టగలదని బైడెన్ ధీమా వ్యక్తంచేశారు.

మహాత్మునికి నేతల నివాళి

జీ20 సదస్సుకు విచ్చేసిన నేతలంతా ఆదివారం రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. మొదట వారంతా వర్షం నీరు నిలిచిన రాజ్‌ఘాట్ లోపలికొచ్చారు. 1917 నుంచి 1930 వరకు గాంధీజీ నివసించిన సబర్మతి ఆశ్రమం ఫొటో ఉన్న ప్రాంతం వద్ద నిల్చుని విడివిడిగా ఒక్కో నేతకు మోదీ స్వాగతం పలికారు. ఫొటో చూపిస్తూ ఆశ్రమం ప్రత్యేకతలను వివరించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ అంగవస్త్రం బహూకరించారు. మోదీ, సునాక్ పాదరక్షలు లేకుండా రాజ్‌ఘాట్ లోపలికి ప్రవేశించగా, మిగతా నేతలు.. నిర్వాహకులు సమకూర్చిన తెల్లని పాదరక్షలు ధరించారు. తర్వాత నేతలంతా కలిసి గాంధీజీ సమాధి వద్ద పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. అక్కడి శాంతికుడ్యంపై సంతకాలు చేశారు.

జీ20 ప్రాంగణంలోకి వర్షం నీరు

సాక్షి, న్యూఢిల్లీ: దేశరాజధానిలో ఆదివారం కురిసిన భారీ వర్షం ప్రభావం జీ20 సదస్సుపైనా పడింది. సదస్సు జరుగుతున్న ప్రగతిమైదాన్‌లోని భారత మండపంలోకి నీరు చేరింది. సిబ్బంది నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేపట్టారు. ఆయా దేశాల ప్రతినిధులు నీళ్లలోనే అటూఇటూ నడుస్తున్న వీడియోను కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్'లో షేర్ చేసింది. 'జీ20 ఏర్పాట్ల కోసం రూ.2,700 కోట్లు కేంద్రం ఖర్చు చేసింది. ఇప్పుడు ఒక్క వర్షానికే భారత మండపం నీటితో నిండిపోయింది. పంపులతో సిబ్బంది నీటిని బయటకు పంపుతున్నారు. అభివృద్ధిలో డొల్లతనం బయటపడింది..' అంటూ కాంగ్రెస్ 'ఎక్స్'లో వ్యంగ్యంగా పేర్కొంది. ఈ వీడియోను షేర్ చేస్తూ 'దేశ వ్యతిరేక అంతర్జాతీయ కుట్రలో వానలు కూడా భాగమే'అంటూ ఆ పార్టీ ప్రతినిధి సుప్రియ వ్యాఖ్యానించారు. 'జీ20 సదస్సు సాగుతుండగానే భారత్ మండపంలోని వరదనీరు చేరిందన్న విషయాన్ని మీడియా ప్రస్తావించనేలేదు. మోదీజీ, దేశాన్ని ఎలా పాలించాలో మా నుంచి మీరు నేర్చుకోలేదు. కానీ, మీడియాను ఎలా మేనేజ్ చేయాలో మిమ్మల్ని చూసి మేం నేర్చుకోవాలి'అంటూ ఆ పార్టీ నేత పవన్ ఖేరా పేర్కొన్నారు.

జనవరి 21న అయోధ్య రామాలయం ప్రారంభం

అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో భవ్య రామమందిర ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది జనవరి 21 నుంచి మూడు రోజులపాటు ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) కార్యనిర్వాహక అధ్యక్షుడు అలోక్ కుమార్ ఆదివారం చెప్పారు. ఈ కార్యక్రమానికి లక్ష మందికిపైగా మత ప్రముఖులను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవానికి సన్నాహకంగా ఈ ఏడాది సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 15 దాకా లక్షలాది గ్రామాల్లో 'శౌర్యయాత్ర'లు నిర్వహించేందుకు బజరంగ్ దళ్ ఏర్పాట్లు చేస్తోంది.

ఆదిత్య ఎల్1 కక్ష్య పెంపు మూడోసారి

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈనెల 2న ప్రయోగించిన ఆదిత్య–ఎల్1 ఉపగ్రహానికి మూడో విడత కక్ష్య దూరాన్ని విజయవంతంగా పెంచారు. ఆదివారం వేకువజామున 2.30 గంటల సమయంలో భూమికి దగ్గరగా 296 కిలోమీటర్ల ఎత్తుకు, భూమికి దూరంగా 71,767 కిలోమీటర్ల ఎత్తుకు దిగ్విజయంగా కక్ష్య దూరాన్ని పెంచారు.

మొరాకో విలయం

- మృతులు రెండు వేల పైనే..
- మరో 2 వేల మంది క్షతగాత్రులు
- సహాయక చర్యలు ముమ్మరం
- చేయూత ప్రకటించిన ప్రపంచదేశాలు

మర్రకేశ్: భూకంపం సృష్టించిన పెను విధ్వంసం, ప్రాణనష్టం మొరాకో వాసులను షాక్‌కు గురిచేసింది. ఈ ఉత్తర ఆఫ్రికా దేశంలో ఇంతటి తీవ్ర భూకంపం రావడం 120 ఏళ్లలో ఇదే మొదటిసారి. దేశంలోని మర్రకేశ్, మరో అయిదు ప్రావిన్స్‌ల్లో శుక్రవారం అర్ధరాత్రి రిక్టర్ స్కేలుపై 6.8 తీవ్రతతో భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. ప్రజలు భయాందోళనలతో వీధుల్లో రెండో రోజూ చీకట్లోనే జాగారం చేశారు. సహాయక చర్యలను ప్రభుత్వ యంత్రాంగం ముమ్మరం చేసింది. శిథిలాలను తొలగిస్తుండటంతో ఆదివారం నాటికి మృతుల సంఖ్య 2,012కు చేరింది. క్షతగాత్రులైన మరో 2,059 మందిలో 1,404 మందికి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు చెబుతున్నారు. భవనాల శిథిలాల కింద చిక్కుకుని ఉన్న వారిని గుర్తించి, కాపాడేందుకు ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించింది. సుదూరంగా కొండ ప్రాంతాల్లో ఉన్న పల్లెలకు సహాయక బృందాలు చేరడం కష్టంగా మారింది. అక్కడి మట్టిరోడ్లపై బండరాళ్లు పడిపోవడంతో టాక్సీలు, అంబులెన్సులు, రెడ్ క్రాస్ సిబ్బంది వాహనాలు ముందుకు వెళ్లడం కష్టంగా మారింది. దీంతో సహాయక చర్యలు నెమ్మదిగా సాగుతున్నాయి. అక్కడ జరిగిన నష్టం వివరాలు కూడా వెల్లడైతే మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయంటున్నారు. ఈ విలయానికి తీవ్రంగా ప్రభావితమైన అల్ హౌజ్ ప్రావిన్స్‌లో మరణాలు అత్యధికంగా 1,293 నమోదయ్యాయి. ఆ తర్వాత టరౌడంట్ ప్రావిన్స్‌లో 452 మంది చనిపోయారు. అమెరికా, ఇజ్రాయెల్, అల్జీరియా, జర్మనీ, యూఏఈ, జోర్డాన్ తదితర దేశాలతోపాటు డాక్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ వంటి సంస్థలు చేయూత అందించేందుకు ముందుకు వచ్చాయి.

కళతప్పిన పర్యాటక పట్టణం

అట్లాస్ పర్వతాల్లో ఉన్న పర్యాటక ప్రాంతం మౌలే బ్రహీం భూకంపం ధాటికి విలవిల్లాడింది. మూడువేల జనాభా కలిగిన ఈ చిన్న పట్టణవాసుల ప్రధాన ఆధారం వ్యవసాయం, పర్యాటకం. ఇక్కడి వందల ఏళ్లనాటి ఇటుకతో నిర్మించిన ఇళ్లు పర్యాటకులను ఆకట్టుకునేవి. భూకంపం తీవ్రతకు ఈ ఇళ్లు చాలా వరకు నామరూపాలు కోల్పోగా మిగిలినవి పాక్షికంగా ధ్వంసమయ్యాయి. దీంతో, జనం ఇళ్లలోకి వెళ్లేందుకు జంకుతున్నారు. పట్టణంలోని కూడలిలోనే భారీ టెంట్ వేసుకుని, అందులోనే ఉంటున్నారు. అర్ధరాత్రి వేళ ఇల్లంతా ఒక్కసారిగా కదులుతున్నట్లు అనిపించడంతో తమ కుటుంబసభ్యులంతా కేకలు వేసుకుంటూ బయటకు పరుగులు తీశామని మౌలే బ్రహీంకు చెందిన హంజా లంఘానీ చెప్పాడు. బయటికి వెళ్లాక చూడగా తమ ఇంటితోపాటు పొరుగిల్లు కూడా పూర్తిగా నేలమట్టమయ్యాయన్నాడు. పొరుగింట్లో ఉండే తన చిన్ననాటి స్నేహితులు అయిదుగురూ ఆ శిథిలాల కింద పడి ప్రాణాలు కోల్పోయారని నిర్వేదంతో చెప్పాడు.



మర్రకేశ్‌కు దగ్గర్లోని అమిజ్‌మిజ్‌లో విధ్వంసాన్ని చూసి బాలిక విస్మయం

భారతీయులంతా సురక్షితం

భూకంపం నేపథ్యంలో మొరాకోలోని భారత దౌత్యకార్యాలయం స్పందించింది. దేశంలోని భారత పౌరులెవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించినట్లు తమకు సమాచారం లేదన్నారు. స్థానిక యంత్రాంగం సూచనలను ఎప్పటికప్పుడు పాటిస్తూ ఇళ్లలోనే సురక్షితంగా ఉండాల్సిందిగా సలహా ఇచ్చింది. అవసరమైన పక్షంలో తమ హెల్ప్‌లైన్ నంబర్ 212661297491కు కాల్ చేయాల్సిందిగా కోరింది.

సూడాన్‌లో డ్రోన్ దాడి..43 మంది మృతి

కైరో: సూడాన్ రాజధాని ఖార్టూమ్‌లోని ఓ మార్కెట్‌పై ఆదివారం జరిగిన డ్రోన్ దాడిలో 43 మంది చనిపోయారు. మరో 55 మంది గాయాలపాలయ్యారని మానవీయ సాయం అందిస్తున్న సంస్థలు వెల్లడించాయి. దేశంలో మిలటరీ చీఫ్ జనరల్ అబ్దెల్ ఫతాహ్ బుర్హాన్, పారా మిలటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ నేత జనరల్ మహ్మద్ హమ్‌దాన్ దగాలో మధ్య ఏప్రిల్ నుంచి ఆధిపత్య పోరు కొనసాగుతున్న విషయం తెలిసిందే. గ్రేటర్ ఖార్టూమ్ ప్రాంతంలో నివాసాల్లో పారా మిలటరీ బలగాలు తిష్టవేసి పోరాట సాగిస్తున్నారు. వారిని లక్ష్యంగా చేసుకుని మిలటరీ వైమానిక దాడులకు దిగుతోంది. రెండు వర్గాల మధ్య పోరులో సామాన్యులు సమిధలుగా మారుతున్నారు. ఈ పోరులో 4 వేల మందికి పైగా మరణించినట్లు ఐరాస చెబుతోంది.



అక్షరధామ్ ఆలయంలో హారతి ఇస్తున్న రిషి సునాక్, అక్షతా మూర్తి

అక్షరధామ్ ఆలయంలో సునాక్ దంపతులు

న్యూఢిల్లీ: భారతీయ మూలాలున్న బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ ఆదివారం ఢిల్లీలోని ప్రఖ్యాత అక్షరధామ్ ఆలయాన్ని దర్శించుకున్నారు. సతీమణి అక్షతా మూర్తితో కలిసి ఆదివారం ఉదయాన్నే ఆలయానికి వచ్చారు. దాదాపు గంటసేపు సునాక్ దంపతులు ఆలయంలో గడిపారు. వీరి వెంట ఆలయ డైరెక్టర్ జ్యోతీంద్ర దవే ఉన్నారు. 'సునాక్‌కు ఆలయ విశేషాలను వివరిస్తూ ఆయనతో అంతసేపు మాట్లాడాక నాకో విషయం అర్థమైంది. అదేంటంటే ఆయన సనాతన ధర్మాన్ని బాగా ఆచరిస్తారని' అని జ్యోతీంద్ర వ్యాఖ్యానించారు. అక్షరధామ్ స్వామి నారాయణ ఆలయ రిసెప్షన్ ప్రాంతంలోనే సునాక్ దంపతులు పాదరక్షలను వదిలేసి ప్రధాన ఆలయంలోకి అడుగుపెట్టారు. గర్భాలయంలో స్వర్ణమయ స్వామి నారాయణ్‌జీ విగ్రహానికి పుష్పార్చణం చేశారు. తర్వాత హారతి ఇచ్చారు. ప్రాంగణంలో సీతారాములు, రాధాకృష్ణులు, లక్ష్మీనారాయణ, శివ పార్వతులు ఇలా అందరు దేవతా మూర్తులకు పుష్పాలను దంపతులు సమర్పించారు. గుడి నిర్మాణ శైలి, చరిత్రసహా ఆలయ విశిష్టతలను అడిగి తెల్సుకున్నారు. స్వామినారాయణ్‌జీ గతంలో వినియోగించిన పాదుకలు, పూలమాలను చూశారు. ' విశ్వ శాంతికి, సామరస్యానికి ప్రతీక ఈ ఆలయం. మెరుగైన మానవ జీవన విధానాన్ని అవలంబించేందుకు ఆలయదర్శనం శ్రేయస్కరం. ఇలాంటి సానుకూలతల బ్రిటిష్–ఇండియా కమ్యూనిటీ బ్రిటన్‌కు ఎంతగానో దోహదపడుతుంది' అని అన్నారు. బ్రిటన్ ప్రధాని దంపతులు తమ ఆలయాన్ని దర్శించుకోవడం తమకు గర్వకారణమని ఆలయ నిర్వహణాధికారి చెప్పారు. దర్శనం తర్వాత ఆలయ నిర్వాహకులు వీరికి ఆలయ నమూనాతోపాటు పాలరాతి ఏనుగు, నెమలి ప్రతిమలను బహూకరించారు.

సాక్షి
కరీంనగర్
సోమవారం ׀ 11 ׀ సెప్టెంబర్ ׀ 2023

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాంనగర్, మంకమ్మతోట, మార్కండేయనగర్, ప్రగతినగర్, శివనగర్, రాజీవ్‌పార్క్, హౌసింగ్‌బోర్డ్ కాలనీ, బతకమ్మ కాలనీ, టెలిఫోన్ క్వార్టర్, సప్తగిరి బైపాస్, విశ్వశాంతి పాఠశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

న్యూస్‌రీల్

ఓటర్లు చైతన్యంగా వ్యవహరించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న వీసీ మల్లేశ్

కరీంనగర్‌స్పోర్ట్స్: ఓటర్లు చైతన్యంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తద్వారా అభివృద్ధి శరవేగంగా కొనసాగుతుందని శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఎస్.మల్లేశ్ అన్నారు. జిల్లా సైక్లింగ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తెలంగాణ చౌక్‌లో ఏర్పాటు చేసిన ఓటర్ల అవగాహన సైక్లింగ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా నిర్ణయాత్మక పాత్రను పోషించడమే కాకుండా అభివృద్ధికి చేయూతనిస్తున్నాయని అన్నారు. తెలంగాణచౌక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కోర్టు చౌరస్తా వరకు సాగింది. సైక్లింగ్ సంఘం చైర్మన్, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి, బుర్ర మధుసూదన్‌రెడ్డి, సురభి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌బీలో చేరిన కటుకం మృత్యుంజయం



కటుకంకు కండువా కప్పుతున్న నాయకులు

కరీంనగర్: కరీంనగర్ మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు కటుకం మృత్యుంజయం ఆదివారం ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లోపాయి కారి ఒప్పందంతో రాజకీయాలు చేస్తున్నారని ఆరోపిస్తూ రెండు రోజుల క్రితమే బీజేపీకి రాజీనామా చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ)పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్ రెడ్డితో ఆదివారం కటకం మృత్యుంజయం కలకత్తా వెళ్లారు. ఏఐఎఫ్‌బీ జాతీయ కార్యదర్శి దేవరాజన్‌ను కలిసి పార్టీలో చేరారు. మృత్యుంజయంకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ బాధ్యతలను అప్పగిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరాజన్ కీలక ప్రకటన చేశారు.

సమస్యలు పరిష్కరించండి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: పదోన్నతులు, బదిలీలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం డీఈవో జనార్దన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. తపస్ నాయకులు మాట్లాడుతూ ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్లు తెలుగు మీడియం బదులు ఇంగ్లిష్ మీడియం పెట్టిన ఉపాధ్యాయులను తెలుగు మీడియం లిస్టుకు యాడ్ చేసినప్పుడు వారి పాయింట్స్‌తో సంబంధం లేకుండా సీనియారిటీలిస్టులో ముందుకు రావడం జరిగిందని వాటిని సవరించాలన్నారు. ట్రాన్స్‌ఫర్స్ సీనియారిటీ లిస్టులో వికలాంగుల కోటాలో 70శాతం లేని వారి పేర్లు కూడా ప్రిఫారెన్షియల్ కేటగిరీలో ఉన్నాయని, వాటిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష ప్రధా న కార్యదర్శులు కట్ట రాజేశ్వర్ గన్నమనేని రంగారావు, రాష్ట్ర కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు, జిల్లా బాధ్యులు వినయధర్ రాజు, అచ్యుతరెడ్డి, ఉదయ్‌కిరణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

జాబితాలో తప్పులు సవరించాలి

విద్యానగర్(కరీంనగర్): ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన జాబితాలో దొర్లిన తప్పులను సవరించాలని కోరుతూ ఆదివారం కరీంనగర్ జిల్లా విద్యాధికారి జనార్దన్ రావుకు పీఆర్‌టీయూటీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. 317జీవోలో భాగంగా జిల్లాకు అలాటైన ఉపాధ్యాయులకు 0.25 పాయింట్లు తక్కువగా వస్తున్నాయని, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు వెరిఫికేషన్‌కు రాని కట్ ఆఫ్ గతంలో రెండు సార్లు పదోన్నతులు తిరస్కరించిన వారిని, కట్‌ఆఫ్ కన్నా ముందున్న వారిని పదోన్నతుల జాబితా నుంచి తొలగించాలని, మ్యూచువల్ బదిలీల్లో భాగంగా ఇతర జిల్లాలకు వెళ్లిన వారిని జాబితా నుండి తొలగించాలని ఆ వినతి పత్రంలో కోరారు. పీఆర్‌టీయూటీ జిల్లా అధ్యక్షులు ముస్కు తిరుపతిరెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముజీబ్ అహ్మద్, వేముల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.



నగరంలోని తీగలవంతెన వద్ద ఆదివారం రాత్రి అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ ఆకట్టుకుంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టిగణపతులనే పూజించాలని ఈ సందర్భంగా అవగాహన కల్పించిన తీరు ఆలోచింపజేసింది. – కరీంనగర్



ఐలమ్మకు నివాళి అర్పించిన మంత్రి కమలాకర్, కలెక్టర్ గోపి, మేయర్, తదితరులు

జోహార్ ఐలమ్మ

భూమి కోసం, భుక్తి కోసం, దోపిడీ నుంచి విముక్తి కోసం పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. చాకలి ఐలమ్మ 38వ వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రతిమ మల్టీప్లెక్స్ వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మేయర్ వై.సునీల్ రావు, కలెక్టర్ బి.గోపి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో కె. మహేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, తెలంగాణ రజక సంఘాల వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల సంపత్, శ్రీనివాస్, ప్రశాంత్, శ్రీకాంత్, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు. కాగా.. కలెక్టరేట్ సమావేశ మందిరంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. – కరీంనగర్

ఇరుక్కుంటున్నామా!



- బల్దియా అధికారుల్లో గుబులు
- అక్రమాలకు బాధ్యులయ్యే అవకాశం
- ప్రజాప్రతినిధులపైనే మరికొంతమంది భరోసా
- బోర్‌వెల్ వ్యవహారంతో అధికారుల్లో అలజడి

కరీంనగర్ కార్పొరేషన్:

నగరపాలక సంస్థలో చోటుచేసుకుంటున్న అవినీ తి అక్రమాలు అధి కారుల మెడకు చుట్టుకుంటున్నాయి. అంచనాలు అడ్డగోలుగా పెంచడం, చేసిన పనికి మించి బిల్లులు ఇవ్వడంలో అధికారుల పాత్రే కీలకం. అక్రమాలు వెలుగు చూస్తే అధికారిక సంతకాలతో సాంకేతికంగా ఇరుక్కోవాల్సి వస్తోంది. తాజాగా గాంధీ జంక్షన్ బోర్‌వెల్ వ్యవహారంలో రూ.9,060కు బదులుగా రూ.90,600 చెల్లించిన అవినీతి బాగోతం ఓ అధికారిని ఇరకాటంలో పడవేసింది. ఇదే తరహా ఉదంతాలు మరికొన్ని నగరపాలకసంస్థలో చోటుచేసుకోనున్నట్లు సమాచారం.

పనుల జాతర..

నగరంలో వేలకోట్ల రూపాయలతో అభివృద్ధి పనుల జాతర కొనసాగుతోంది. రోడ్లు, ఫుట్‌పాత్‌లు, పైప్‌లైన్లు, జంక్షన్‌లు, భవనాలు తదితర అన్ని విభాగాల్లో ఈ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇదే సమయంలో అక్కడక్కడా అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. కొంతమంది అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై చేతివాటం ప్రదర్శిస్తుండడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. జంక్షన్‌లు, సమీకృత మార్కెట్‌ల నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఇటీవల తరుచూ వినిపిస్తున్నాయి. ఇందుకు సంబంధించి విజిలెన్స్ విభాగానికి, కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ క్రమంలోనే కార్ఖానగడ్డలోని మహాత్మగాంధీ జంక్షన్‌లో బోర్‌వెల్ పేరిట కాంట్రాక్టర్ ఎత్తిన బిల్లు అక్రమాలను తేటతెల్లం చేసింది. 150 మీటర్ల మేర కేసింగ్ వేసినట్లు రూ.90,600 బిల్లు చెల్లించిన వైనం నగరపాలకసంస్థలో అక్రమాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో తెలియచేసింది. ఈ వ్యవహారంపై 'అవినీతి గోతులు గాంధీకే ఎరుక' పేరిట 'సాక్షి'లో వచ్చిన కథనంతో అధికారుల్లో అలజడి మొదలైంది. బోర్‌వెల్ బిల్లులపై సంతకం చేసిన అధికారులు ఇప్పుడు తలలు పట్టుకొంటున్నారు. అక్రమాలు జరిగినట్లు స్పష్టంగా వెల్లడవుతుండగా, బిల్లులపై సంతకాలు చేసిన అధికారులు ఈ వ్యవహారంలో బాధ్యులయ్యే ప్రమాదం ఏర్పడింది. దీనితో 'తమతో సంతకాలు చేయించిన' వారిపై సదరు అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. అనవసరంగా తమను ఇరికించారని, ఎలాగైనా ఇందులో నుంచి బయటపడేయాలంటూ వేడుకొంటున్నారు. మరికొంతమంది తాము ఏం చేసినా ప్రజాప్రతినిధులే కాపాడుకుంటారనే ధీమాతో ఉన్నారు.

మా కెందుకీ తంట...

సాధారణంగా వచ్చే కమీషన్లకు అధికారులు సై అంటున్నా అసాధారణ రీతిలో బిల్లులు తారుమారు చేయడంపై మాత్రం నై అంటున్నారు. పెద్ద ఎత్తున స్కాంలలో తలదూర్చడం వల్ల అన్ని రకాలుగా నష్టపోతామని, తాము ఉద్యోగాలను సైతం వదులుకొనే పరిస్థితి ఏర్పడుతుందనే ఆందోళనతో ఉన్నారు. వీరు చాలా సందర్భాల్లో భారీ స్థాయిలో జరిగే దొంగబిల్లులపై సంతకాలు పెట్టడానికి వెనుకంజ వేస్తున్నారు. ఆయా సందర్భాల్లో అదే స్థాయి ఇతర అధికారుల సంతకాలతో కాంట్రాక్టర్లు పనికానిచ్చిన సందర్భాలున్నాయి. మరికొద్దిమంది కాంట్రాక్టర్లు తీవ్ర ఒత్తిడి తెచ్చి వాళ్లతోనే సంతకాలు చేయించుకొంటున్నారు. ఇలాంటి సందర్భాల్లోనే అధికారులు ఇరుక్కుంటున్నారు.

ప్రజాప్రతినిధులపైనే భరోసా

- 'మీరు (కార్పొరేటర్లు) మా వెంట ఉంటే చాలు...ఏ పేపర్ల ఏం వచ్చినా...ఎవరు ఏం చేసినా మాకేం కాదు..' ఇది ఇటీవల నగరపాలకసంస్థ కార్యాలయంలో ఓ ఉన్నతాధికారి అధికార కార్పొరేటర్లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు. తమపై వచ్చిన అవినీతి ఆరోపణలు నిజం కావని అనకుండా...తాము ఏం చేసినా కార్పొరేటర్లు చూసుకుంటారనే ధీమా సదరు ఉన్నతాధికారి మాటల్లో కనిపించింది. ఇది నగరపాలకసంస్థలో కొద్దిమంది అధికారుల తీరును తెలియచేస్తోంది. తాము ఏం చేసినా...చివరకు తమను ప్రజాప్రతినిధులు కాపాడుతారనే భరోసా కొద్దిమంది అధికారుల్లో బలంగా వేళ్లూనుకుపోయింది. దీనితో ఆరోపణలు, ఫిర్యాదులను సైతం పట్టించుకోని స్థాయికి ఆ అధికారులు వెళ్లారు. మొత్తానికి నగరపాలకసంస్థలో కొంతమంది అధికారులు అక్రమాలపై బిందాస్‌గా ఉండగా, మరికొంతమంది మాత్రం 'ఇరుక్కోవడానికి' ఇష్టపడడం లేదు. ఏదేమైనా గాంధీ జంక్షన్‌లో అక్రమాలు వెలుగులోకి రావడం, మరిన్ని అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉండడం...ఇప్పుడు అధికార వర్గాల్లో తీవ్ర కలకలం సృష్టిస్తోంది.

చకచకా.. ఆర్వోబీ



పిల్లర్ల కోసం కొనసాగుతున్న పనులు

- చురుగ్గా సాగుతున్న పనులు
- రూ.154.74కోట్లతో నిర్మాణం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్- చొప్పదండి దారిలోని తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కరీంనగర్ వైపు మాణిక్యేశ్వరి గుడి ముందుభాగంలో నెలరోజుల నుంచి పనులు జరుగుతున్నాయి. జేసీబీతో రోడ్డును తవ్వి పిల్లర్లు ఏర్పాటు చేస్తున్నారు. వన్ వే ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. కరీంనగర్ రైల్వేస్టేషన్‌కు ప్యాసింజర్, గూడ్స్ రైళ్ల రాకపోకలు పెరగడంతో కరీంనగర్-చొప్పదండి దారిలో తీగలగుట్టపల్లి వద్ద నిత్యం రైల్వేగేట్ వేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మంచిర్యాల, లక్సెట్టిపేట్, ఉట్నూరు, ధర్మారం, వెల్గటూరు తదితర ప్రాంతాల నుంచి రోగులు వైద్యం కోసం కరీంనగర్ వస్తుంటారు. రైళ్లు వచ్చేటప్పుడు గేటువేయడంతో కొన్ని గంటలపాటు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ముందుగా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేయగా రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించకపోవడంతో జాప్యమేర్పడింది. ఈ క్రమంలోనే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ విజ్ఞప్తి మేరకు జనవరిలో కేంద్ర ప్రభుత్వం సేతు బంధన్ పథకం కింద తీగలగుట్టపల్లి ఆర్వోబీకి రూ.154.74కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా చేపట్టిన ఆర్వోబీకి రెండునెలలక్రితం టెండర్ పూర్తికావడంతో ఆర్‌అండ్‌బీశాఖ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. నెలరోజుల నుంచి పిల్లర్ల కోసం జేసీబీతో రోడ్డును తవ్వే పనులు చేపట్టారు.

ఏడాదిన్నరలో పూర్తి

తీగలగుట్టపల్లి ఆర్వోబీ పనులు చురుకుగా సాగుతున్నాయి. ప్రస్తుతం అమ్మగుడి ముందు నుంచి కరీంనగర్‌వైపు దారిలో పిల్లర్ల పనులు నడుస్తున్నాయి. పనులు పూర్తి చేసేందుకు రెండేళ్ల గడువు ఉన్నప్పటికి యుద్ధప్రాతిపదికన ఏడాదిన్నరలో పూర్తి చేసేందుకు తగిన చర్యలు చేపట్టాం.

– లక్ష్మణ్‌రావు, ఆర్‌అండ్‌బీ ఏఈఈ

జీవితం కవిత్వానికి కొలమానం



పురస్కార గ్రహీతను సన్మానిస్తున్న సిధారెడ్డి, తదితరులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కవిత్వానికి జీవితమే కొలమానం అని, తెలంగాణ నేల కొత్తశక్తిని అందిస్తుందని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాకేంద్రంలోని ఫిలింభవన్‌లో ఆదివారం జరిగిన కాళోజీ పురస్కార ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కవిత్వానికి రూపం, శిల్పం అలంకారాలు మాత్రమేనని రమ్యం కాదని, సామాన్య మానవుడిని ఒప్పించేది మాత్రమే కవిత్వంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కవిత్వానికి కులాలు, మతాలతో సంబంధమే లేదన్నారు. మంచి కవిత్వం పది కాలాల పాటు నిలిచిపోతుందని వివరించారు. ప్రైజ్ మనీతో సంబంధం లేకుండా హృదయంతో ఇచ్చే పురస్కారం ప్రోత్సాహాన్ని అందిస్తుందని, అదే కాళోజీ నారాయణరావు పేరిట అందించే ఈ పురస్కారమని వెల్లడించారు. కవులకు పురస్కారాలు ప్రేరకాలుగా ఉంటాయన్నారు. అనంతరం ప్రముఖ కవి కందుకూరి శ్రీరాములుకు 2023వ సంవత్సరానికిగాను కాళోజీ పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం, రూ.2వేల నగదు అందించారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త అనిల్‌కుమార్, గంగ్ర లక్ష్మణ్‌రావు, దాస్యం సేనాధిపతి, వేణు, కేఎస్ అనంతాచార్య, గుగ్రాల మాధవ్, బొమ్మకంటి కిషన్, డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ కలువకుంట్ల రామకృష్ణ, గులాబీల మల్లారెడ్డి, చిందం సునీత, బూర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఇది.. మా అడ్డా..

జిల్లాకేంద్రంలోని హాస్పిటల్స్ ఏరియా నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం. ఈ ఏరియాలో మధ్యాహ్నం, సాయంత్రం సమయంలో వాహనం కదలడం చాలాకష్టం. ఇలాంటి దారిపై ప్రయివేటు అంబులెన్స్ నిర్వాహకులు యథేచ్ఛగా వాహనాలు నిలుపుతున్నారు. రోడ్డు పక్కన పార్కింగ్ చేసి వెళ్లడంతో ఇతర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ఫీజు లెక్క.. ఆన్‌లైన్‌లో పక్కా!

- ప్రయివేటు పాఠశాలల్లో ఫీజు వసూళ్లపై ప్రభుత్వం దృష్టి
- ఏయే తరగతికి ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో..
- సమాచారం ఇవ్వాలని విద్యాశాఖ ఆదేశం
- సమాయత్తం అవుతున్న జిల్లా అధికారులు



కరీంనగర్: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వసూళ్లపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇక నుంచి ఏ పాఠశాలలో ఏ తరగతికి ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో చెప్పాల్సిందేనని విద్యాశాఖ ఆదేశించింది. దీంతో జిల్లాలోని పాఠశాలల్లో తరగతుల వారీగా ఫీజుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు విద్యాశాఖ సమాయత్తమవుతోంది. 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల వివరాలు పాఠశాల విద్యాశాఖకు చెందిన ఐఎస్‌ఎంఎస్ పోర్టల్‌లో పొందుపరిచేందుకు సిద్ధమవుతోంది. ఇందు కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సైతం రూపొందించారు.

చట్టం ఏం చెబుతోంది..

- పాఠశాలస్థాయిలో ఫీజు నియంత్రణ చట్టం ఉన్నప్పటికీ ఏళ్లకాలంగా అమలుకు నోచుకోవడం లేదు. దీంతో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు దోచుకుంటున్నాయి.
- ఉమ్మడి జిల్లా పరిధిలోని 1100కు పైగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో 3లక్షలకు పైగా మంది విద్యార్థులు చదువుతున్నారు. ఫీజుల నియంత్రణ చట్టం అమలు కాకపోవడంతో పాఠశాలల నిర్వాహకులు సూచించిన విధంగానే ఫీజులు కడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ జేబులను గుల్ల చేసుకుంటున్నారు.
- పాఠశాలల నిర్వాహకులు బోర్డులపై రకరకాల తోక, ముద్దు పేర్లతో తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తూ దండుకుంటున్నాయి. అధిక ఫీజులు వసూలు చేస్తున్నా వీటివైపు ఏ ఒక్కరూ కన్నెత్తి చూడకపోవడం పేద విద్యార్థులకు శాపంగా మారుతోంది.
- ట్రస్టు పేరుతో పాఠశాల ఏర్పాటు చేస్తేనే ఆ విద్యాసంస్థకు ప్రభుత్వ గుర్తింపు లభిస్తుంది. అలా ఏర్పాటైన పాఠశాలకు తప్పనిసరిగా గవర్నింగ్‌బాడీని ఏర్పాటు చేయాలి. ట్రస్టు చైర్మన్, కరస్పాండెంట్, హెచ్‌ఎం, టీచర్, పేరెంట్‌తో గవర్నింగ్ బాడీని నియమించి, ఏయే తరగతులకు ఎంత ఫీజు తీసుకోవాలి..? అర్హత మేరకు ఉపాధ్యాయులకు జీతం ఎంత చెల్లించాలనే నిర్ణయం తీసుకోవాలి.
- అయితే ఎక్కడా అది అమలవుతున్న దాఖలాలు లేవు. ఒక్క కరీంనగర్ సిటీలోనే ప్రైవేట్, కార్పొరేట్ కలిపి దాదాపు 200 వరకు పాఠశాలలున్నాయి. కొన్ని పాఠశాలల్లో పేపర్‌పై మాత్రమే గవర్నింగ్ బాడీని చూపించి, మిగిలిన అన్ని పనులను యాజమాన్యమే చక్కదిద్దుకుంటోంది.
- ప్రతీ పాఠశాలలో తరగతి వారీగా ఫీజు వివరాలను నోటీసు బోర్డులో ఉంచాలి. ఉపాధ్యాయుల అర్హత వివరాలను ఇందులో పొందుపరచాలి. అయితే చాలా పాఠశాలల్లో ఫీజు పట్టికను ఏర్పాటు చేయడం లేదు. ఫీజు నియంత్రణ బాధ్యత అధికారులందేనన్న భావన తల్లిదండ్రుల్లో నెలకొంది.

ప్రైవేట్‌లో పట్టని జీవోలు

- 1994లో జారీ చేసిన జీఓ నంబరు-1లో ప్రైవేటు పాఠశాలలో రుసుం నిర్ణయించడానికి పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్, తల్లిదండ్రుల్లో ఇద్దరితో ఓ కమిటీని నియమించాలని సూచించారు. పాఠశాల వసూలు చేసే రుసుంలో 5శాతం యాజమాన్యం ఆదాయం కింద, 15శాతం పాఠశాల నిర్వహణ, 15శాతం పాఠశాల అభివృద్ధికి ,15 శాతం ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రయోజనాలకు, 50 శాతం వేతనాలకు వినియోగించాలని పేర్కొన్నారు. ఏటా పాఠశాలలో వసూలైన రుసుం మొత్తం, ఖర్చుల ఆడిట్ రిపోర్టులను జిల్లా విద్యాశాఖాధికారికి యాజమాన్యాలు సమర్పించాలి. ఇవేమీ జిల్లాలో అమలు కావడం లేదు.
- 2008లో జారీ చేసిన జీవో నంబరు 90,91,92 ద్వారా రుసుం నిర్ణయించేందుకు డీఈఓ, జిల్లా ఆడిట్ అధికారి, స్వచ్ఛంద సంస్థ లేదా పేరెంట్స్ కమిటీ ప్రతినిధితో కూడిన రుసుంల రెగ్యులేటరీ కమిటీని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నియమించాలని సూచించారు. ఈ కమిటీ పాఠశాలలను పరిశీలించి మౌలిక సదుపాయాలు, పరిస్థితులను చూసి ఎంత వసూలు చేయాలో నిర్ణయిస్తుంది. దీని అమలుపై అధికారుల పర్యవేక్షణ లేదు. పాఠశాలల్లో అమలు కంటితుడుపు చర్యగానే నెలకొంది.
- జీవో 42 ప్రకారం ఉన్నత పాఠశాలకు పట్టణ ప్రాంతాల్లో రూ.11,800, గ్రామీణ ప్రాంతాల్లో 10,800, ప్రాథమిక పాఠశాలలకు పట్టణ ప్రాంతాల్లో రూ. 10,000, గ్రామీణ ప్రాంతాల్లో 9,000 వరకు వసూలు చేయాలని సూచించారు. పై నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చట్టాన్ని అమలు చేయాలి



ఫీజు నియంత్రణ చట్టం ఉందన్న విషయం చాలా మందికి తెలియనే తెలియదు. రాజకీయ , ధన బలంతో చట్టాన్ని అమలు చేయడం లేదు. ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని పోరాడుతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తున్న పాలకుల వైఫల్యం వల్లే విద్యావ్యవస్థ చిన్నాభిన్నమవుతుంది.

– కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

క్లుప్తంగా

మృతదేహం లభ్యం



రాజమౌళి(ఫైల్)

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామ పరిధిలోని ఎస్సారెస్పీ కాలువలో ఇటీవల గల్లంతైన వేముల రాజమౌళి మృతదేహం వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట రిజర్వాయర్‌లో లభ్యమైంది. కేశవపట్నం ఎస్సై లక్ష్మారెడ్డి వివరాల ప్రకారం.. కొత్తగట్టు గ్రామానికి చెందిన రాజమౌళి ఈనెల 6న వేకువజామున వాకింగ్‌కు వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. అతడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సారెస్పీ కాలువ నీటిని నిలిపివేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం వర్ధన్నపేట రిజర్వాయర్‌లో లభ్యం కావడంతో హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై వివరించారు.

ఒకరి అదృశ్యం.. కేసు నమోదు

జమ్మికుంట: మండలంలో ఓ వ్యక్తి అదృశ్యం కాగా కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బార్పటి రమేశ్ తెలిపారు. మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన కూతురు శ్యామ్ గత నెల 20న హైదరాబాద్‌లో పనిఉందని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగిరాలేదు. కొన్నిరోజులుగా బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆ చూకీ లభించలేదు. దీంతో ఆదివారం శ్యామ్ భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

జమ్మికుంట: ఓ మహిళను ఇంట్లోకి చొరబడి, దాడిచేసి, చంపుతామని బెదిరించిన ఘటనలో ముగ్గురు మహిళలపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బార్పటి రమేశ్ తెలిపారు. పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన కనుకుట్ల ఉమ ఇంట్లోకి పట్టణానికి చెందిన పోతుల పాపమ్మ, పసరగొండ సృజన, బీట్ల ప్రభారాణి అకారణంగా చొరబడి ఆమెపై దాడిచేశారు. చంపుతామని బెదిరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుకలారీ బోల్తా


వీణవంక: మండలంలోని దేశాయిపల్లి శివారు ఐలబాద్ గ్రామం వద్ద ఇసుక లారీ బోల్తా పడింది. చల్లూరు మానేరు వాగులో ఇసుక లోడ్ చేసుకొని జమ్మికుంట వైపు వెళ్తుండగా.. డ్రైవర్‌హరీఫ్‌ఖాన్ ఆజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో ఐలబాద్ వద్ద కుక్కను, అక్కడే ఉన్న మంచినీటి పంపును ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు ప్రాణాపాయం తప్పింది. గ్రామానికి చెందిన పురంశెట్టి రవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై ఆసిఫ్ కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని ప్రగతినగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. చల్ల రాజేశ్వర్‌రెడ్డి(49) కుటుంబ స్వగ్రామం నేదునూర్ కాగా ప్రగతినగర్‌లోనూ ఇల్లు నిర్మించుకున్నారు. అందరూ ఇక్కడే ఉంటూ అప్పుడప్పుడు నేదునూర్ వెళ్తొస్తున్నారు. రాజేశ్వర్‌రెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో అతని తల్లిదండ్రులు శనివారం స్వగ్రామం వెళ్లగా ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. అదేరోజు రాత్రి తండ్రితో ఫోన్‌లో మాట్లాడాడు. ఆదివారం ఉదయం తండ్రి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో అనుమానం వచ్చి, పైఅంతస్తులో అద్దెకు ఉంటున్నవారిని ఇంట్లో చూడమని చెప్పాడు. వారు వెళ్లి చూసేసరికి మృతిచెందాడు. క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి రమణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతిభ ప్రతిబింబించేలా..

- విద్యార్థుల విజ్ఞానానికి చక్కని వేదిక మంథన్
- ఈనెల 15 దరఖాస్తులకు చివరి తేదీ



వీవీఎం లోగో

జ్యోతినగర్(రామగుండం): విద్యార్థి దశ నుంచి సైన్స్‌పై ఆసక్తి కలిగించడం, శాస్త్ర సాంకేతిక అభివృద్ధిలో భారతీయుల కృషి తెలియజేసే ఉద్దేశమే విద్యార్థి విజ్ఞాన్ మంథన్. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రెనింగ్ (ఎన్‌సీఈఆర్టీ), విజ్ఞాన భారతి, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం సంయుక్తంగా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పేరుతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఏటా ఆన్‌లైన్ వేదికగా ప్రతిభ పరీక్ష నిర్వహిస్తోంది.

పరిశోధన సంస్థల సందర్శన

- పలు జాతీయ ప్రయోగశాలల సందర్శనతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందుకునే అరుదైన అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తోంది.
- ఇందులో డీఆర్డీవో, బార్క్, సీఎస్ఐఆర్ వంటి ప్రఖ్యాత పరిశోధన సంస్థలున్నాయి. వాటిని సందర్శించే అవకాశంతో పాటు మూడు వారాలు ఇంటర్న్‌షిప్ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పరీక్ష నిర్వహిస్తోంది.
- ఇందులో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆ ప్రయోగశాలల సందర్శనతో కొత్త స్ఫూర్తి పొందే అవకాశముంది. 2024 సంవత్సరానికి సంబంధించి జాతీయస్థాయి పరీక్ష మే 18, 19న నిర్వహించనున్నారు.
- నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రెనింగ్ (ఎన్‌సీఈఆర్టీ), విజ్ఞాన భారతి, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 6 నుంచి 11వ తరగతి (ఇంటర్ ప్రథమ సంవత్సరం) విద్యార్థులకు ఆన్‌లైన్ వేదికగా ఈ పరీక్ష నిర్వహిస్తారు.
- 6 నుంచి 8వ తరగతి వరకు జూనియర్లుగా, 9 నుంచి 11 వరకు సీనియర్లుగా పరిగణిస్తారు. ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, రాష్ట్ర బోర్డు విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులు.

ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష..

- అక్టోబరు 1న నమూనా పరీక్ష ఉంటుంది. అదే నెల 29 లేదా 30న జిల్లాస్థాయిలో పరీక్షను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. సీనియర్, జూనియర్ విభాగంలో 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు ఉంటుంది. గణితం, సామాన్య శాస్త్ర పాఠ్య పుస్తకాల నుంచి 50 శాతం, విజ్ఞానశాస్త్రం రంగంలో దేశ కృషిపై 20 శాతం, లాజిక్ రీజనింగ్‌కు 10 శాతం, శాస్త్రవేత్త బీర్బల్ సహానీ జీవిత చరిత్రకు 20 శాతం బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి.

జిల్లాస్థాయిలో ఇలా..

- జిల్లాలో ఆరో తరగతి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం వరకు ప్రతి తరగతిలో ప్రతిభచూపిన మొదటి ముగ్గురు చొప్పున మొత్తం 18 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలను ఆన్‌లైన్‌లో అందిస్తారు.

రాష్ట్రస్థాయిలో..

- పాఠశాల స్థాయి ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభచూపిన మొదటి 20 మంది విద్యార్థులను ఎంపిక చేసి మొత్తం 120 మందిని రాష్ట్రస్థాయికి పంపుతారు. అత్యంత ప్రతిభకనభర్చిన 18 మందిని రాష్ట్రస్థాయి విజేతగా ప్రకటిస్తారు. వారిలో మొదటి ముగ్గురికి రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేల చొప్పున నగదు ప్రోత్సహకాలిస్తారు.

జాతీయ స్థాయిలో..

- రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనభర్చినవారి నుంచి 18 మందిని జాతీయ స్థాయి ప్రతిభావంతులుగా గుర్తిస్తారు. వీరిని హిమాలయన్స్ అంటారు. వారికి రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు నగదు ప్రోత్సాహకాలు ఇస్తారు. వీటితో పాటు నెలకు రూ.2 వేల చొప్పున ఏడాది పాటు ఉపకారవేతనం అందిస్తారు.

దరఖాస్తు ఇలా..

- 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ ద్వారా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పరీక్ష నిర్వహించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. పోటీలు పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో నిర్వహిస్తారు. www. vvm. org. in వెబ్‌సైట్‌లో రూ.200 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి ఈనెల 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబరు 1న నమూనా పరీక్ష నిర్వహిస్తారు. తెలుగు, హిందీ, ఆంగ్లం విభాగాల్లో పరీక్ష ఉంటుంది.

విద్యార్థులకు మంచి అవకాశం



విద్యార్థుల విజ్ఞానానికి మంచి అవకాశం. పరీక్షను విద్యార్థులు వ్యక్తిగతంగా, పాఠశాల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సైన్స్ ప్రయోగాలకు బీజం పాఠశాల స్థాయి నుంచే కలగాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఏటా దీన్ని నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి, అభిరుచి కలిగించడం, వారిలోని నైపుణ్యాలు, సృజనాత్మకతను వెలికితీయడం ఈ పరీక్ష ఉద్దేశం. వీవీఎం పరీక్షలో విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

– బి.రవినందన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి, పెద్దపల్లి

దుబాయ్‌లో మండెపల్లి వాసి మృతి



విషాదంలో కుటుంబ సభ్యులు



పర్శరాములు (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బతుకుదెరువు కోసం గల్ఫ్‌బాట పట్టిన వలసజీవి అక్కడే గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామానికి చెందిన లింగం పర్శరాములు(38) నాలుగేళ్లుగా బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడ అల్జమాల్ కంపెనీలో లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన పర్శరాములు జూలై 9న తిరిగి దుబాయ్ వెళ్లాడు. శనివారం రోజువారీగా పనికి వెళ్లి అక్కడే గుండెపోటుకు గురై మరణించాడు. మృతుడికి భార్య అనూష, మూడేళ్ల కూతురు జశ్విత, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు ఉన్నారు. ప్రస్తుతం భార్య గర్భిణి. ఇంటి పెద్ద దిక్కు మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. పర్శరాములు మృతదేహాన్ని దుబాయ్ నుంచి స్వగ్రామానికి తెప్పించేందుకు మంత్రి కేటీఆర్ సాయం చేయాలని వేడుకుంటున్నారు.

ఈఎన్‌టీ వైద్యుల సేవలు అభినందనీయం



బాలుడికి వినికిడి పరికరం అందిస్తున్న మేయర్ సునీల్‌రావు

- మేయర్ వై.సునీల్‌రావు

కరీంనగర్‌టౌన్: వినికిడిని కోల్పోయిన వారిని గుర్తించి, ఖరీదైన పరికరాలను ఉచితంగా అందజేస్తున్న కరీంనగర్ ఈఎన్‌టీ వైద్యుల సేవలు అభినందనీయమని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ఆదివారం నగరంలోని ఐఎంఏ హాలులో ఈఎన్‌టీ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వినికిడి పరికరాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వినికిడి లోపం ఉన్న వారికి ఆయన చేతులు మీదుగా వినికిడి పరికరాలను అందచేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... వైద్యం రంగలో గతంలో కంటే ప్రస్తుతం అనేక మార్పులు వచ్చాయన్నారు. ప్రభుత్వం వైద్యాన్ని పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో వినికిడి లోపం గుర్తించే యంత్రాన్ని ఏర్పాటు చేయాలన్న వైద్యుల కోరిక మేరకు, తానే స్వయంగా రాష్ట్ర ఆరోగ్య శాక మంత్రికి లేఖ రాస్తానని అన్నారు. వినికిడి లోపం గుర్తించిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. డాక్టర్లు, ఆసుపత్రులపై దాడులకు పాల్పడితే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎన్‌టీ అసోసియేషన్ చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ రమణాచారి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రాంకిరణ్, ఈఎన్‌టీ డాక్టర్స్ అసోయేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి రమణ, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పి రమేశ్, రాష్ట్ర ఎలెక్టడ్ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సాయిప్రసాదావు, కార్యదర్శి ఎల్ రవికాంత్, తానా అధ్యక్షుడు డాక్టర్ మహేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి దిక్సూచి కవి



పురస్కారాలు స్వీకరించిన కవులు

కరీంనగర్‌కల్చరల్: సమాజానికి దిక్సూచి కవి అని, స్వచ్ఛమైన సమాజాన్ని కోరుకునేవారు సృజనకారులని ప్రముఖ కవి, రచయిత విమర్శకుడు, భవానీ సాహిత్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ అన్నారు. ఆదివారం కరీంనగర్ ఫిలింభవన్‌లో ఆర్యాణి సకల కళా వేదిక, శ్రీ గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ మంథని వారు సంయుక్తంగా నిర్వహించిన అద్వితీయ సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విభిన్న అంశాలపై కవితలు రాస్తూ, కవితా సంకలనాలు వెలువరిస్తూ సమాజ హితం కోసమే కవిత్వమన్న భావంతో ముందుకు సాగుతున్న ప్రముఖ కవి, చిత్రకారుడు దూడపాక శ్రీధర్ అభినందనీయుడని పేర్కొన్నారు. రాయాలన్న కోరిక, తపన కవికి ఉండాలని, చరిత్రలో కవిని సజీవంగా నిలిపేది రచనలేనని సభాధ్యక్షుడు శ్రీగౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ వ్యవస్థాపకుడు దూడపాక శ్రీధర్ అన్నారు. అలాగే ఒక గంట.. రెండు కవితలు పోటీల్లో పాల్గొన్న 50 మంది కవులకు అద్వితీయ సాహితీ పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ పర్యావరణవేత్త పిట్టల రవిబాబు, సంస్థ ప్రధాన సలహాదారు పార్ల వేణుగోపాలరావు, కవి, పారిశ్రామికవేత్త ఒమర్‌ఖాన్ ఎజాస్, ప్రముఖ నటులు రాజా రమేశ్, కవయిత్రి పురం మంగ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రేత అరెస్ట్



పోలీసుల అదుపులో గుండుంబా విక్రేత

వేములవాదరూరల్: గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వేములవాడ రూరల్ ఎస్‌ఐ మారుతి తెలిపారు. కోనరావుపేట మండలం వట్టిమల్లకు చెందిన డొక్క నారాయణ వేములవాడ రూరల్ మండలం జయవరం గ్రామ శివారులో గుడుంబా విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు ఆదివారం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతడి నుంచి 33 గుడుంబా ప్యాకెట్లు, దాదాపు 16 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఏఎస్‌ఐ లక్‌పతి, హెడ్‌కానిస్టేబుల్ రాజేందర్, కానిస్టేబుళ్లు అరీఫ్, శంకర్, సతీష్, శ్రీనివాస్, రాజశేఖర్ ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. గండిలచ్చపేటకు చెందిన బొమ్మెన సమ్మయ్య ట్రాలీ ఆటలో 5 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. బియ్యం, ట్రాలీ ఆటోను స్టేషన్‌కు తరలించి, సమ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా

- బీఆర్ఎస్‌తోనే యువతకు భవిత
- బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్
- పార్టీలో చేరిన పలువురు యువకులు



యువతను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: 'ఎన్నికలు రాగానే బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు కల్లబొల్లి కబుర్లు చెబుతూ వస్తుంటారు.. వారి మాటలు నమ్మకండి. రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించండి. అండగా ఉండి అభివృద్ధి చేసి చూపిస్తా' అంటూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ భరోసా ఇచ్చారు. ఆదివారం నగరంలోని గోపికృష్ణ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంథేన కిరణ్ ఆధ్వర్యంలో 300 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి గంగుల కమలాకర్ హాజరై పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మంత్రి కమలాకర్ మాట్లాడుతూ బీజేపీ పార్టీ కోసం కష్టపడ్డ వారికి సరైన గుర్తింపు లభించడం లేదన్నారు. వారు ఆత్మగౌరవం కోసం బీఆర్ఎస్‌లోకి వస్తున్నారని అన్నారు. మీరు నా కోసం ఐదు నెలల పాటు కష్టపడితే... నేను ఐదేళ్లు మిమ్మల్ని కడుపులో పెట్టుకుని చూసుకుంటానని హామీ ఇచ్చారు. బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి వచ్చిన కార్యకర్తల రాజకీయ భవిష్యత్తు తన బాధ్యతే అన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ కేబుల్ బ్రిడ్జితో కరీంనగర్ దేశంలోనే గొప్ప నగరంగా మారనుందని అన్నారు. మేయర్ యాదగిరి సునీల్‌రావు, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, కార్పొరేటర్లు గందె మాధవి, వాల రమణారావు, దిండిగాల మహేశ్, ఐలేందర్ యాదవ్, బండారి వేణు, గంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేశానికి ఆస్తులు అంబేడ్కర్, జగ్జీవన్‌రాం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రాంలు దేశానికి ఆస్తులు అని, ఏ కులానికో పరిమితమైన వారు కాదని బీసీసంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం మేయర్ వై.సునీల్‌రావుతో కలిసి మంత్రి గంగుల కమలాకర్ నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అటవీశాఖ అధికారి కార్యాలయ సమీపంలో ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. 25వ డివిజన్ కిసాన్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో కార్పొరేటర్లు ఎడ్ల సరిత అశోక్, కంసాల శ్రీనివాస్, కుర్ర తిరుపతితో కలిసి రూ.20లక్షల సాధారణ నిధులతో బాబు జగ్జీవన్‌రామ్ నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

సమైక్య పాలనలో మైనారిటీలను గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగా వాడుకున్నాయని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని షాదీఖానా లో 46వ డివిజన్ కు చెందిన,ముజాహిద్,ఓమర్ ఫారుక్,యండి ఖలీం రజా,యండి నయీమ్ 29వ డివిజన్ చెందిన,మహమ్మద్ షహీద్, యండి షఫీయుల్లా ఫరూకి, సాజీద్ తో పాటు 300 మంది మైనారిటీ నాయకులు మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు.వీరికి మంత్రి గంగుల కమలాకర్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. మేయర్ యాదగిరి సునీల్ రావు,బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్లా హరిశంకర్, కార్పొరేటర్ వంగల శ్రీదేవి పవన్ కుమార్ ,జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు జమీలుద్దీన్, మైనార్టీ నగర అధ్యక్షుడు షౌకత్ అలీ, వాజీద్ నావాజ్ ఫాహాద్, తదితరులు పాల్గొన్నారు.

జనారణ్యంలోకి వన్యప్రాణులు



పారువెల్లలో కోతుల దాడిలో గాయపడిన వృద్ధుడు (ఫైల్)



జంగపల్లిలో ఎలుగుబంటి దాడిలో గాయపడిన రైతు కనుకయ్య (ఫైల్)

- గతంలో చిరుత, ఇప్పుడు ఎలుగుబంట్లు, అడవి పందులు, కోతులు
- పలువురిపై దాడి
- గ్రానైట్ వ్యాపారంలో గుట్టలు కరగడమే కారణం
- భయం గుప్పిట్లో జనం
- గన్నేరువరం మండలంలో పరిస్థితి

గన్నేరువరం(మానకొండూర్): వన్యప్రాణులతో గన్నేరువరం మండలంలోని మైలారం, సాంబయ్యపల్లె, హన్మాజిపల్లె, పంతుళ్ల కొండాపూర్, గోపాల్‌పూర్, మాదాపూర్, పారువెల్ల, గన్నేరువరం ఖాసీంపేట, చాకలివానిపల్లె, చొక్కారావుపల్లె గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఒకవైపు ఎలుగుబంట్లు, మరోవైపు అడవి పందులు, కోతులతో భయాందోళన చెందుతున్నారు. నాలుగు రోజుల క్రితం గన్నేరువరం మండల కేంద్రంలోకి ఎలుగుబంటి వచ్చింది. ఎస్సై చందా నరసింహారావు అప్రమత్తతతో స్థానికుడు తిరుపతికి తృటిలో ప్రమాదం తప్పింది. అంతకుముందు నుంచే గ్రామంలో ఎలుగుబంటి సంచరిస్తోందని రైతులు చెబుతున్నారు. 2020 జనవరిలో కాంతాల రాజిరెడ్డి అనే రైతు వ్యవసాయ బావి వద్దకు వెళ్తుండగా రెండు ఎలుగుబంట్లు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచాయి. తాజాగా ఎలుగుబంటి సంచారంతో రైతులు, ప్రజలు జంకుతున్నారు.


పదేళ్లుగా ఏదో ఒక జంతువు సంచారం

2012–13లో మైలారం, హన్మాజిపల్లె, పంతుళ్ల కొండాపూర్ గ్రామాల్లో చిరుత సంచరించింది. దీంతో చీకటి పడితే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడ్డారు. 2013 మార్చి 17న చిరుత పట్టుబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. అదే ఏడాది మైలారంలో విద్యుత్ షాక్‌తో ఎలుగుబంటి చనిపోయింది. మరో ఎలుగుబంటి గన్నేరువరం, మాదాపూర్, ఖాసీంపేట, చాకలివానిపల్లెతోపాటు సమీప గ్రామాల్లో సంచరించడంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. 2018 డిసెంబర్ 8న చాకలివానిపల్లెలో ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడింది. ఫారెస్ట్ అధికారులు దాన్ని బంధించి తీసుకెళ్లారు. 2019 అక్టోబర్ 8న జంగపల్లికి చెందిన ప్రకాశ్ తన స్నేహితుడితో కలిసి గుండ్లపల్లికి వెళ్లి వస్తుండగా గునుకుల కొండాపూర్–గుండ్లపల్లి గ్రామాల మధ్య రాత్రి సమయంలో రోడ్డుపై రెండు ఎలుగుబంట్లు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచాయి. అదే నెల 16న గ్రామానికే చెందిన చొక్కాల కనుకయ్య వ్యవసాయ బావి వద్ద ఉన్న పశువులకు మేత వేయడానికి వెళ్లగా రెండు ఎలుగుబంట్లు దాడి చేశాయి. 2020లో మైలారం గుట్ట సమీపంలో ఒక ఎలుగుబంటి వేటగాళ్ల ఉచ్చుకు బలైంది. కోతులు ఇళ్లలోకి వస్తున్నాయని, అడవి పందులు పంటలను ధ్వంసం చేస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇక్కడే ఎందుకు?

ఎల్ఎండీ చుట్టూ ఉన్న గుట్టలన్నీ విచ్చలవిడిగా సాగుతున్న గ్రానైట్ వ్యాపారంలో కరిగిపోతున్నాయి. దీంతో వాటినే ఆవాసాలుగా చేసుకొని జీవించిన అడవి జంతువులు గ్రామాల్లోకి వస్తున్నాయి. మానేరు పరివాహక ప్రాంతం కావడం, మైలారం సమీపంలో ల్యాగుట్ట ఉండటం మరో కారణం కావొచ్చని స్థానికులు అంటున్నారు.

బంధించి తీసుకెళ్లాలి



ఎలుగుబంటి సంచారంతో గ్రామ ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడ దాడి చేస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఫారెస్ట్ అధికారులు వెంటనే స్పందించి, ఎవరిపైనా దాడి చేయకముందు బంధించి, తీసుకెళ్లాలి.

– బొడ్డు సునీల్, గన్నేరువరం

గుంపులుగా వెళ్లండి



గన్నేరువరం మండలంలో ఎలుగుబంటి సంచరిస్తోంది. మేము నిఘా పెట్టాం. వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే సమయంలో సమీప రైతులతో కలిసి గుంపులుగా వెళ్లాలి. ఎలుగుబంటి మళ్లీ కనబడితే సమాచారం ఇవ్వాలి.

– గంటల శ్రీనివాస్‌రెడ్డి, ఎఫ్ఆర్‌వో, కరీంనగర్

మంత్రి గంగులకు రైతుల సన్మానం


మంత్రి కమలాకర్‌ను సన్మానిస్తున్న రైతులు, నాయకులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని బొమ్మకల్‌లో రహదారుల నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్‌ను ఆదివారం రైతుబంధు సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. అన్నపూర్ణ రైతుమిత్ర సంఘం, మైనారిటీ, గుంటూరుపల్లి, బొమ్మకల్‌లో రజక సంఘం కమ్యూనిటీ భవనాలకు నిధులివ్వాలని కోరగా మంత్రి స్పందించి, మంజూరు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గోష్కి శంకర్, జకినపల్లి శంకర్, సుధాకర్, మారుతీశ్వర్, అశోక్, శ్రీనివాస్, మైనారిటీ నాయకులు జాబే మహమ్మద్, ఆసిఫ్, సర్వర్, హైమద్, రైతులు మ ల్లయ్య, ఆగయ్య, లింగయ్య, లక్ష్మయ్య, మొండయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం

విద్యానగర్: కరీంనగర్ 16వ డివిజన్ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ పరిధిలోని 18 మంది గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. పద్మనగర్ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కార్పొరేటర్ దంపతులు గర్భిణులకు చీరలు, పండ్లు, గాజులు, పసుపు, కుంకమ అందజేశారు. కార్యక్రమలో జిల్లా మహిళా సంక్షేమాధికారి సరస్వతి, సీడీపీవో ఉషారాణి, సూపరింటెండెంట్ స్వప్న, డాక్టర్ రాజ్‌కుమార్ గౌడ్, ఏఎన్ఎం ఉమాదేవి, రిసోర్స్ పర్సన్లు రాధ, పద్మ, వనిత, అంగన్‌వాడీ టీచర్లు వనజారావు, సరిత తదితరులు పాల్గొన్నారు.


గర్భిణులకు సీమంతం చేసిన కార్పొరేటర్ శ్రీకాంత్, అధికారులు

మహిళలు క్రీడల్లో రాణించాలి


విజేత జట్టుతో ఏసీపీ మాధవి

కరీంనగర్‌రూరల్: మహిళలు క్రీడల్లో రాణించి, ప్రత్యేక గుర్తింపు పొందాలని ఏసీపీ మాధవి అన్నారు. బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహిస్తున్న బీపీఎల్ క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి ఆదివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలను రెండు టీంలుగా విభజించి, జరిపిన క్రికెట్ పోటీల్లో బోమిస్ సూపర్ మామ్స్ టీం విజయం సాధించగా ఏసీపీ కప్ అందించారు. విన్నర్‌భూమిస్ కింగ్స్ ఎలెవన్ పురుషుల జట్టుకు పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి కప్ అందించారు. తల్లిదండ్రులను ప్రోత్సహించేందుకు భవిష్యత్తులో మరిన్ని క్రీడలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రికెట్ కోచ్ నరేష్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి శ్రీకాంత్, పీఈటీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాయీబ్రాహ్మణుల సభకు మంత్రి గంగులకు ఆహ్వానం

విద్యానగర్: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈ నెల 12న జరిగే నాయీబ్రాహ్మణుల ఆత్మగౌరవ మహాసభకు రావాలని నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం కరీంనగర్‌లోని మీసేవ కార్యాలయంలో ఆయనను కలిసి, ఆహ్వానపత్రిక అందించారు. రాష్ట్ర అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య, ప్రధాన కార్యదర్శి పగడాల జయరాం, నగర గౌరవ అధ్యక్షుడు బౌదుర్తి లక్ష్మణ్‌కుమార్, అధ్యక్షుడు జంపాల సంపత్, ప్రధాన కార్యదర్శి కంది వెంకటేశ్, ఉపాధ్యక్షుడు అందుర్తి హరిప్రసాద్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి రూ.లక్ష సాయం


చెక్కు అందిస్తున్న నర్సింగం

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌కు చెందిన వెలుగొప్పుల శ్రీనివాస్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. అతని వైద్యానికి లక్షలాది రూపాయలు ఖర్చు కావడంతో బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారింది. శ్రీనివాస్ భార్య లక్ష్మి, కూతురు, కుమారుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. విషయం తెలుసుకున్న 17 డివిజన్ ఆదిత్యనగర్‌కు చెందిన వరాల లావణ్య–నర్సింగం దంపతులు ఆదివారం వారిని తమ ఇంటికి పిలిపించుకొని, రూ.లక్ష చెక్కు అందజేసి, తమ ఔదార్యం చాటుకున్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట సంగీత విభావరిలో మనోళ్లు


సంగీత విభావరిలో మండలి సభ్యులు

విద్యానగర్: యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా అఖండ హరినామ సంకీర్తన భజన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం జరిగిన భక్తి, భజన సంగీత విభావరిలో కరీంనగర్ గణేశ్‌నగర్ శ్రీ నీలకంఠ భజన మండలి మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు. తమ పాటలతో అందరినీ ఆకట్టుకున్నారు. భజన మండలి గౌరవ అధ్యక్షుడు గర్రెపల్లి ఆంజనేయులు, అధ్యక్షురాలు వడాల మాధవి, ప్రధాన కార్యదర్శి కొండూరి పుష్పలత, కోశాధికారి బెల్లపు సరిత, నిర్వాహకులు పంజాల సంధ్య, బైరి కవి, మండలి కార్య నిర్వాహకుడు పంజాల శ్రీధర్ గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

జ్ఞాపకశక్తిపై అవగాహన సదస్సు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని నగునూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం జ్ఞాపకశక్తి పెంపొందించుకోవడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మెంటలిస్ట్ ఎస్.ఐలయ్య, సైకాలజిస్ట్ అనిత మాట్లాడారు. జ్ఞాపకశక్తి పెంచుకునే విధానాలు, వ్యక్తిగత క్రమశిక్షణ, మోటివేషన్, మానసిక ఆందోళనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ సమత, అధ్యాపకులు స్వప్న, పుష్పలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇష్టారీతిన తవ్వకం
మరమ్మతులో నిర్లక్ష్యం

- నల్లా, పైపులైన్లు, ఇంటర్నెట్ కనెక్షన్ కోసం సీసీరోడ్లు ధ్వంసం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- కరీంనగర్ మండలంలో పరిస్థితి


చెర్లభూత్కూర్‌లో సీసీరోడ్డు తవ్వకంతో ఏర్పడిన గుంతలు

కరీంనగర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీరోడ్లు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపంతో ధ్వంసమవుతున్నాయన్న ఆరోపణలున్నాయి. మిషన్ భగీరథ పథకం నల్లా, పైపులైన్ కనెక్షన్లతోపాటు ఇంటర్నెట్ కనెక్షన్ కోసం ఇష్టారాజ్యంగా రోడ్లను తవ్వేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కానీ, సంబంధిత అధికారులు మరమ్మతు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో నానాతంటాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా రోడ్లకు మరమ్మతు చేయిస్తున్న ప్రజాప్రతినిధులపై ఆర్థిక భారం పడుతోందని అంటున్నారు.

ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

ఐదేళ్ల క్రితం మిషన్ భగీరథ పథకం కింద తాగు నీటి సౌకర్యం కల్పించేందుకు వీలుగా కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో పైపులైన్లతోపాటు నల్లా కనెక్షన్ల కోసం సీసీరోడ్లను తవ్వారు. అనంతరం అధికారులు తాత్కాలికంగా మరమ్మతు చేయించి, చేతులు దులుపుకున్నారు. ప్రధానంగా నగునూరు, చామనపల్లి, చెర్లభూత్కూర్, ఇరుకుల్ల తదితర గ్రామాల్లో ఈ తవ్వకాలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో పైపులైన్ల కోసం తవ్విన ప్రాంతాల్లో సీసీ రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో ద్విచక్రవాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. నీళ్లు నిలిచి, వేగంగా వచ్చే వాహనదారులకు గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే గ్రామాల్లో రెండేళ్ల నుంచి ఇంటింటికీ ఇంటర్నెట్ కనెక్షన్ కోసం కేబుల్ వేసేందుకు సీసీరోడ్లను తవ్వేస్తున్నారు. మళ్లీ మరమ్మతు చేయకపోవడంతో గుంతలు ఏర్పడి, వాహనాల రాకపోకలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. గతంలో చెర్లభూత్కూర్‌లో సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రోడ్డు కటింగ్ చేసిన ప్రాంతాల్లో సీసీ పోసి, పూడ్చివేయించారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో గుంతలుండటంతో స్థానికులు నడిచేందుకూ అసౌకర్యానికి గురవుతున్నారు.

కొన్ని గ్రామాల్లో చేయాల్సి ఉంది

నగునూరు, చామనపల్లి, చెర్లభూత్కూర్ తదితర గ్రామాల్లో సీసీరోడ్లకు మరమ్మతు పూర్తి చేశాం. ఇరుకుల్ల, బొమ్మకల్ తదితర గ్రామాల్లో చిన్న చిన్న పనులు చేయాల్సి ఉంది. కొత్తగా నల్లా కనెక్షన్ల కోసం సీసీరోడ్లు తవ్వినట్లయితే పంచాయతీ ఆధ్వర్యంలో మరమ్మతు చేసుకోవాల్సి ఉంటుంది.

– సూర్యప్రకాశ్‌రెడ్డి, డీఈ, మిషన్ భగీరథ పథకం

12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి


మాట్లాడుతున్న సయ్యద్ సలీం పాషా

విద్యానగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని తెలంగాణ ముస్లిం సంఘాల జేఏసీ అధ్యక్షుడు సయ్యద్ సలీం పాషా డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ ముస్లిం డిక్లరేషన్ సంకల్ప సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు రెండుసార్లు అధికారం కట్టబెడితే ముస్లింలకు దక్కింది ఇఫ్తార్ విందు, ఈద్ బట్టలేనన్నారు. 12 శాతం రిజర్వేషన్ ప్రస్తావన ఊసు లేకుండా పోయిందన్నారు. ఉర్దూ రెండో అధికార భాష అమలు జాడ లేదని పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డుకు జ్యుడీషియల్ అధికారం కల్పిస్తామని అసెంబ్లీ వేదికగా చెప్పిన సీఎం దానికి తాళం వేసి, తన కనుసన్నల్లో పెట్టుకోవడం ఆయన అధికార దుర్వినియోగానికి నిదర్శనమని మండిపడ్డారు. ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ మహమ్మద్ అన్సారీ, ప్రముఖ రచయిత స్కైబాబ, ముస్లిం జేఏసీ రాష్ట్ర నాయకులు సయ్యద్ నవాజ్, యాకుబ్ పాషా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి సయ్యద్ రసూల్, నగర కన్వీనర్ సయ్యద్ అజ్గర్ హుస్సేన్, కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్.. పార్కింగ్ ప్లేస్



రాజీవ్ రహదారిలోని బస్ షెల్టర్లు శిథిలావస్థకు చేరి, నిరుపయోగంగా మారాయి. ప్రయాణికులు బస్సుల కోసం ఎండలో, వానలో రోడ్డుపైనే ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్‌లోని బస్ షెల్టర్ బైక్‌లకు పార్కింగ్ ప్లేస్‌గా మారింది. పైకప్పు రేకులు విరిగిపోయి, శిథిలావస్థకు చేరి, ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి, కొత్త బస్ షెల్టర్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– కరీంనగర్‌రూరల్

కంట్రోల్ వాల్వ్‌లో ఇంత చెత్తనా?


చెత్త తొలగించిన తర్వాత కంట్రోల్ వాల్వ్


వాల్వ్ చాంబర్ నుంచి తీసిన చెత్త

- ఖంగుతిన్న నగరపాలిక సిబ్బంది
- వెంటనే తొలగింపు
- ఫెన్సింగ్ వేయకుంటే తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని పలు రిజర్వాయర్లకు తాగునీటిని సరఫరా చేసే మెయిన్ కంట్రోల్ వాల్వ్ అది. కానీ చెత్తచెదారం.. మూత్రవిసర్జనకు నిలయంగా మారింది. నగరంలోని ఫిల్టర్‌బెడ్ నుంచి తాగునీటి ప్రధాన పైప్‌లైన్ భగత్‌నగర్‌లోని అంబేడ్కర్ స్టేడియం నుంచి రిజర్వాయర్లకు వెళ్తుంది. అంబేడ్కర్ స్టేడియం మెయిన్ గేట్ సమీపంలోని నాలా పక్కన దీనికి కంట్రోల్ వాల్వ్ ఉంది. దీని నిర్వహణపై అధికారులు ఇన్నాళ్లు దృష్టి పెట్టకపోవడంతో డస్ట్‌బిన్‌గా మారింది. సమీపంలోని వ్యాపారులు చెత్తాచెదారాన్ని ఇందులో పడేస్తుండటంతో గుట్టలుగా పేరుకుపోయింది. అలాగే ఈ ప్రాంత వాసులకు వాల్వ్ చాంబర్ సులభ్ కాంప్లెక్స్‌గా మారింది. రిజర్వాయర్లకు సరఫరా చేసే తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఏర్పడింది. శనివారం నగరపాలక సంస్థ సిబ్బంది వాల్వ్‌కు మరమ్మతు చేసేందుకు వచ్చారు. వారు చెత్త గుట్టను చూసి, ఖంగుతిన్నారు. వెంటనే దాన్ని తొలగించారు. వాల్వ్‌కు భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితి రాకూడదంటే చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

బీసీల సింహగర్జనకు తరలివెళ్లిన నాయకులు


హైదరాబాద్ వెళ్తున్న నాయకులు

విద్యానగర్: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన బీసీల సింహగర్జన సభకు జిల్లా నాయకులు తరలివెళ్లారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి జీఎస్.ఆనంద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాచర్ల అంజయ్య గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కోడూరి పర్శరాం గౌడ్, విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్ చారి, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషి, కలర్ సత్తన్న, మంద వెంకన్న, గౌడిశెల రమేశ్, దుంపట మురళి, రాదారపు శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులకు సంఘీభావం


మాట్లాడుతున్న జోజిరెడ్డి

కరీంనగర్: విద్యాశాఖలోని సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న ఉద్యోగులకు ఆయన సంఘీభావం ప్రకటించారు. తెలంగాణ వస్తే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం పదేళ్లవుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే రాష్ట్రంలో పని చేస్తున్న అన్ని శాఖల వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, విధి నిర్వహణలో మృతి చెందినవారికి జీవిత బీమా రూ.20 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులందరికీ 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ పెద్దెల్లి శేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజశేఖర్ గౌడ్, సత్యారావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

కరీంనగర్‌టౌన్: గృహలక్ష్మి పథకం కింద లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని, ఇందుకోసం గ్రామసభ నిర్వహించి, అర్హులను ఎంపిక చేయాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ నాయకులు చెప్పినవారి పేర్లనే నమోదు చేసినట్లు తెలుస్తోందని, విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరారు.

పోరాట స్ఫూర్తి నింపిన ఐలమ్మ



ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు


జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్..


చెర్లభూత్కూర్‌లో ప్రజాప్రతినిధులు, నాయకులు..


బీజేపీ నాయకులు..

కరీంనగర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొరలకు, దేశ్‌ముఖ్‌లకు, జాగిర్దార్‌లకు వ్యతిరేకంగా కదనరంగంలో శివంగిలా దూకిన చిట్యాల ఐలమ్మ తెలంగాణవాసుల్లో పోరాట స్ఫూర్తి నింపారని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం ఐలమ్మ 38వ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ రోడ్‌లోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఐలమ్మ స్ఫూర్తితో జిల్లాలో పేద ప్రజల పక్షాన రాజీలేని పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గీట్ల ముకుందరెడ్డి, గుడి కందుల సత్యం, జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, ఎడ్ల రమేశ్, జి.రాజేశం, నాయకులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌బీ ఆధ్వర్యంలో..

చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో తెలంగాణను పునఃనిర్మించుకోవాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఐలమ్మ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆమె విగ్రహానికి నివాళి అర్పించారు. రాష్ట్రంలోని ఏదో ఒక జిల్లాకు ఐలమ్మ పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ పెద్దెల్లి శేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజశేఖర్ గౌడ్, నగర అధ్యక్షుడు సూర్యారావు, కార్మిక సంఘం నాయకుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో..

ఐలమ్మ వర్ధంతిని జిల్లా గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె జీవితం, పోరాట పటిమ నేటి మహిళా లోకానికి ఆదర్శమన్నారు. మహిళలు ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని, అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. గ్రంథాలయ సిబ్బంది సరిత, గౌతమి, లక్ష్మి, శశి, బీఆర్‌ఎస్ నాయకులు సోమిరెడ్డి, రాజనరేశ్ రెడ్డి, బొంకూరి మోహన్, మునిగంటి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

సీపీఐ నగర శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. పార్టీ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటాన్ని చరిత్రలో చిరస్థాయిగా నిలిపిన వీరవనిత ఐలమ్మ అన్నారు. ఆమె జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు మల్లమ్మ, కసిరెడ్డి మణికంఠరెడ్డి, బ్రాహ్మణపెల్లి యుగంధర్, హేమంత్, సాయి తదితరులున్నారు.

రజక సహకార సంఘం..

జిల్లా కేంద్రంలోని శ్రీమడేలేశ్వర రజక సహకార సంఘం ఆధ్వర్యంలో సంఘం కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. నాయకులు రాజయ్య, నాగరాజు, కుమార్, సంపత్, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: చెర్లభూత్కూర్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతిని రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఉపసర్పంచ్ చిట్కూరి శేఖర్, ఎంపీటీసీ సభ్యుడు బుర్ర తిరుపతిగౌడ్ తదితరులు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. రజక సంఘం అధ్యక్షుడు గుంద్రాతి మహేశ్, యూత్ అధ్యక్షుడు రాచకొండ సతీశ్, పూసాల ఓదెలు, కాంగ్రెస్ నాయకుడు బుర్ర నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి బీజేపీ నాయకులు నివాళి అర్పించారు. ఆమె జయంతి, వర్ధంతిలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీజేపీ అసెంబ్లీ కో–ఇన్‌చార్జి బాస సత్యనారాయణరావు, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, నాయకులు కుమార్, రాము, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎంఐఎం 28వ డివిజన్ అధ్యక్షుడికి సత్కారం



విద్యానగర్: కరీంనగర్‌లోని 28వ డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడిగా నియమితులైన అబ్దుల్లా ఆసీమ్‌ను ఆదివారం సన్మానించారు. పార్టీ నగర శాఖ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, కార్పొరేటర్ అఖిల్ ఫిరోజ్, నాయకులు ఆతిన, అలీబాబా, అజర్, సాజీద్ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

మట్టిపాత్రల విక్రయ కేంద్రానికి కృషి


సన్మానిస్తున్న కుమ్మరి సంఘం నాయకులు

సప్తగిరికాలనీ: రేకుర్తి చౌరస్తా సమీపంలో మట్టిపాత్రల విక్రయ కేంద్ర ఏర్పాటుకు కృషి చేస్తామని 18 డివిజన్ కార్పొరేటర్ ఎస్.మాధవి భర్త కృష్ణాగౌడ్, 19 డివిజన్ల కార్పొరేటర్ ఎ.రాజశేఖర్ అన్నారు. ఆదివారం రేకుర్తిలో శాలివాహన కుమ్మరి సంఘం సమావేశం నిర్వహించగా వారు ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. సంఘం కార్యకలాపాల కోసం స్థల కేటాయింపు, భవన నిర్మాణానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం సంఘం నాయకులు వారిని సత్కరించారు. కార్యక్రమంలో గట్టయ్య, ఐలయ్య, రవీందర్, తిరుపతి, కమలాకర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.




పక్కా కుట్రతోనే స్కిల్ దోపిడీ

కుట్రదారు చంద్రబాబే.. డబ్బు చేరింది ఆయనకే..

బాబు ఆదేశంతోనే నిబంధనలకు విరుద్ధంగా నిధులు విడుదల • షెల్ కంపెనీలు, ఫేక్ ఇన్వాయిస్‌లతో రూ.241 కోట్లు దోపిడీ

అచ్చెన్నాయుడు సహకారం • నిధుల తరలింపులో లోకేశ్ కీలక పాత్ర • రిమాండ్ రిపోర్ట్‌లో సీఐడీ సిట్ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి



'చంద్రబాబు పక్కా కుట్రతోనే ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) ప్రాజెక్ట్ ముసుగులో ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. 2014–15లో ముఖ్యమంత్రిగా తన పదవిని దుర్వినియోగం చేస్తూ, కుట్ర పూరితంగా షెల్ కంపెనీలు సృష్టించి ఫేక్ ఇన్వాయిస్‌లు సమర్పించి రూ.371 కోట్లను అక్రమంగా తరలించారు. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ఆ కంపెనీ పేరిట రూ.3,300 కోట్ల ప్రాజెక్టును కేవలం కాగితాలపై సృష్టించడం.. ప్రాజెక్టు చేపట్టకుండానే నిబంధనలకు విరుద్ధంగా రూ.371 కోట్లు విడుదల చేయడం.. షెల్ కంపెనీల ద్వారా తరలించడం.. ఇలా అంతా చంద్రబాబు కనుసన్నల్లోనే సాగింది. ప్రజాధనం కొల్లగొట్టాలనే పక్కా పన్నాగంతో ఏపీఎస్‌ఎస్‌డీసీ ప్రాజెక్ట్ సృష్టికర్త.. ఆ కుంభకోణంతో అక్రమంగా నిధులు పొందిన లబ్ధిదారూ రెండూ చంద్రబాబే' అని సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం స్పష్టం చేసింది. ఏపీఎస్‌ఎస్‌డీసీ కుంభకోణం కేసులో అరెస్ట్ చేసిన చంద్రబాబును ఆదివారం ఉదయం విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో హాజరు పరిచారు. ఈ సందర్భంగా 29 పేజీల రిమాండ్ రిపోర్ట్‌ను సీఐడీ న్యాయస్థానంలో సమర్పించింది. అవినీతి కుంభకోణాన్ని పూర్తిగా వెలికి తీసి, దోషులను శిక్షించేందుకు సమగ్ర దర్యాప్తు సాఫీగా సాగాలంటే చంద్రబాబుకు జ్యుడిషియల్ రిమాండ్ విధించాలని కోరింది. 'గత టీడీపీ ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడుతోపాటు ఇతర నిందితులు 38 మంది సహకారంతో చంద్రబాబు ఈ కుంభకోణానికి పాల్పడ్డారు. షెల్ కంపెనీల ద్వారా నిధులు అక్రమంగా తరలించడంలో చంద్రబాబు తనయుడు నారా లోకేశ్, ఆయన సన్నిహితుడు కిలారు రాజేశ్ కీలక పాత్ర పోషించారు' అని వెల్లడించింది. రిమాండ్ రిపోర్ట్‌లో ఇంకా ఏం చెప్పిందంటే..

దోచేందుకే ప్రాజెక్ట్..

యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ పేరిట ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకే ఏపీఎస్‌ఎస్‌డీసీ ప్రాజెక్ట్‌ను చంద్రబాబు రూపొందించారు. టీడీపీ నేత ఇల్లెందుల రమేశ్ ద్వారా డిజైన్‌టెక్, ఎస్‌ఐఎస్‌డబ్ల్యూ సంస్థలు ఆయన్ను సంప్రదించాయి. దాంతో రాష్ట్ర కేబినెట్ ఆమోదం లేకుండానే ఏపీఎస్‌ఎస్‌డీసీని ఏర్పాటు చేశారు. సీమెన్స్ కంపెనీకి తెలియకుండా ఆ కంపెనీ ఇండియా హెడ్‌గా ఉన్న సుమన్‌బోస్, డిజైన్ టెక్ ఎండీ వికాస్ వినాయక్ కన్వేల్కర్ ఈ కుట్రలో భాగస్వాములయ్యారు. ఏపీఎస్‌ఎస్‌డీసీ, సీమెన్స్–డిజైన్‌టెక్ కంపెనీలు త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్నాయి. అనంతరం ఏపీఎస్‌ఎస్‌డీసీకి డైరెక్టర్‌గా తన సన్నిహిడు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీ నారాయణ, ఎండీ–సీఈవోగా గంటా సుబ్బారావును నియమించారు. ఏపీఎస్‌ఎస్‌డీసీని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఎంటర్ ప్రైజస్, ఇన్నోవేషన్ విభాగాన్ని ఏర్పాటు చేసి అప్పటి కార్మిక శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు బాధ్యతలు అప్పగించారు. ఎలాంటి సర్వే లేకుండానే కేవలం డిజైన్‌టెక్ కంపెనీ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఆధారంగా ఆ ప్రాజెక్ట్‌ను రూపొందించారు. సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ఆ కంపెనీ పేరుతో డిజైన్‌టెక్ భాగస్వామిగా ప్రాజెక్ట్‌ను ఖరారు చేశారు. రూ.3,300 కోట్లతో ప్రాజెక్ట్‌ను ఆమోదించి.. అందులో సీమెన్స్–డిజైన్‌టెక్ కంపెనీలు 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు సమకూరుస్తాయని ఒప్పందంలో పేర్కొన్నారు.

నిధులు ఇచ్చేయండని చంద్రబాబు ఆదేశం

ఒప్పందంలో చెబుతున్నట్టుగా సీమెన్స్ కంపెనీ తన వాటా 90 శాతంలో ఒక్కరూపాయి కూడా ఇవ్వకుండానే ఏపీఎస్‌ఎస్‌డీసీ వాటా 10 శాతం కింద జీఎస్టీ కలిపి డిజైన్ టెక్ కంపెనీకి రూ.371 కోట్లు చెల్లించేశారు. అందుకు అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీవీ రమేశ్, ప్రత్యేక కార్యదర్శి సునీత నోట్ ఫైళ్లపై లిఖితపూర్వకంగా అభ్యంతరం వ్యక్తం చేసినా ఆయన పట్టించుకోలేదు. చంద్రబాబు ఆదేశాలతోనే సీమెన్స్ కంపెనీకి రూ.371 కోట్లు విడుదల చేస్తున్నట్టు ఆర్థిక శాఖ అధికారులు ఆ నోట్‌ఫైళ్లలో స్పష్టం చేస్తూ ఆ నిధులు విడుదల చేశారు.

లోకేశ్‌దీ కీలక పాత్ర

షెల్ కంపెనీల ద్వారా నిధులు ముంబయి నుంచి హైదరాబాద్‌కు.. అక్కడి నుంచి చంద్రబాబు నివాసానికి చేర్చడంలో ఆయన తనయుడు నారా లోకేశ్ కీలక పాత్ర పోషించారు. లోకేశ్ తన సన్నిహితుడు కిలారు రాజేశ్ ద్వారా ఆ నిధుల తరలింపు ప్రక్రియను పర్యవేక్షించారు.

ఫైళ్లు మాయం

టీడీపీ హయాంలోనే 2018లో కేంద్ర జీఎస్టీ అధికారులు ఏపీఎస్‌ఎస్‌డీసీ కుంభకోణాన్ని గుర్తించారు. పుణెలోని పలు షెల్ కంపెనీల్లో సోదాలు చేసి భారీగా నకిలీ ఇన్‌వాయిస్‌లను జప్తు చేశారు. వాటిలో ఏపీఎస్‌ఎస్‌డీసీకి సరఫరా చేసిన నకిలీ ఇన్వాయిస్‌లను గుర్తించడంతో ఏపీ ఏసీబీ అధికారులకు సమాచారమిచ్చారు. అయితే దీనిపై విచారణ చేయకుండా ఏసీబీని చంద్రబాబు అడ్డుకున్నారు. ఆ వెంటనే ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆఫీసులో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫైళ్లను మాయం చేశారు.

నిధులు కొల్లగొట్టేందుకు గ్రీన్ చానల్

ఆ ప్రాజెక్ట్ నిధులను షెల్ కంపెనీల ద్వారా కొల్లగొట్టేందుకు చంద్రబాబు ప్రత్యేకంగా గ్రీన్ చానల్‌ను ఏర్పాటు చేసుకున్నారు. విద్యా శాఖతో నిమిత్తం లేకుండా ఏపీఎస్‌ఎస్‌డీసీ నుంచి నేరుగా ఎంటర్‌ప్రైజస్– ఇన్నోవేషన్ డిపార్ట్‌మెంట్ అక్కడ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫైళ్లు పంపాలని ఆదేశించారు. ఆ మేరకు డిజైన్ టెక్ కంపెనీకి విడుదల చేసిన రూ.371 కోట్లలో రూ.279 కోట్లను యోగేశ్ గుప్తా మన దేశంతోపాటు సింగపూర్, దుబాయ్‌లలోని షెల్ కంపెనీలకు తరలించారు. అనంతరం షెల్ కంపెనీల కమీషన్లు మినహాయించుకుని హవాలా మార్గంలో, బ్యాంకు నుంచి డ్రా చేసి మొత్తం రూ.241 కోట్లను షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసానికి ముంబయిలో అందించారు. ఆ నగదును మనోజ్ పార్థసాని చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు హైదరాబాద్‌లో ముట్టజెప్పారు. ఆయన ఆ రూ.241 కోట్లు చంద్రబాబు బంగ్లాకు చేర్చారు.

కస్టడీలో విచారించాల్సిన అవసరం ఉంది

ఏపీఎస్‌ఎస్‌డీసీ కుంభకోణం మాస్టర్ మైండ్ చంద్రబాబుకు అత్యున్నత స్థాయిలో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఇప్పటికే సిట్ విచారణ కోసం నోటీసులు జారీ చేసిన యోగేశ్ గుప్తా, మనోజ్ పార్థసాని విదేశాలకు పరారయ్యారు. మిగిలిన సాక్షులను కూడా చంద్రబాబు బెదిరించి దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి ఆయన్ను అరెస్టు చేశాం. ఆయన బయట ఉంటే కేసు దర్యాప్తు పక్కదారి పట్టే అవకాశాలున్నాయి. అందువల్ల ఆయనకు జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. ఈ కేసును సమగ్రంగా విచారించేందుకు చంద్రబాబును కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉంది.

బాబు రిమాండ్‌పై హోరెత్తిన సోషల్ మీడియా

- ఎన్టీఆర్ ఆత్మ శాంతించిందన్న ఆయన అభిమానులు
- అప్పట్లో 73 ఏళ్ల వయస్సులో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు..
- ఇప్పుడు అదే వయసులో బాబు జైలుపాలు
- ఎన్నో కన్నీళ్ల ఉసురిది అంటూ పోస్టుల వెల్లువ

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఏసీబీ కోర్టు చంద్రబాబుకు రిమాండ్ విధించడంతో మాజీ సీఎం నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు హోరెత్తించారు. ఎన్టీఆర్ ఆత్మశాంతించిందంటూ తెగ పోస్టులు పెట్టారు. వెన్నుపోటు పొడిచి సీఎం పదవిని, టీడీపీని చంద్రబాబు లాక్కొని ఎన్టీఆర్ మరణానికి కారణమయ్యారని గుర్తుచేస్తున్నారు. ఎన్టీఆర్‌కు కరెక్ట్‌గా 73 ఏళ్ల వయసులో బాబు వెన్నుపోటు పొడవగా... ఇప్పుడు అదే 73 ఏళ్ల వయస్సులో బాబు జైలు పాలయ్యాడన్నారు. ఖర్మ ఫలితం అంటే ఇదేనని ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ట్విట్టర్‌లలో పోస్టులు పెట్టారు. ''ఈ చోటి కర్మ ఈ చోటే ఈనాటి కర్మ మరునాడే అనుభవించి తీరాలంటే ఈ సృష్టి నియమం ఇదే.. ఎన్ని కన్నీళ్ల ఉసురిది.. వెంటాడుతోంది..'' అనే పాట బ్యాక్‌గ్రౌండ్‌తో 1995 బాబు వెన్నుపోటు ఘటన నాటి వైశ్రాయి హోటల్ ముందు ఎన్టీఆర్ వీడియోలు, ఫొటోల పోస్టింగ్స్‌తో అభిమానులు హర్షాతిరేఖాలు వ్యక్తంచేశారు. గోదావరి పుష్కరాల సమయంలో తన ప్రచారం కోసం 30 మంది ప్రాణాలను బలిగొన్నాడని.. అప్పుడు చేసిన పాపాలకు ప్రతిఫలం అనుభవించమని దేవుడు చంద్రబాబును రాజమండ్రి పంపిస్తున్నాడనే ప్రచారం సోషల్ మీడియాలో కొనసాగింది. వంగవీటి రంగా, కారంచేడు మారణహోమంలో బలైన దళితులు, బషీర్‌బాగ్ కాల్పుల్లో చనిపోయిన అమాయకుల ఆత్మలు సైతం శాంతించాయని మరికొందరు తమ పోస్టుల ద్వారా సంతోషం వ్యక్తంచేశారు. అలాగే, చంద్రబాబుకు 14 రోజుల పాటు రిమాండ్ విధించడంపై.. తన అల్లుడికి తగిన బుద్ధి చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను సీనియర్ ఎన్టీఆర్ ఆశీర్వదిస్తున్నట్లు కార్టూన్లు, మీమ్‌లను నెటిజన్లు అత్యధికంగా షేర్ చేస్తున్నారు.

రెండోరోజూ ట్విట్టర్‌లో ట్రెండింగ్

ఇక వరుసగా రెండోరోజూ ట్విట్టర్‌లో చంద్రబాబు అరెస్టు ట్వీట్లు ట్రెండింగ్‌గా నిలిచాయి. చంద్రబాబు అరెస్టు, స్కాంస్టర్ చంద్రబాబు, చంద్రబాబు నాయుడు, స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం వంటి హ్యాష్ ట్యాగ్‌లైన్లు భారీగా ట్రెండింగ్ అయ్యాయి. ఇండియా–పాకిస్థాన్ మ్యాచ్ కంటే బాబు అరెస్టు వార్తలే టాప్ ట్రెండింగ్‌లో నిలిచాయి.

బాబు భ్రమలు తొలగిపోయాయి

- ఆయనపై ఇంకా 6–7 ట్రయిలబుల్ కేసులున్నాయి
- స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో పదేళ్ల జైలుశిక్ష పడే ఛాన్స్
- అన్ని కేసులు నిరూపితమైతే జీవితాంతం జైలులోనే
- చంద్రబాబు ప్రజావ్యతిరేక కార్యక్రమాలన్నింటిపైనా విచారణ
- రామోజీ అక్రమాలపైనా చట్టపరిధిలోనే ధర్మాన్ని నెరవేరుస్తాం
- ఎంపీ, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి



ఒంగోలు: చట్టం నుంచి ఎలాగైనా తప్పించుకోవచ్చన్న చంద్రబాబు భ్రమలు నేటితో తొలగిపోయాయని ఎంపీ, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి అన్నారు. చంద్రబాబుకు ఏసీబీ కోర్టు ఆదివారం రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు వెలువడిన అనంతరం ఆయన ఒంగోలులో మీడియాతో మాట్లాడారు. తాను ఎన్ని అక్రమాలు చేసినా, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు, అధికార దుర్వినియోగానికి పాల్పడినా చట్టం నుంచి తప్పించుకోవచ్చని, స్టేలు తెచ్చుకుని శిక్ష నుంచి తప్పించుకోవచ్చని చంద్రబాబు ఇన్నాళ్లూ భావిస్తూ వచ్చారన్నారు. కానీ నేటితో ఆ భ్రమలు వీడిపోయాయన్నారు. విజయసాయిరెడ్డి ఇంకా ఏమన్నారంటే..

చట్టానికి ఎవరూ అతీతులు కారు. ఎవరైనా చట్టానికి లోబడే వ్యవహరించాల్సి ఉంటుంది. రాజ్యాంగబద్ధంగా రాజ్యాంగ పరిధిలోనే పాలన సాగించాల్సి ఉంటుందని కోర్టు తీర్పుతో నేడు మరోమారు నిరూపితమైంది. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకు పదేళ్ల జైలుశిక్ష పడే అవకాశముంది. ఆయనపై ఇంకా 6 లేదా 7 ట్రయిలబుల్ (ప్రాసిక్యూషన్) కేసులు ఉన్నాయి. రాష్ట్ర ఖజానాకు సంబంధించిన సంపదను దోచుకుని, విదేశాలకు ఎలా తరలించారన్న దానిపై విచారించి తిరిగి ఖజానాకు జమచేసేలా సీఎం జగన్ చర్యలు చేపడతారు. నిజానికి.. బాబు అవినీతికి సంబంధించిన అన్ని కేసుల్లో శిక్షపడితే జీవితాంతం జైల్లోనే ఉండే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌తోపాటు తదుపరి పోలీసు కస్టడీకి తీసుకుని విచారించడం ద్వారా ఇంకా అనేక అంశాలు బహిర్గతమవుతాయి.

రామోజీ అకృత్యాలు చాలానే..

ఇక రామోజీరావు దారుణాలు, అకృత్యాలు కూడా చాలానే ఉన్నాయి. ఆయన సుప్రీంకోర్టు వరకు వెళ్లి కొన్నింటిలో తప్పించుకున్నారు. కానీ, అన్నింటిని చట్టపరిధిలోనే ధర్మాన్ని నెరవేరుస్తాం. ఉన్నత పదవుల్లో ఉన్నవారు రాష్ట్ర సంపదను దోచుకుని అవినీతికి పాల్పడినప్పుడు కేసు నమోదుచేస్తే అది రాజకీయ కక్ష అవుతుందా? నిజంగా రాజకీయ కక్షే అయితే ఆదివారం ఏసీబీ కోర్టులో చంద్రబాబుకు అనుకూలంగా తీర్పువచ్చేది. ఒకసారి ఎఫ్‌ఐఆర్ నమోదై, అరెస్టయితే మిగిలిన వ్యవహారమంతా కోర్టు పరిధిలోకి వెళ్తుంది. న్యాయస్థానం ఇచ్చే తీర్పు ప్రకారమే అందరూ నడుచుకోవాల్సి ఉంటుంది.

బాబు అవినీతి అనకొండ

- నిజాల నిరూపణతో వెలుగులోకి స్కిల్ కుంభకోణం
- పవన్‌కళ్యాణ్ ఇప్పుడేమంటారో?
- ఎన్టీఆర్ ఆత్మక్షోభకు చంద్రబాబు ఫలితం అనుభవిస్తున్నారు
- 'సాక్షి'తో హోంమంత్రి తానేటి వనిత



కొవ్వూరు: చంద్రబాబు ఒక అవినీతి అనకొండ అని, ఆయన పాలనంతా అవినీతిమయమని.. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సూత్రధారిగా ఉండి రూ.371 కోట్లు స్వాహా చేశారని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత విమర్శించారు. ఆయన పాలనలో చోటుచేసుకున్న కుంభకోణాలు ఒక్కొక్కటిగా నిరూపణ అవుతుండడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. చంద్రబాబును అరెస్టుచేయడం ఏదో నేరమన్నట్లు రాద్ధాంతం చేసిన ప్యాకేజీ స్టార్ పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ఆమె ప్రశ్నించారు. ఆదివారం ఆమె 'సాక్షి'తో పలు అంశాలపై మాట్లాడారు. ఆమె ఏమన్నారంటే...

చంద్రబాబు అవినీతికి పాల్పడినట్లు స్పష్టమైన ఆధారాలున్నప్పటికీ.. వాస్తవాలను దాచిపెట్టి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాన్ని పవన్ మానుకోవాలి. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకోవాలి. లేకుంటే ప్రజలే ఛీదరించుకునే పరిస్థితి ఉంటుంది. చంద్రబాబు అరెస్టును తప్పుపట్టిన పవన్ రోడ్డుపై పడుకుని ఓవర్‌యాక్షన్ చేశారు. ఇక చంద్రబాబు ఒకరితో ఒప్పందం చేసుకుని మరో సంస్థకు నిధులు మళ్లించారు. 2014–19 మధ్య ఒక్క స్కిల్ స్కాంలోనే ఇంత దోపిడీకి పాల్పడగా, అమరావతి రాజధాని పేరుతో రూ.వేల కోట్ల దోపిడీకి తెగబడ్డారు. కేవలం ఐదేళ్లలోనే ఇంత అవినీతికి పాల్పడిన చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా పని చేసిన కాలంలో ఇంకెంత అవినీతికి పాల్పడి ఉంటారో అర్థంచేసుకోవచ్చు. చంద్రబాబు అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలి.

వారంతా ఇప్పుడేం సమాధానం చెబుతారు?

ఇక నోటీసు ఇవ్వకుండా అరెస్టుచేశారని ఒకసారి, గవర్నర్‌కు సమాచారం లేకుండా అరెస్టు చేశారని మరోసారి, ప్రభుత్వ కక్ష సాధింపులో భాగంగా అరెస్టు చేశారని ఇంకోసారి రకరకాల డ్రామాలాడిన టీడీపీ నేతలు, చంద్రబాబు కుటుంబ సభ్యులు ఇప్పుడేం సమాధానం చెబుతారు? దొంగే దొంగా దొంగా అన్నట్లుగా చంద్రబాబు ఇన్నాళ్లూ తన అవినీతి సామ్రాజ్యాన్ని నడిపారు. ఇప్పుడు ఆధారాలతో సహా దొరికిపోయేసరికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కక్ష సాధింపు అంటూ ప్రజలను నమ్మించేందుకు లోకేశ్, ఆయన కుటుంబ సభ్యులు తాపత్రయపడుతున్నారు. అవినీతికి పాల్పడిన నేరారోపణపై చంద్రబాబు జైలుకు వెళ్తుంటే దానిని కూడా రాజకీయ లబ్ధికోసం వినియోగించుకోవడానికి టీడీపీ పాకులాడుతోంది. ఆధారాలతో అడ్డంగా దొరికిపోయినా దత్తపుత్రుడు మాత్రం తన ప్యాకేజీ సొమ్ము కోసం చంద్రబాబును సమర్థిస్తున్నాడు. ఎన్టీఆర్‌ను మానసిక క్షోభకు గురిచేసి, ఆయన ఆత్మక్షోభకు కారకుడైన చంద్రబాబు ఇన్నాళ్లకు ఫలితం అనుభవిస్తున్నాడు. ఇన్నాళ్లూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నీచ పదజాలంతో దూషించిన టీడీపీ నాయకులు ఇప్పుడు చంద్రబాబు అవినీతిపై ఏ సమాధానం చెబుతారు?

చంద్రబాబుకు రిమాండ్ ప్రజా విజయం

- స్కాంలో అరెస్టయిన వ్యక్తిని పవన్ ఎందుకు వెనకేసుకొస్తున్నాడు?
- మంత్రి గుడివాడ అమరనాథ్



సాక్షి, అమరావతి: స్కిల్ కుంభకోణంలో కర్త కర్మ క్రియ అన్నీ చంద్రబాబే అని కోర్టు నమ్మింది కాబట్టే రూ.కోట్లు కుమ్మరించి ఢిల్లీ నుంచి సిద్ధార్థ లూథ్రాతో పాటు 15 మంది లాయర్లను తెచ్చుకున్నా రిమాండ్ విధించిందని, ఇది ప్రజా విజయమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ వ్యాఖ్యానించారు. 40 ఏళ్లుగా ఆయన వ్యవస్థలను మేనేజ్ చేస్తూ తప్పించుకుంటూ వస్తున్నాడన్నారు. ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో అమరనాథ్ మీడియాతో మాట్లాడుతూ స్కిల్ కుంభకోణం ఒక తీగమాత్రమేనని, త్వరలోనే మిగిలిన కుంభకోణాలు కూడా బయటకు వస్తాయన్నారు. చంద్రబాబు ఎక్కడా తాను తప్పు చేయలేదని చెప్పడంలేదని.. ఆ సెక్షన్ వర్తించదు, గవర్నర్‌కు ముందు చెప్పలేదు అంటూ కుంటిసాకులు మాత్రమే చెబుతున్నారని విమర్శించారు. ఇతర పార్టీల్లోకి, వ్యవస్థలోకి తన మనుషులను స్లీపర్ సెల్స్‌లా పంపి రాజకీయం చేయడం బాబు నైజమని... అందుకే దత్తపుత్రుడు, పురందేశ్వరి, నారాయణ, రామకృష్ణలు స్కాంలో అరెస్టయిన వ్యక్తికి వత్తాసు పలుకుతున్నారన్నారు. సొంతకొడుకు లోకేశ్ కంటే దత్తపుత్రుడు ఎక్కువ వేషాలు వేశాడని, ఈ కుంభకోణంలో పవన్‌కళ్యాణ్ వాటా ఎంతో చెప్పాలన్నారు. స్కామ్‌లో అరెస్ట్ అయిన వ్యక్తికి పవన్ ఎలా మద్దతు ఇస్తారని ప్రశ్నించారు.

బంద్‌కు పిలుపు ఇచ్చిన టీడీపీ

- మద్దతు పలికిన జనసేన
- బంద్‌కు బీజేపీ దూరం

సాక్షి, అమరావతి: చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ సోమవారం బంద్‌కు పిలుపు ఇచ్చింది. 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన చంద్రబాబు అరెస్ట్, పార్టీ శ్రేణులపై దమనకాండ, సీఎం వైఎస్ జగన్ కక్షపూరిత రాజకీయాలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా బంద్ చేపట్టాలని నిర్ణయించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొనాలని కోరారు.

జనసేన సంఘీభావం

ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా సోమవారం తెలుగుదేశం పార్టీ నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు జనసేన పార్టీ సంఘీభావం ప్రకటిస్తోందని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా జరిగిన ఈ అరెస్ట్‌ను జనసేన పార్టీ ఇప్పటికే ఖండించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలను నిర్వీర్యం చేసి ప్రజాకంటక చర్యలకు పాలకపక్షం ఒడిగడుతోందని పేర్కొన్నారు. ప్రజాపక్షం వహిస్తూ మాట్లాడే ప్రతిపక్షాలపై వైఎస్సార్‌సీపీ రాజకీయ కక్ష సాధింపుతో కేసులు, అరెస్ట్‌లతో వేధింపులకు పాల్పడుతోందని పేర్కొన్నారు. ఈ అప్రజాస్వామిక చర్యలను జనసేన ఎప్పుడూ నిరసిస్తుందని పేర్కొన్నారు. జరగబోయే బంద్‌లో జనసేన శ్రేణులు శాంతియుతంగా పాల్గొనవలసిందిగా కోరుతున్నట్టు పేర్కొన్నారు.

బీజేపీ మద్దతు ఇవ్వలేదు

తెలుగుదేశం పార్టీ సోమవారం నిర్వహించ తలపెట్టిన బంద్‌కు బీజేపీ దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. ఈ అంశంపై రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం రాత్రి మీడియాకు ఒక ప్రకటన విడుదల చేస్తూ.. తెలుగుదేశం పార్టీ ఇచ్చిన బంద్ పిలుపునకు బీజేపీ తరఫున తాను మద్దతు ఇచ్చినట్టుగా నకిలీ లేఖ వాట్సాప్ గ్రూపులలో సర్క్యులేట్ అవుతోందన్నారు. ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

ఆర్థిక నేరం చేసి దబాయిస్తావా?

చంద్రబాబుపై మండిపడ్డ సజ్జల

- ఏసీబీ కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం
- చంద్రబాబు పాల్పడిన అన్ని కుంభకోణాలపై విచారణ చేస్తాం
- సొంత పుత్రుడి కంటే దత్తపుత్రుడే ఎక్కువగా వీరంగం వేశాడు
- మనమంతా ప్రభుత్వ ఆస్తులకు ధర్మకర్తలం.. జవాబుదారీగా ఉండాలన్నదే సీఎం జగన్ విధానం

సాక్షి, అమరావతి: ఆర్థిక నేరాలకు పాల్పడినందుకు సిగ్గుతో తల దించుకోవాల్సిందిపోయి తాను ఏ తప్పూ చేయలేదంటూ దబాయించడం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆయన గ్యాంగ్‌కే చెల్లిందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో చంద్రబాబుకు రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తీవ్ర ఆర్థిక నేరాలకు పాల్పడిన చంద్రబాబుకు న్యాయస్థానాలు తగిన శిక్షలు విధించడం ఖాయమన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ స్కిల్ స్కామ్‌కు రూపకర్త, నిర్మాత, దర్శకత్వం, విలన్ అన్నీ చంద్రబాబేననే బలమైన సాక్ష్యాధారాలతోనే సీఐడీ పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారని చెప్పారు. చంద్రబాబు గ్యాంగ్ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. చంద్రబాబు కుమారుడు లోకేశ్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, మిగిలిన చెత్త చెదారం వ్యవహరించిన తీరును రాష్ట్రం మొత్తం గమనించిందన్నారు. స్కిల్ స్కామ్‌లో ఏసీబీ కోర్టు చంద్రబాబును రిమాండ్‌కు పంపడం పెద్ద విషయంగా తాము అనుకోవడం లేదన్నారు. చంద్రబాబుపై బలమైన ఆధారాలున్నాయి కాబట్టి ఆయన పాల్పడిన ఆర్థికనేరం తప్పకుండా రుజువు అవుతుందన్నారు. మీడియాతో మాట్లాడుతూ సజ్జల రామకృష్ణారెడ్డి ఇంకా ఏమన్నారంటే..

ఖజానా లూటీకే స్కిల్ స్కీం..

చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్టు చేసినప్పటి నుంచి టీడీపీ నేతలు, ఆయన కుటుంబ సభ్యులు ప్రపంచంలో జరగరాని ఘోరం జరిగినట్లు వ్యవహరించారు. దేశంలో చాలా కేసుల్లో మాజీ సీఎంలను అరెస్టు చేసినా ఎవరూ ఇలా బరితెగించి వ్యవహరించలేదు. ప్రభుత్వ ఖజానాను లూటీ చేయడం కోసమే ఒక స్కీంను పెట్టిన చంద్రబాబు లేని కంపెనీని తీసుకొచ్చి, ఒక కంపెనీ పేరును దొంగతనంగా వాడుకుని నేరం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను పెట్టి ఒక బయటి వ్యక్తిని తెచ్చి నాలుగు డిపార్ట్‌మెంట్లకు సెక్రటరీగా నియమించారు. దానికో శాఖను సృష్టించి చంద్రబాబే నేరుగా నిర్వహించారు. యువతలో నైపుణ్యాలను పెంచేలా శిక్షణ ఇచ్చే స్కిల్ స్కీంలో 90 శాతం ప్రైవేట్ కంపెనీ గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఇస్తే 10 శాతం ప్రభుత్వం ఇస్తుందంటూ ఉత్తర్వులు జారీచేశారు. సీమెన్స్ కంపెనీకి తెలియకుండా తాను సృష్టించిన డొల్ల కంపెనీకి రూ.371 కోట్లు ఇచ్చేశారు. ఆ సొమ్మును నేరుగా బయటకు పంపించి అక్కడి నుంచి షెల్ కంపెనీలకు పంపి, అక్కడి నుంచి తన ఇంటికి చంద్రబాబు తెచ్చుకున్నారు. ఈ కుంభకోణం అంతా చంద్రబాబుకు తెలుసు. ఎందుకంటే ఆ శాఖను నిర్వహిస్తున్నది ఆయనే. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేరుగా ముఖ్యమంత్రి చెప్పారు కాబట్టి చెల్లించాలని చెప్పారు. రూ.371 కోట్లు కొట్టేయాలని ఇంత గ్రాండ్‌గా ప్లాన్ చేశారు.

దత్తపుత్రుడి వీరంగమే ఎక్కువ..

చంద్రబాబు అరెస్టుపై సొంతపుత్రుడు లోకేశ్ కంటే దత్తపుత్రుడు పవన్ వీరంగం వేశాడు. రోడ్డుపై విలాసంగా కాలు మీద కాలు వేసుకుని పడుకున్నాడు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని తాలిబన్లు, చెడ్డీ గ్యాంగ్ అంటూ దూషిస్తూ ఈనాడులో బూతులన్నీ రామోజీరావు రాశాడు. ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ కూడా అదే రీతిలో రోత రాతలు రాశాడు.

నిజాయితీని ఆశించే వారంతా సంతోషిస్తారు..

తప్పులు జరగకూడదు.. పారదర్శకత ఉండాలి.. అవినీతిని తుదముట్టించాలనుకునే ప్రతి ఒక్కరూ చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌తో సంతోషపడతారు. తప్పు చేసినప్పుడు ముఖానికి గుడ్డ కప్పుకుని వెళ్లాల్సిన చంద్రబాబు రొమ్ము విరుచుకుని తిరుగుతున్న తీరు చూసిన ప్రజలు ఛీత్కరిస్తున్నారు. ఇది మా విజయంగా భావించడం లేదు. ప్రజాధనానికి మనం ధర్మకర్తలమే. మనం ప్రజలకు జవాబుదారీ అనేలా ఉండాలనేది సీఎం జగన్ విధానం. దానికి పూర్తిగా వ్యతిరేకమైన వ్యక్తి చంద్రబాబు. స్కిల్ స్కాంపై కోర్టులో విచారణను చంద్రబాబు ఎదుర్కోవాలి. కోర్టు నిర్ణయం తీసుకుంటుంది. చంద్రబాబు తప్పు చేశారు.. అది బయటకు రావాలి.. భవిష్యత్తులో మరొకరు అలా చేయకూడదన్నదే సీఎం జగన్ విధానం. అమరావతి భూ కుంభకోణం, అసైన్డు భూ కుంభకోణం, ఫైబర్ గ్రిడ్ స్కాం, సాగునీటి ప్రాజెక్టుల్లో అక్రమాలు.. ఇలా చంద్రబాబు పాల్పడిన అవినీతిపై విచారణ జరుపుతాం. స్కిల్ స్కామ్‌తో సహా అన్ని కుంభకోణాలను ఎన్నికల్లో ప్రజలకు వివరిస్తాం. రాష్ట్రం ఇప్పుడిప్పుడే వెలుగుల్లోకి వస్తోందని.. చంద్రబాబు వస్తే మళ్లీ చీకట్లోకి వెళ్లడం ఖాయమని ప్రజలను చైతన్యపరుస్తాం.

బాబు జీవితమంతా అవినీతిమయమే..

చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ జీవితంలో కుంభకోణాలు తప్ప ఏమైనా ఉన్నాయా? అవినీతి తప్ప సక్రమ మార్గంలో పది అడుగులైనా వేశాడా? కేవలం స్టేల ద్వారా, వ్యవస్థలను మేనేజ్ చేయడం ద్వారానే చంద్రబాబు రాజకీయంగా నిలబడుతున్నాడు. అలా బతుకుతూ బీరాలు పలుకుతూ తొడలు గొడుతూ చాలెంజ్ చేస్తున్నాడు. 40 ఏళ్ల జీవితంలో మచ్చలేని వాడినని, నన్ను ఎవరేం పీక్కుంటారని చంద్రబాబు అంటాడు. ఆర్థిక నేరానికి పాల్పడిన చంద్రబాబును సాక్ష్యాధారాలతో అరెస్టు చేస్తే తానేం తప్పు చేయలేదంటూ దబాయిస్తున్నాడు.

పబ్లిసిటీ డ్రామాలు..

నంద్యాలలో శనివారం సీఐడీ పోలీసులు అరెస్టు చేసినప్పటి నుంచి చంద్రబాబు పబ్లిసిటీ కోసం డ్రామాలాడారు. వయసులో వృద్ధుడు, మాజీ సీఎం అని గౌరవంగా హెలికాప్టర్ ఏర్పాటు చేశాం. అందులో విజయవాడ తీసుకెళ్తామని చెప్పిన సీఐడీ పోలీసులపై చంద్రబాబు రంకెలు వేశాడు. డీఐజీతో ఎదురుగా కూర్చుని ఒక కెమెరా పెట్టించుకుని దబాయించాడు. ఆ అధికారి గట్టిగా నిలబడ్డాడు కాబట్టి సరిపోయింది. ఒక పోలీసు అధికారిని లోకేశ్ బూతులు తిట్టాడు. పోలీసులు ఏమైనా జీతగాళ్లు, పాలేర్లు అని అనుకుంటున్నారా చంద్రబాబు, లోకేశ్? హెలికాప్టర్‌లో మర్యాదగా వస్తే ఉదయం 11 గంటలకు దిగేవాడు. పబ్లిసిటీ కోసం డ్రామా చేశాడు. వారి పబ్లిసిటీ స్టంట్ ఆదివారం అచ్చెన్నాయుడు మాటల్లోనే తేలింది. చంద్రబాబు కోసం జనం ఎందుకు రావాలి? అవినీతి చేసి కోర్టుకు వెళ్తుంటే అల్లర్లు చేయాలా? వాళ్లు చేసిన హడావుడి వల్ల రాత్రి వేళ చంద్రబాబును సీఐడీ కార్యాలయానికి తెచ్చారు. దీనికీ సీఎం జగన్‌పై విమర్శలు చేస్తున్నారు.

స్పెషల్ ఫ్లైట్‌లో లాయర్ దేనికి?

చంద్రబాబు ఏ తప్పూ చేయనప్పుడు ఢిల్లీ నుంచి స్పెషల్ ఫ్లైట్‌లో లాయర్‌ను రప్పించడం దేనికి? రోజు రూ.కోటి, కోటిన్నర ఫీజుగా చెల్లించడం దేనికి? సీఎం జగన్ స్పెషల్ ఫ్లైట్‌లో విదేశాలకు వెళ్లారని ఈనాడులో వార్తలు రాశారు. చంద్రబాబును పరామర్శించేందుకు బాలకృష్ణ ఒక స్పెషల్ ఫ్లైట్, లాయర్ ఒక స్పెషల్ ఫ్లైట్‌లో వస్తే ఎందుకు రాయలేదు?.



అత్యంత గౌరవంగా

చంద్రబాబుతో సిట్ అధికారులు వ్యవహరించిన తీరు ఇది

- ఆయన కోరినట్లే నంద్యాల నుంచి రోడ్డు మార్గంలో తరలింపు
- కుటుంబ సభ్యులతో భేటీకి అవకాశం
- న్యాయవాదులతో సంప్రదింపులకు అనుమతి
- న్యాయవాది సమక్షంలోనే విచారణ
- అడిగిన ఆహారం, మందులు అందించిన అధికారులు

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో అరెస్ట్ అయిన మాజీ సీఎం చంద్రబాబు పట్ల సీఐడీ సిట్ విభాగం అధికారులు ఆద్యంతం అత్యంత గౌరవంగా వ్యవహరించారు. నంద్యాలలో శనివారం ఉదయం 6 గంటలకు అరెస్టు చేసినప్పటి నుంచి ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత జ్యుడీషియల్ రిమాండ్ కోసం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించేంతవరకు చంద్రబాబుకు వ్యక్తిగతంగా ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా చూసుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నేతగా ఉన్న 73 ఏళ్ల చంద్రబాబు పట్ల సిట్ అధికారులు అత్యంత మర్యాద పూర్వకంగా వ్యవహరించారు.

నిద్ర లేచేవరకు నిరీక్షించి..

ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలో ప్రధాన దోషి అయిన చంద్రబాబును అరెస్ట్ చేసేందుకు సిట్ ఇన్‌చార్జ్ కె.రఘురామిరెడ్డి నేతృత్వంలో అధికారుల బృందం శనివారం తెల్లవారు జామున 3 గంటలకు నంద్యాల చేరుకుంది. ఆయన బస చేస్తున్న ఆర్కే ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న టీడీపీ నేతలకు సమాచారమిచ్చింది. ఆందోళన వ్యక్తం చేసిన వారికి సిట్ అధికారులు దర్యాప్తు అంశాలను వివరించి సర్ది చెప్పారు. అప్పటికి ప్రత్యేక వాహనంలో నిద్రిస్తున్న చంద్రబాబుకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా ఆయన నిద్ర లేచే వరకు వేచి చూశారు. ఉదయం 5.30 గంటలకు చంద్రబాబు నిద్ర లేచి వాహనం నుంచి బయటకు వచ్చారు. సిట్ అధికారులు ఆయన్ని కలిసి కేసు గురించి వివరించారు. ఈ కేసులో అరెస్ట్ చేసేందుకు వచ్చామని తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలో తన ప్రమేయం లేదని, తనను ఎందుకు అరెస్ట్ చేస్తారని చంద్రబాబు ప్రశ్నించారు. తమ దర్యాప్తులో వెల్లడైన అంశాలను వివరించి అరెస్ట్‌కు సహకరించాలని ఆయన్ను అధికారులు కోరారు. సంబంధిత పత్రాలపై సంతకం తీసుకున్నారు. అనంతరం 6 గంటలకు అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. చంద్రబాబుకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్య లేదని నిర్ధారించుకున్న తరువాతే విజయవాడకు తరలించాలని నిర్ణయించారు.



కుటుంబ సభ్యులతో గదిలో భేటీ

శనివారం రాత్రి 7.50 గంటలకు చంద్రబాబు భార్య భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి, బావమరిది బాలకృష్ణ సిట్ కార్యాలయానికి చేరుకున్నారు. చంద్రబాబును కలిసేందుకు అనుమతించాలన్న వారి విజ్ఞప్తిని అధికారులు ఆమోదించారు. ఆయన తన కుటుంబ సభ్యులతో ఓ గదిలో ప్రత్యేకంగా మాట్లాడుకునేందుకు అవకాశం కల్పించారు. రాత్రి 8 నుంచి 8.30 గంటల వరకు కుటుంబ సభ్యులతో చంద్రబాబు మాట్లాడారు. చంద్రబాబును సంప్రదించి ఆయన అడిగిన ఆహారాన్ని అందించారు. అనంతరం తన న్యాయవాదులతో కూడా విడిగా కేసు విషయాలపై బాబు చర్చించారు.

నిద్రించేందుకు ప్రత్యేక గది

అనంతరం రాత్రి 9 నుంచి 11 గంటల వరకు చంద్రబాబును మరోసారి విచారించారు. చంద్రబాబు కోరిన మందులను తెప్పించి ఇచ్చారు. సిట్ కార్యాలయంలో ఆయన నిద్రించేందుకు ప్రత్యేక గదిలో తగిన ఏర్పాట్లు చేశారు. అరెస్ట్ చేసినప్పటి నుంచి రిమాండ్‌కు తరలించేవరకు చంద్రబాబు సహాయకుడు మాణిక్యం ఆయనతోనే ఉండేందుకు అధికారులు అనుమతించారు. తమ అదుపులో ఉన్న చంద్రబాబుకు వ్యక్తిగతంగా ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా సిట్ అధికారులు ఆద్యంతం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించారు. తమకు సరైన సౌకర్యాలు లేవనిగానీ, అధికారులు సరిగా వ్యవహరించలేదనిగానీ చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు ఒక్క విమర్శ కూడా చేయకపోవడమే అందుకు నిదర్శనం.

పటిష్ట భద్రతతో సెంట్రల్ జైలుకు..

ఆదివారం తెల్లవారుజామున దాదాపు 4 గంటల సమయంలో చంద్రబాబును విజయవాడలోని జీజీహెచ్‌కు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉదయం 5.30 గంటల సమయంలో న్యాయస్థానానికి తరలించారు. సాయంత్రం న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీ విధించిన తరువాత చంద్రబాబును ఆయన కుటుంబ సభ్యులు కలిసేందుకు అనుమతించారు. అనంతరం పటిష్ట భద్రతతో ఆయన్ని రోడ్డు మార్గంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

బాబు పక్కనే దమ్మాలపాటి..

తాడేపల్లిలోని సిట్ కార్యాలయానికి చేరుకున్న తరువాత చంద్రబాబు కాసేపు విశ్రమించేందుకు అధికారులు అవకాశం కల్పించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు విచారణ ప్రారంభించారు. తన న్యాయవాదుల పేర్లను ఓ కాగితంపై రాసి వారిని లోపలకు అనుమతించాలని చంద్రబాబు కోరడంతో అందుకు దర్యాప్తు అధికారులు సమ్మతించారు. ఆయన చెప్పిన నలుగురు న్యాయవాదులను కార్యాలయంలోకి అనుమతించారు. వారితో చంద్రబాబు కాసేపు చర్చించారు. అనంతరం విచారణ ప్రక్రియ ప్రారంభించారు. ఆ సమయంలో కూడా చంద్రబాబు న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస రావు ఆయన పక్కనే కూర్చొనేందుకు కూడా సిట్ అధికారులు అనుమతించడం గమనార్హం. న్యాయవాది సమక్షంలోనే విచారించారు. విచారణ సందర్భంగా కూడా అధికారులు చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా వ్యవహరించారు. కేసు దర్యాప్తునకు సంబంధించి ఆయన కోరిన అన్ని పత్రాలను అందించారు. వాటిని ఆయన చదివిన తరువాతే ప్రశ్నలు సంధించారు.

ఆయన కోరినట్లుగానే..

నంద్యాల నుంచి విజయవాడకు రోడ్డు మార్గంలో ప్రయాణించడం 73 ఏళ్ల చంద్రబాబుకు ప్రయాస కలిగిస్తుందని సిట్ అధికారులు భావించారు. ఆయనకు సౌకర్యవంతంగా ఉండేందుకు హెలికాప్టర్‌ను ఏర్పాటు చేసి అదే విషయాన్ని తెలిపారు. అయితే తాను తన వాహనంలోనే రోడ్డు మార్గంలో విజయవాడకు వస్తానని చంద్రబాబు చెప్పడంతో అందుకు సిట్ అధికారులు సమ్మతించారు. నంద్యాలలో ఉదయం 8 గంటలకు బయలుదేరి సాయంత్రం 5 గంటలకు తాడేపల్లిలోని సిట్ కార్యాలయానికి చంద్రబాబును తీసుకొచ్చారు. మార్గమధ్యంలో కొన్ని చోట్ల టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయన్ని కలిసేందుకు వేచి ఉన్నారు. చంద్రబాబు కోరిక మేరకు వాహనాన్ని సిట్ అధికారులు కొద్దిసేపు నిలిపారు. టీడీపీ నేతలు, కార్యకర్తలకు చంద్రబాబు అభివాదం చేసి కాసేపు మాట్లాడారు. అందుకు సిట్ అధికారులు అభ్యంతరం చెప్పకుండా సహకరించారు. చిలకలూరిపేట వద్ద టీడీపీ నేతలు వాహన కాన్వాయ్‌ను అడ్డుకోవడంతో చంద్రబాబు చెప్పేవరకు నిలిపి ఉంచారు. ఆయన సూచించిన తరువాతే కాన్వాయ్‌ను ముందుకు పోనిచ్చారు.

నైరాశ్యంలో టీడీపీ నేతలు

చంద్రబాబు అరెస్టును పట్టించుకోని నేతలు

- బయటకు రాకుండా ముఖం చాటేస్తున్న వైనం
- సామూహిక దీక్షలకు కనిపించని స్పందన
- అవినీతి, అక్రమాలను సమర్థించుకోలేక సతమతం

సాక్షి, అమరావతి: ఇన్నాళ్లూ తమ అధినేత నిప్పులాంటి వాడని పదేపదే డప్పు కొట్టిన టీడీపీ శ్రేణులు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో చంద్రబాబు అరెస్టై జైలుకు వెళ్లడంతో తీవ్ర నిర్వేదంలో కూరుకుపోయాయి. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో పలు అవినీతి ఆరోపణలు, కేసుల నుంచి చాకచక్యంగా తప్పించుకున్న ఆయన తొలిసారి జైలుకు వెళ్లడాన్ని కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ వ్యవహారంలో రెండు రోజులుగా పలు నాటకీయాలు పరిణామాలు చోటు చేసుకుంటున్నా పార్టీ శ్రేణులు, నాయకులు బయటకు రావడానికి ఇష్టపడడంలేదు. టీడీపీ రాష్ట్ర కార్యాలయం నుంచి పదేపదే ఫోన్లు చేసి ఎక్కడికక్కడ ఆందోళనలు చేయాలని, నిరసనలకు దిగాలని సూచిస్తున్నా క్షేత్రస్థాయిలో స్పందన శూన్యం. అక్కడక్కడా ఒకటీ అరా ప్రచారం కోసమేనని స్పష్టమవుతోంది. ఆదివారం అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో సామూహిక నిరాహార దీక్షలు చేయాలని పార్టీ పిలుపు ఇచ్చినా పట్టుమని పది చోట్ల కూడా జరగలేదు. తమను పోలీసులు హౌస్ అరెస్టు చేశారని చెబుతూ నియోజకవర్గ ఇన్‌చార్జీలు బయటకు రావడంలేదు. కనీసం పది మంది అయినా బయటకు రాకపోవడంతో ఏం చేయాలో తోచక ముఖ్య నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ద్వితీయ, తృతీయ స్థాయి క్యాడర్ సైతం పట్టించుకోకపోవడంపై పార్టీలో ఆందోళన వ్యక్తమవుతోంది.

కృష్ణా, గుంటూరులో మరీ తీసికట్టు

టీడీపీకి బాగా పట్టుందని చెప్పుకునే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కనీస స్పందన లేకపోవడం పార్టీ ముఖ్య నాయకులకు ఇబ్బందికరంగా మారింది. చంద్రబాబును విచారించిన సిట్ కార్యాలయం ఉన్న తాడేపల్లి, విజయవాడ కోర్టు పరిసరాల్లో అలజడి సృష్టించడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. విజయవాడ నగర నాయకులు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, బుద్ధా వెంకన్న, కేశినేని చిన్ని, పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాలకు చెందిన బొండా ఉమా, యార్లగడ్డ వెంకట్రావు లాంటి నేతలు గృహ నిర్బంధం పేరుతో బయట కనపడకపోవడం చర్చనీయాంశమైంది. ముఖ్య నాయకులు ఫోన్లు చేసి ఏదో ఒక కార్యక్రమం చేయాలని వారిని కోరుతున్నా ఒక్కరు కూడా స్పందించలేదు. రకరకాల కారణాలు చెబుతూ ఏమీ చేయలేమని చేతులెత్తేశారు.

కళ్లెదుట పక్కా ఆధారాలు..

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణాన్ని సీఐడీ సాక్ష్యాధారాలతో వివరంగా బయట పెట్టడం, చంద్రబాబు అవినీతి చేసినట్లు స్పష్టంగా కనిపిస్తుండడం టీడీపీ యంత్రాంగానికి ఇబ్బందిగా మారింది. దీన్ని ఎలా సమర్థించుకోవాలో తెలియక నేతలు సతమతమవుతున్నారు. పక్కా ఆధారాలు కళ్ల ముందు కనిపిస్తుండడంతో అవినీతిని కొట్టి పారేయలేకపోతున్నారు. తమ నేత నిజాయితీపరుడని, దార్శనికుడని, చాణక్యుడని చెప్పుకునే వారంతా తాజా పరిణామంతో డీలా పడిపోయారు. రాజకీయాల్లో మర్రిచెట్టులా పాతుకుపోయి అన్ని వ్యవస్థలను మేనేజ్ చేయడంలో నైపుణ్యం కలిగిన తమ అధినేతను రాష్ట్ర ప్రభుత్వం జైలుకు పంపించిందనే విషయాన్ని టీడీపీ నేతలు, శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక ఏ రకంగానూ చంద్రబాబు అవినీతి సమర్థించలేమని నాయకులు మదనపడుతున్నారు. అందుకే బయటకు రావడానికి ఇష్టపడడంలేదు.

గవర్నర్ పేరుతో టీడీపీ దుష్ప్రచారం

ఎల్లో మీడియాలో వదంతులతో గందరగోళం సృష్టించేందుకు యత్నం

సాక్షి, అమరావతి: చంద్రబాబు అరెస్ట్.. రిమాండ్‌పై ఉత్కంఠ కొనసాగుతున్న తరుణంలో టీడీపీ నేతలు గవర్నర్ పేరుతో రకరకాల ప్రచారాలకు తెరలేపారు. గవర్నర్ తమకు అపాయింట్‌మెంట్ ఇచ్చారని, కలవడానికి తమ నేతలు వెళుతున్నారని ప్రకటనలు విడుదల చేశారు. శనివారం సాయంత్రం 7 గంటలకు గవర్నర్ తమ పార్టీనేతలకు అపాయింట్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. తర్వాత కొద్దిసేపటికి అపాయింట్‌మెంట్ మరునాటికి మారిందని టీడీపీ వర్గాలు మాట మార్చాయి. వాస్తవానికి శనివారం గవర్నర్ విశాఖపట్నంలో ఉన్నారు. ఆ విషయం తెలిసి కూడా టీడీపీ జనాన్ని తప్పుదోవ పట్టించేలా వ్యవహరించింది. ఆదివారం ఉదయం 9.30 గంటలకు గవర్నర్‌ను కలుస్తున్నట్లు ప్రచారం చేశాయి. కానీ.. అది కూడా జరగలేదు. మరోవైపు ఎల్లో మీడియా ఒకడుగు ముందుకు వేసి చంద్రబాబు అరెస్ట్ పట్ల గవర్నర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారని, తనకు తెలియకుండా ఎలా జరిగిందని అసంతృప్తి వ్యక్తం చేశారనే ప్రచారానికి దిగాయి. శనివారం సాయంత్రం చంద్రబాబు అరెస్ట్‌పై వివరణ ఇవ్వాలని గవర్నర్ సీఐడీ అధికారులను కోరారని, వాళ్లు ఫైళ్లు పట్టుకుని పరుగులు పెడుతున్నారని వార్తలు ప్రసారం చేశాయి. చివరకు అవన్నీ ఎల్లో మీడియా పుకార్లేనని తేలింది. కోర్టులో ఉత్కంఠ నెలకొన్న తరుణంలో కావాలని రకరకాల ప్రచారాలకు తెరలేపి ప్రజల్లో గందరగోళం సృష్టించారు.

దయచేసి రావాలి..!!

- కృష్ణా నేతలతో అచ్చెన్న ఆవేదన.. ఆడియో లీక్
- అధ్యక్షుల వారిని అరెస్ట్ చేసినా జనం రావట్లేదు... బాధగా ఉంది
- సెకండరీ లీడర్లు భయపడుతున్నారు: ఎమ్మెల్యే గద్దె

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో చంద్రబాబును అరెస్టు చేసినా పార్టీ నాయకులు, క్యాడర్ బయటకు రాకపోవడంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షాత్తూ పార్టీ అధినేత ఇబ్బందుల్లో ఉన్నా ఎక్కడా నిరసనలు చేయకపోవడం సరికాదన్నారు. ఎందుకు ఆందోళనలు చేయడం లేదని చాలామంది తనను అడుగుతున్నారని, తనకు చాలా బాధగా ఉందని, ఇప్పటికైనా జనసమీకరణ చేయాలని పార్టీ నాయకులను ప్రాధేయపడ్డారు. ఆదివారం కృష్ణా జిల్లా టీడీపీ ఇన్‌ఛార్జీలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఎలాగైనా జనాన్ని తరలించాలని అచ్చెన్నాయుడు వేడుకుంటున్న ఆడియో లీక్ అయింది. 'పార్టీ అధ్యక్షుల వారిని అరెస్టు చేశారు. ఇంతకంటే మనకు, పార్టీకి ప్రాధాన్యత అంశం ఇంకొకటి లేదు.. రాదు కూడా! నేను ఈ కాన్ఫరెన్స్ నిర్వహించటానికి కారణం... ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో చాలా తక్కువ మంది మొబిలైజేషన్ ఉంది. పోలీసులు ఆపుతున్నారని మీరు అనవచ్చు. వాళ్లు చేస్తారు. దయ ఉంచి.. ఎక్కడికక్కడ అర్బన్ నియోజకవర్గాల్లో బొండా ఉమ, గద్దె రామ్మోహన్, వన్‌టౌన్ నాయకులు, బోడె ప్రసాద్ బయటకు రావాలి. పెద్ద నాయకులను హౌస్ అరెస్టు చేస్తున్నారు గానీ సెకండ్ క్యాడర్, థర్డ్ క్యాడర్‌కు ఎక్కడా ఇబ్బంది లేదు. వెంటనే అందరూ రంగంలోకి దిగి జనసమీకరణ చేయాలి. అందులో మహిళలు ఎక్కువ మంది ఉండాలి' అని అందులో అచ్చెన్న పేర్కొన్నారు.

రాత్రి నుంచి చెబుతూనే ఉన్నా..

తాను రాత్రి 3 గంటల నుంచి జనసమీకరణ గురించి అందరికీ చెబుతూనే ఉన్నానని విజయవాడ టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నెట్టెం రఘురాం కాన్ఫరెన్స్‌లో వివరణ ఇచ్చారు. తమ నియోజకవర్గం వాళ్లను పోలీస్ స్టేషన్‌లో పెట్టారని, వాళ్లంతా చాలా చికాకుగా ఉందని ఫోన్లు చేస్తున్నారని విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వాపోయారు. మహిళల్ని ఇబ్బంది పెట్టకపోయినా... వెళ్లిపోతారా? లేదా వ్యాన్ ఎక్కించమంటారా? అని అడుగుతున్నారని చెప్పారు. సెకండరీ లీడర్లు చాలా భయపడుతున్నారని, ప్రాక్టికల్‌గా చాలా ఇబ్బందిగా ఉందన్నారు. పోలీసులు బయటకు రానివ్వడం లేదని విజయవాడ సెంట్రల్ ఇన్‌ఛార్జి బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. చాలా ఇబ్బందులున్నాయని, 20 మంది కార్యకర్తలను పంపిస్తే రాత్రి 11 గంటలకు వదిలారని మచిలీపట్నం పార్లమెంటు అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ చెప్పారు. చంద్రబాబును అరెస్టు చేసి తిప్పుతున్నా చిన్న చిన్న కారణాలు చెప్పి బయటకు రాకపోవడం బాగోలేదని టీడీపీ సీనియర్ నాయకుడు టీడీ జనార్ధన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒకటి కొంటే మరొకటి ఉచితమంటూ వస్త్ర, వస్తు తయారీ కంపెనీలు వినియోగదారులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తుంటాయి. ఇది సాధారణంగా జరిగేదే. కానీ ఎరువుల కంపెనీలు మాత్రం ఇది కొంటేనే అదిస్తామంటూ షరతులు పెడుతున్నాయి. యూరియా కావాలంటే పురుగు మందులు, జింక్, కాల్షియం వంటివి కొనాలని డీలర్లపై ఒత్తిడి తెస్తున్నాయి. దీంతో డీలర్లు రైతులపై ఇదే పద్ధతిలో ఒత్తిడి తెస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో రైతులు తమకు అవసరం లేకపోయినా యూరియాతో పాటు ఇతర ఎరువులు కొనాల్సి వస్తోంది. దీనివల్ల సాగు ఖర్చు పెరిగి రైతులు నష్టాలపాలయ్యే పరిస్థితి ఏర్పడుతోందని, ముఖ్యంగా యథేచ్ఛగా ఎరువుల వినియోగంతో ఆహార పంటలు విషతుల్యమై ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



యూరియా కావాలా?..

ఇతర ఎరువులు కొనాల్సిందే!

రైతులను దోపిడీ చేస్తున్న కంపెనీలు

- సేల్స్ మేనేజర్లకు టార్గెట్లు పెట్టి మరీ ఒత్తిడి
- టార్గెట్లు పూర్తి చేసినవారికి విందులు, వినోదాలతో ప్రోత్సాహం
- యూరియా కోసం ఇతర ఎరువులు సైతం కొంటున్న డీలర్లు
- రైతులకు యూరియాతో పాటు జింక్, కాల్షియం తదితరాలు అంటగడుతున్న వ్యాపారులు
- ఒక ఎరువుకు మరొక ఎరువుతో లింక్ పెట్టకూడదనే నిబంధనకు నీళ్లు

టార్గెట్లతో రూ.కోట్ల అక్రమార్జన

యూరియా అందుబాటులో ఉన్నా కృత్రిమ కొరత సృష్టిస్తూ కంపెనీలు ఇతర ఎరువులను రైతులకు అంటగడుతున్నాయి. కంపెనీలు వాటి సేల్స్ మేనేజర్లకు ఇతర ఎరువులను విక్రయించే టార్గెట్లు పెట్టి మరీ యూరియాయేతర ఎరువుల అమ్మకాలు చేయిస్తున్నాయి. టార్గెట్లు పూర్తి చేసిన సేల్స్ మేనేజర్లకు నగదు ప్రోత్సాహకం ఇస్తున్నాయి. దాంతో పాటు హైదరాబాద్‌లో విలాసవంతమైన రిసార్టుల్లో విందులు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాయి. కొన్నిసార్లు విదేశీ పర్యటనలకు కూడా అవకాశం కల్పిస్తున్నాయి. దీంతో వారంతా ఎరువుల డీలర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. రూ.1.10 లక్షల విలువ చేసే 445 బస్తాల యూరియా ఇవ్వాలంటే రూ.4.40 లక్షల విలువ చేసే 400 బస్తాల 20/20/013 రకం కాంప్లెక్స్ ఎరువులు కొనాలనే నిబంధన విధిస్తున్నారు. దీంతో డీలర్లు యూరియా కోసం మార్కెట్లో రైతులకు అంతగా అవసరం లేని కాంప్లెక్స్ ఎరువుల బస్తాలను కూడా కొంటున్నారు. ఇలా కంపెనీలు ఏడాదికి వందల కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం చేస్తున్నాయనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. కొందరు డీలర్లు ఇందుకు నిరాకరించడంతో ఆయా ప్రాంతాల్లో రైతులు యూరియా సక్రమంగా లభించక ఇబ్బందులకు గురవుతున్నారు.

రైతులను మభ్యపెడుతూ..



యూరియాతో పాటు ఫలానా ఎరువు, పురుగుమందు వాడితే ప్రయోజనం ఉంటుందని కంపెనీలు, డీలర్లు మభ్యపెడుతుండటంతో రైతులు అమాయకంగా వాటిని కొంటున్నారు. వాస్తవానికి యూరియాను ఇతర ఎరువులు, పురుగు మందులకు లింక్ పెట్టి విక్రయించకూడదన్న ఉత్తర్వులు ఉన్నాయి. జిల్లా వ్యవసాయాధికారి ఆదేశం మేరకే యూరియా కేటాయింపులు జరగాలి. కానీ డీలర్లు ఈ విధంగా లింక్ పెడుతూ ఇతర ఎరువులను బలవంతంగా అంటగడుతున్నారని తెలిసినా అధికారులు మిన్నకుంటున్నారని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. పైగా మండల వ్యవసాయాధికారి ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఎరువులను, పురుగుమందులను విక్రయించాలన్న నిబంధన ఉన్నా అది కూడా పట్టించుకోవడం లేదని అంటున్నాయి. మరోవైపు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను కూడా కంపెనీలు వదలడంలేదు. యూరియాలో 20 శాతం ఈ సేవా కేంద్రాలకు కేటాయించాలని ప్రభుత్వం స్పష్టం చేసినా, ఈ ఆదేశాలను తుంగలో తొక్కుతున్న కొన్ని యూరియా కంపెనీలు 20/20/013 ఎరువుల్ని తీసుకుంటేనే యూరియా ఇస్తామని చెబుతున్నాయి. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు తగు చర్యలు తీసుకుని డీలర్లు ఒక ఎరువుతో మరొక ఎరువుకు లింకు పెట్టకుండా చూడాలని రైతు సంఘాల నేతలు కోరుతున్నారు.

– సాక్షి, హైదరాబాద్

ఎరువులను 24 గంటల్లో ఇవ్వాలి

కేంద్ర ఎరువులు రైతులకు చేరకుండా కేసీఆర్ కుట్ర: ఇంద్రసేనారెడ్డి



సాక్షి, హైదరాబాద్: మార్క్‌ఫెడ్ వద్దనున్న కేంద్రం పంపించిన ఎరువులను 24 గంటల్లో రైతులకు ఇవ్వకపోతే...ఆ కార్యాలయాలను బీజేపీ కార్యకర్తలు ముట్టడించి ప్రజలకు పంపిణీ చేస్తారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 17న సభ కోసం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్ ఇవ్వాలంటూ కాంగ్రెస్ దరఖాస్తు చేసుకుంటే ఆధారాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ–బీఆర్‌ఎస్ ఒకటేనంటూ దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితల మధ్య వ్యాపార సంబంధాలు, 2004 ఎన్నికల్లో కాంగ్రెస్–బీఆర్‌ఎస్‌లు కలిసి పోటీ చేయడంపై చెప్పాలని డిమాండ్ చేశారు.

బకాయిల కోసం ఆర్టీసీ జేఏసీ ఉద్యమం

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగులకు బకాయి ఉన్న రెండు విడతల వేతన సవరణల అమలు, 2013 వేతన సవరణ బాండ్ల చెల్లింపుతోపాటు ఇతర ఆర్థిక ప్రయోజనాల అమల్లో జాప్యం చేస్తున్నందున పోరాట కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఆర్టీసీలోని మూడు సంఘాలతో కూడిన జేఏసీ ప్రకటించింది. ఆదివారం నిర్వహించిన సమావేశంలో.. ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధం కావాలని నిర్ణయించినట్టు జేఏసీ ప్రతినిధులు రాజిరెడ్డి, వీఎస్ రావు, యాదయ్యలు తెలిపారు. 15వ తేదీన డిమాండ్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని ధర్నాలు నిర్వహించాలని సూచించినట్టు పేర్కొన్నారు. చలో ఇందిరా పార్కు కార్యక్రమం కూడా ఏర్పాటు చేస్తున్నామని, తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

రేపు బీజేపీలో చేరుతున్న చీకోటి ప్రవీణ్



సైదాబాద్: ధర్మ రక్షణ సంస్థ ఫౌండర్ చైర్మన్ చీకోటి ప్రవీణ్ రాజకీయ అరంగేట్రం చేయనున్నారు. ఈనెల 12న ఆయన బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. క్యాసినో నిర్వాహకుడిగా చిరపరిచితుడైన ఆయనపై ఈడీ దాడులు చేసిన సంగతి విదితమే. ఆ తరువాత ఆయన ధర్మరక్షణ సాధకుడిగా మారి పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ధర్మ రక్షణ సంస్థ తరఫున పలు సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఆయనను సన్నిహితులు రాజకీయాల్లోకి రావాలని చాలా రోజులుగా కోరుతున్నారు. రాజకీయాల పట్ల ఆసక్తిగా ఉందని ఆయన సైతం పలు సందర్భాల్లో వెల్లడించారు.

రాష్ట్రంలో మరో రెండ్రోజులు

మోస్తరు వర్షాలు

- రేపు పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
- రాష్ట్రానికి పశ్చిమ, వాయవ్య దిశ నుంచి వీస్తున్న బలమైన గాలులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం వాయవ్య మధ్యప్రదేశ్ నుంచి, ఈశాన్య రాజస్తాన్‌పై వరకు, దక్షిణ ఛత్తీస్‌గఢ్ వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 4.5కిలోమీటర్ల ఎత్తులో ఉంది. ఈనెల 12వ తేదీన వాయవ్య బంగాళాఖాతం నుంచి పశ్చిమ, మధ్య బంగాళాఖాతం మీదుగా ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేసింది. ప్రస్తుతం రుతుపవనాల కదలికలు చురుగ్గా ఉండడంతో రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు పలుచోట్ల తేలికపాటి వానలు వరుసగా నమోదవుతాయని తెలిపింది. అదేవిధంగా ఉత్తర ప్రాంత జిల్లాల్లో మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు నమోదవుతాయని అంచనా వేసింది. ఆదివారం రాష్ట్రంలో సగటున 6.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

22శాతం అధికవర్షపాతం నమోదు

ప్రస్తుత సీజన్‌లో రాష్ట్రంలో ఇప్పటివరకు 63.15 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... ఆదివారం సాయంత్రానికి 76.82 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 22శాతం అధికవర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో 22 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా... 11 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఆదివారం రాష్ట్రంలో అత్యధికంగా సంగారెడ్డి జిల్లా కంగ్టిలో 4.6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ప్రస్తుతం రాష్ట్రానికి పశ్చిమ, వాయవ్య దిశ నుంచి తక్కువ ఎత్తులో గాలులు బలంగా వీస్తున్నట్లు వాతావరణ శాఖ వివరించింది.

అందుబాటులో తగినంత యూరియా

వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: యూరియా తగినంత అందుబాటులో ఉన్నందున.. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ శాఖ, జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 2.18 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉందని పేర్కొన్నారు. ప్రైవేటు డీలర్ల వద్ద 90 వేల మెట్రిక్ టన్నులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద 41 వేల మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ వద్ద 81 వేల మెట్రిక్ టన్నులు, కంపెనీ గోడౌన్లలో 6 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయని వివరించారు. యూరియాతో పాటు మొత్తం 7.57 లక్షల మెట్రిక్ టన్నుల ఇతర ఎరువులు ఉన్నాయని తెలిపారు. రాబోయే నాలుగు రోజుల్లో మరో 18 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని మంత్రి హెచ్చరించారు.

ప్రజాస్వామ్య తెలంగాణ కావాలి

అందుకు సహకరించండి: బండి సంజయ్




సాక్షి, హైదరాబాద్: ప్రజాస్వామ్య తెలంగాణ ఏర్పాటు లక్ష్యంగా జరుగుతున్న పోరాటానికి మద్దతివ్వాలని ప్రవాస భారతీయులకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పిలుపునిచ్చారు. తెలంగాణలో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతోందంటే ప్రధాని మోదీ ప్రభుత్వం ఇస్తున్న నిధులవల్లేనని చెప్పారు. ముఖ్యంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నింటికీ కేంద్రమే నిధులిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో అవినీతికి పాల్పడటం తప్ప బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ఏమీ లేదని ఆరోపించారు. అమెరికా పర్యటనలో భాగంగా న్యూజెర్సీలో ఓవర్సీస్ ఫ్రెండ్స్ అఫ్ బీజేపీ (ఓఎఫ్‌ఓబీ) ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో సంజయ్ మాట్లాడారు. ప్రవాస భారతీయులు ఎన్నికల సమయంలో కచ్చితంగా కనీసం 15 రోజుల సమయమైనా వెచ్చించి దేశానికి రావాలని కోరారు. రాష్ట్రంలో అవినీతిని నిర్మూలించడంతోపాటు పేదలకు పక్కా గృహ సదుపాయం, నిరక్షరాస్యత నిర్మూలన, ఉన్నత విద్యావ్యాప్తితోపాటు తాగు, సాగు నీటి ప్రాజెక్టులను పెద్ద ఎత్తున నిర్మించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి అనుగుల (ఓఎఫ్‌ఓబీ జాతీయ పూర్వ అధ్యక్షులు), ప్రవాస భారతీయులు విలాస్ రెడ్డి, జంబుల సంతోష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తుమ్మల, వంశీ యంజాల, ప్రదీప్ రెడ్డి కట్ట పాల్గొన్నారు.

మంచిమాట

ఏ వస్తువు అయినా కొంతకాలం వాడక పోతే తుప్పు పట్టటమో, బిగుసుకుపోవటమో, పాడవటమో జరుగుతుంది. కదల కుండా ఉన్న నీరు పాచి కట్టినట్టు. యంత్రమైనా, శరీరమైనా, మనసైనా అంతే!

మనసుకి వ్యాయామం



శరీరానికి సంబంధించి ఆహారంతో పాటు వ్యాయామం గురించి చాలామంది చెప్పటం, ఎంతో మంది అనుసరించటం గమనించవచ్చు. కాని, మనస్సు గురించి కొద్దిమంది వైద్యులు చెప్పినా పట్టించుకున్నవారి సంఖ్య అత్యల్పం. మనోవ్యాపారం జరిగేది మెదడులో. దానిని వాడక మూలన పడేస్తే అది మొద్దుబారిపోతుంది. అందుకే చాలా మందికి మతిమరుపు వస్తూ ఉంటుంది. వయసు పైబడితే అది సహజం అనుకుంటారు. శరీరం చక్కగా ఉండాలని మందులు, అలంకారాలు చేసుకున్నప్పుడు మెదడుకి కూడా చేయాలని మర్చిపోతూ ఉంటారు. పైగా ఇంత వయసు వచ్చాక పరీక్షలు రాయాలా? ఉద్యోగాలు చేయాలా? ఊళ్లేలా? అని అడుగుతూ ఉంటారు. నిజమే కాని తన విషయాలు తనకి గుర్తు ఉండాలి కదా! ముందు వస్తువులు, మనుషుల పేర్లు మొదలైనవి మర్చిపోవటంతో మొదలై కొంతకాలానికి అవయవాలు కూడా తమ పని చేయటం మర్చిపోయే ప్రమాదం ఉన్నదట!ఆయువు ఉన్నంత కాలం ఒకరి మీద ఆధార పడకుండా తెలివితో ఉండటం ఎవరైనా కోరుకోవలసినదే!

దీనికి చేయ వలసిన దల్లా మెదడుకి పని చెప్పి చేయిస్తూ ఉండటమే. ముందు నుండి ఆవిధంగా ఉంటే వృద్ధాప్యంలో మతిమరపు వచ్చే అవకాశాలు చాలా తక్కువ అని మానసిక వైద్యనిపుణులు చెప్పిన మాట. అప్పుడు మానవ జన్మ అనే అద్భుతమైన అవకాశాన్ని పూర్తిగా అనుభవించినట్టు అవుతుంది. దానికోసం కొన్ని మానసిక వ్యాయామాలు సహకరిస్తాయని చెప్పారు. మనస్తత్వ శాస్త్రవేత్తలు సూచించిన వాటిలో కొన్ని చూద్దాం. చదవటం, రాయటం, మాట్లాడటం, ఆలోచించటం, సమస్యలని పరిష్కరించటం మొదలైనవి. వీటి అన్నిటికీ మెదడుని ఉపయోగించక తప్పదు. 40 సంవత్సరాల తరువాత మెదడులో ఉన్న కణాలు పెరగవు. 60 సంవత్సరాల తరువాత తగ్గటం మొదలవుతుంది. కనుక క్రమంగా జ్ఞాపకశక్తి క్షీణిస్తూ ఉంటుంది. కాని చదవటం, రాయటం వంటివి చేసే వారికి పెరగక పోయినా తరగవు. ఉపాధ్యాయులకి జ్ఞాపకశక్తి ఎక్కువ ఉండటానికి కారణం వారు చదువుతూ, రాస్తూ, మాట్లాడుతూ ఉండటమే. అందరికీ ఆ అవకాశం ఉండదు కదా! అందుకని చిన్న పిల్లల దగ్గర కూర్చుని చదివించ వచ్చు. వారికి కథలు చెప్ప వచ్చు. అసలు మాట్లాడటమే చాలు.

బుర్రకి కావలసినంత పని. పద వినోదాలు పూర్తి చేయటం, చదరంగం ఆడటం వంటి వాటిని చేయచ్చు. ఇప్పుడైతే అవన్నీ ఉన్నాయి. మరి, పూర్వం ఏం చేసేవారు? పొడుపు కథలు, చిక్కుప్రశ్నలు, జంటపదాల ఆట, వైకుంఠపాళీ, పులి – జూదం, పచ్చీసు, వామన గుంటలు, వైకుంఠపాళీ వంటి కాలక్షేపాలు, వినోదాలు ఉండేవి. ఇవన్నీ మెదడుకి చురుకుతనం కలిగించేవే. పెద్ద ఉమ్మడి కుటుంబాలు ఉండేవి కనుక ఎప్పుడు ఏదో ఒకటి మాట్లాడుతూ ఉండేవారు. కొంతకాలం మాట్లాడకుండా ఉంటే, మాట్లాడటానికి కొంచెం ప్రయత్నం చేయవలసి ఉంటుంది. అందుకే వృద్ధులని, ఏదయినా కారణంతో జ్ఞాపకశక్తిని కోల్పోయిన వారిని తరచూ పలకరిస్తూ ఉండమని వాళ్ళని మాట్లాడేట్టు చేయమని వైద్యులు చెపుతారు. ఆనాటి వారు తమ కుటుంబ సమస్యలను తామే పరిష్కరించుకునే వారు. ఎవరి సమస్య అయినా అందరు పరిష్కరించటానికి కుస్తీ పట్టే వారు. ఇప్పుడు అందరికీ ఆలోచించటానికి బద్ధకం. కళ్ళు, చెవులు అప్పగించి కూర్చొనే అలవాటు ఎక్కువయింది. ఈనాడు ఎక్కడ పడితే అక్కడ కౌన్సిలింగ్ కేంద్రాలు తయారవటానికి కారణం మెదడుని పని చేయించకపోవటమే. శరీరం లాగానే మనస్సుకి కూడా సోమరితనం అలవాటు అయిపోయింది. నాకు ఏదైనా సమస్య వస్తే ఎవరో పరిష్కారం చూపించాలి, నా మెదడుని నేను కష్టపెట్టను అన్నది అలవాటు అయితే స్థబ్దుగా తయారవుతారు. మెదడు తుప్పు పడుతుంది. తస్మాత్ జాగ్రత!!

డా॥ ఎన్ అనంత లక్ష్మి

అమృత బిందువులు



● జీవితంలో ఏం కావాలను కుంటారో అది చాలామందికి దక్కదు. దక్కకపోవడం సహజంగా బాధను కలిగిస్తుంది. దక్కినదాంట్లోనే ఆనందం వెతుక్కునేవారు మరోరకం. ● తృప్తి, అసంతృప్తి అనేవి మనుషుల ఆలోచనా విధానంలో ఉంటాయి. కొందరు నిరంతరం కావాల్సిన దానికోసం ప్రయత్నాలు సాగిస్తూనే ఉంటారు. ఏ పద్ధతిలో అన్నది ముఖ్యం.

● కోరిక ఉండాలి. దాన్ని నెరవేర్చుకునేందుకు కృషి జరగాలి. ఫలితం ఎలా ఉన్నా ప్రయత్నంలో మాత్రం ఆనందం పొందాలి. లక్ష్యసాధనలో రాజీ పడకూడదు.

● అన్నీ కలిసివస్తే అదృష్టవంతుడిగా చలామణీ అయ్యే మనిషి గెలుపును కేవలం తన ప్రతిభగా ప్రకటించుకోవడం ఎంతవరకు సమంజసం?

● జీవితం ఎలా రూపుదిద్దుకుంటుందో, ఎక్కడెక్కడ మలుపులు తిరుగుతుందో ఎవరూ చెప్పలేరు. మనం చేసే మంచి పనులే మన అదృష్టాన్ని నిర్ణయిస్తాయని భావించేవారు కొందరైతే, మనం గతంలో చేసుకున్నదాన్ని బట్టే ఈ స్థితి అని విశ్వసించేవారు మరికొందరు. ఎదురయ్యే అనుభవాన్ని ఏ విధంగా తీసుకుంటామన్నదే ముఖ్యం. అదే జీవితసత్యం.

వాగ్గేయకార వైభవం

హృదయాన్ని తాకేది... పాటే..!





బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

శరీరం బలంగా ఉండి మనసు సంస్కారవంతంగా లేనప్పుడు అది లోకానికి ప్రమాదం. రావణుడు బలవంతుడే, కానీ సంస్కారవంతుడుకాదు.. దానితో లోకమంతా క్షోభించి పోయింది. అందువల్ల మనకు బలం అవసరమే. కానీ దానిని ఎలా ఉపయోగిస్తున్నామనే దాని మీద వ్యక్తిగత శాంతి, సమాజ శాంతి ఆధారపడి ఉంటుంది. మంచి కీర్తన విన్నారు. కీర్తనకు ఉన్న లక్షణం– అది సామవేదగానం. త్వరగా మనసుకు హత్తుకుంటుంది. దానితో మనసుని ప్రశాంతంగా ఉండేటట్లు చేస్తుంది. దానిలోని సాహిత్యం ఆలోచనలను మథిస్తుంది. మనసుని పోషిస్తుంది. మనసు ఉద్వేగంతో, అశాంతితో ఉన్నప్పుడు అది రాక్షసత్వానికి కారణం అవుతుంది. మనసు ప్రశాంతంగా ఉండి ఉద్వేగరహితం అయిందనుకోండి అది సత్వగుణానికి కారణమవుతుంది. ఎక్కడ సత్వగుణం ఉంటుందో అక్కడ ఉత్తమ కర్మ ఉంటుంది. ఎక్కడ అశాంతి ఉందో, ఎక్కడ ఉత్ప్రేరకం ఉందో అక్కడ ఆ వ్యక్తి ఎంత ప్రమాదకరమైన పని అయినా చేస్తాడు...అందుకే ''క్రుద్ధం పాపం న కుర్యాత్కః క్రుద్ధో హన్యాద్గురువునపి/క్రుద్ధః పరుషయా వాచా నరః సాధునాధిక్షిపేత్ '' అంటాడు హనుమ రామాయణంలో. క్రోధానికి గురయిన వ్యక్తిఎంతటి దుస్సాహసానికయినా పూనుకుంటాడు. వారించబోయిన పెద్దలను కూడా లెక్కచేయడు. అశాంతి ఎంత పాపాన్నయినా చేయిస్తుంది. ఆ అశాంతిని తొలగించడానికి ప్రధాన సాధనం సంగీతమే.

గజాసుర సంహార వృత్తాంతంలో ఒక విచిత్రం కనబడుతుంది. గజాసురుడు కాశీపట్టణంలో విచ్చలవిడిగా ప్రవర్తిస్తుంటాడు. పరమశివుడు త్రిశూలంతో పొడిచి పైకెత్తిపెట్టాడు. త్రిశూలం అతనిలో గుణాత్మక స్థితిని కల్పించింది. గజాసురుడు ప్రాణాంతకస్థితిలో ఉండికూడా సామవేదగానం చేసాడు. ద్వంద్వాలకు అతీతుడయిన శివుడు ఆ అసురుడిలో లోపాలను పక్కనబెట్టి మార్పు వచ్చిందా లేదా అని చూసాడు. నీకేం కావాలని అడిగాడు. నా తోలు వలిచి నువ్వు కట్టుకోవాలని కోరాడు. నీవు నన్ను సంగీతంతో, సామవేద మంత్రాలతో సంతోషపెట్టావు కనుక నిన్ను అనుగ్రహించడానికి గుర్తుగా కృత్తివాసేశ్వరుడుగా ఉంటాను..అని ఆ పేర కాశీలో వెలిసాడు. సంగీతం అంత త్వరగా హృదయాన్ని తాకుతుంది. అదే గంభీరమైన విషయాలను మరో రూపంలో.. పద్యం, శ్లోకం వంటి రూపాల్లో చెబితే ఇంత త్వరగా మనసును ప్రభావితం చేస్తుందని చెప్పలేం.

అందుకే వాల్మీకి రామాయణాన్ని లవకుశులకు గానంగా నేర్పాడు... అని ఉంది బాలకాండలో. అది వాద్య తంత్రులకు కట్టుబడుతుంది. మంచి సంగీతం అంటే... త్యాగబుద్ధితో, ఎటువంటి స్వప్రయోజనం ఆశించకుండా లోకానికి అందించిన వారు దానిని పాటగా అందించారు. దానిని ఎలా పాడాలో కూడా వారే నిర్ణయించేసారు. అంటే వారే స్వరపరిచారు. సాహిత్యం కూడా వారే సమకూర్చారు. అది కూడా ప్రణాళికతో కాదు. భగవంతుని గుణాలతో లోలోపల రమించిపోయి, ఆ పరవశంతో గీతంగా వారి నోటినుంచి ప్రవహించింది.. అదీ వాగ్గేయకారుల గొప్పదనం. పాట సంస్కృతికి శాశ్వతత్వాన్ని ఇస్తుంది.

తాత్త్వికథ

ఎవరు అధికులు?



ఒకరోజు శివపార్వతులిద్దరూ కైలాస శిఖరం మీద సుఖాసీనులై ఉన్నారు. పార్వతీదేవి ఉన్నట్టుండి ''ప్రకృతి– పురుషులలో ఎవరు అధికులు?'' అని శివుణ్ణి అడిగింది. శుద్ధసత్త్వమైన పురుషుని వలననే ప్రకృతికి అస్తిత్వం ఉన్నదని శివుడు సమాధానమిచ్చాడు. దాంతో ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగాయి. చూస్తుండగానే వాదన కాస్తా ముదురు పాకాన పడింది. అమ్మవారు ప్రకృతి గొప్పదనం ఏమిటో తెలియజేయాలనుకుని తన శక్తిని ఉపసంహరించి అంతర్ధానం అయింది. దానితో పోషణ లేక లోకాలన్నీ అల్లకల్లోలం అయిపోయాయి. సృష్టిలో ఉన్న జీవులన్నీ ఆకలితో అలమటిస్తుండటం చూసి తట్టుకోలేకపోయింది అమ్మ. దాంతో కాశీ పట్టణంలో తానే గరిట పట్టుకుని వండి కోటానుకోట్ల జీవులకు వండి పెట్టడం మొదలుపెట్టింది. శివగణమంతా ఆకలికి తట్టుకోలేక హాహాకారాలు చేస్తుంటే తనను నమ్ముకున్న వారి బాధ చూడలేక ఏ ఆకలి దప్పులు లేని ఆనందస్వరూపుడు శివుడు భిక్షాపాత్ర తీసుకుని కాశీకి వెళ్లి అన్నపూర్ణ చేతి నుండి అన్నం స్వీకరించాడు. సాక్షాత్తూ తన పతిదేవుడే తన వద్దకు భిక్షాపాత్ర పట్టుకుని రావడం చూసిన అమ్మవారు తనదే పై చేయి అని ముందు సంతోషించినప్పటికీ, తర్వాత భర్తనే భిక్షకుడిగా చూసినందుకు బాధపడుతుంది. దాంతో పరమేశ్వరుడు ఇద్దరిలో ఎవరూ అధికులు కారని, ప్రకృతి, పురుషులిద్దరూ అన్నింటా సమానమని చాటి చెప్పి పార్వతి చేయి పట్టుకుని మరల కైలాసానికి వెళ్ళిపోయాడు.

శక్తి లేకపోతే స్థూల శరీరం ఉండి లాభం లేదు. ఎవరైనా శక్తి హీనుడు అంటారు కానీ విష్ణుహీనుడు, శివహీనుడు అని అనరు. శరీరం లేని శక్తి నిరర్థకం. శక్తి ఉన్న శరీరం శివం లేకపోతే శవం. కాబట్టి రెండూ సమపాళ్లలో ఉంటేనే మనుగడ అని చాటి చెప్పడానికి ఇద్దరిగా ఉన్న ఒక్కరు ఆడిన నాటకం ఇది.

– డి.వి.ఆర్.

సినిమా

మెగా స్టార్ట్



● చిరంజీవి

హీరో చిరంజీవి నటించనున్న 157వ సినిమాకి 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహించనున్న సంగతి తెలిసిందే. యూవీ క్రియేషన్స్‌పై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మించనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు మరింత ఊపందుకున్నాయి. ''మెగా ఫిల్మ్ కోసం మెగా స్టార్ట్. చిరంజీవిగారి 157వ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను స్టార్ట్ చేశాం'' అని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు దర్శకుడు వశిష్ఠ. అడ్వెంచరస్ సోషియో ఫ్యాంటసీ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. నవంబరు నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ జరిగేలా చిత్రయూనిట్ ప్లాన్ చేస్తోందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ సినిమాలో హీరోయిన్‌గా నయనతార, అనుష్క, మృణాళ్ ఠాకూర్ వంటి వారి పేర్లు తెరపైకి వచ్చాయి. మరి ఫైనల్‌గా ఎవరు ఫిక్స్ అవుతారో వేచి చూడాలి. ఈ సినిమాకు కెమెరా: ఛోటా కె. నాయుడు.

కన్నప్పతో ప్రభాస్

హీరో మంచు విష్ణు కలల ప్రాజెక్ట్ అయిన 'కన్నప్ప' చిత్రంలో స్టార్ హీరో ప్రభాస్ నటించనున్నారు. 'మహాభారత' ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ 'కన్నప్ప'కి దర్శకత్వం వహిస్తారు. అవా ఎంటర్‌టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై నటుడు, నిర్మాత మోహన్ బాబు నిర్మించనున్న ఈ సినిమా ఆగస్టు 18న శ్రీకాళహస్తిలో ప్రారంభమైంది. ఈ మూవీలో హీరోయిన్ కృతీసనన్ సోదరి నుపుర్ సనన్ హీరోయిన్‌గా నటిస్తారు. శివ భక్తుడైన భక్త కన్నప్ప, ఆయన భక్తి గొప్పతనం నేపథ్యంలో రూపొందనున్న ఈ చిత్రంలో హీరో ప్రభాస్ ఓ కీలక పాత్ర పోషించనున్నారు. వ్యక్తిగతంగా ప్రభాస్, విష్ణు మధ్య మంచి స్నేహం ఉంది. ఈ కారణంగానే గతంలో 'దేనికైనా రెడీ' కోసం వాయిస్ ఓవర్ ఇచ్చారు ప్రభాస్. ఇప్పుడు 'కన్నప్ప'లో ఒక కీలకమైన పాత్రలో నటించేందుకు ఆయన అంగీకారం తెలిపారు. దీంతో ఈ సినిమాపై ఇండస్ట్రీలో మరిన్ని అంచనాలు పెరిగాయి. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ మూవీ రూపొందనుంది. 'కన్నప్ప' షూటింగ్‌కి ఇండియాలో వాతావరణ పరిస్థితులు అనుకూలించవని, అందుకే న్యూజిలాండ్‌లో చిత్రీకరించనున్నట్లు మంచు విష్ణు గతంలోనే చెప్పిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, స్టీఫెన్ దేవాసి.



● ప్రభాస్, మంచు విష్ణు

శ్రీలంకలో సైంధవ్



● వెంకటేష్

వెంకటేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్' కొత్త షెడ్యూల్ శ్రీలంకలో ప్రారంభమైంది. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న 'సైంధవ్' కీలక షూటింగ్ షెడ్యూల్ శ్రీలంకలో జరుగుతోంది. ''వెంకటేష్ కెరీర్‌లో 75వ మైలురాయిగా 'సైంధవ్' రూపొందుతోంది. శ్రీలంక షెడ్యూల్‌లో భాగంగా ముఖ్యమైన టాకీ భాగంతో పాటు ఇంటెన్స్ యాక్షన్ బ్లాక్, ఒక పాట కోసం కొన్ని మాంటేజ్‌లు చిత్రీకరిస్తున్నాం. వెంకటేష్‌తో పాటు ప్రధాన నటీనటులు పాల్గొంటున్నారు. ఈ సినిమా కథ పూర్తిగా వెంకటేష్, నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, సారా, జయప్రకాశ్.. ఇలా ఎనిమిది పాత్రల చుట్టూనే తిరుగుతుంది. పాన్ ఇండియా మూవీగా రూపొందుతోన్న 'సైంధవ్'ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 22న విడుదల చేస్తున్నాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, కెమెరా: ఎస్.మణికందన్, సహ నిర్మాత: కిషోర్ తాళ్లూరు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ వెంకట రత్నం(వెంకట్).

సుశీల నవలతో సిగ్గు



● కల్యాణ్, రామసత్యనారాయణ, నరసింహ, విజయేంద్ర ప్రసాద్

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వంలో తెరకెక్కనున్న కొత్త చిత్రం 'సిగ్గు' ఆదివారం ప్రారంభం అయింది. భీమవరం టాకీస్ పతాకంపై టి. రామసత్యనారాయణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి రచయిత, దర్శకుడు కె.విజయేంద్ర ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, సీబీఐ మాజీ జేడీ లక్ష్మినారాయణ క్లాప్ ఇచ్చారు. డైరెక్టర్ వీవీ వినాయక్ తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాతలు సి.కల్యాణ్, దామోదర ప్రసాద్ స్క్రిప్ట్‌ను దర్శక–నిర్మాతలకు అందించారు. ''చలంగారి నవల 'సుశీల' ఆధారంగా 'సిగ్గు' చేస్తున్నాను'' అన్నారు నరసింహ నంది. ''సి.కల్యాణ్‌గారి సపోర్ట్‌తో ముందుకు వెళ్తున్నాను'' అన్నారు టి.రామసత్యనారాయణ. ఈ కార్యక్రమంలో నిర్మాత ప్రసన్న కుమార్, డైరెక్టర్ రేలంగి నరసింహా రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సినిమాకు సంగీతం: సుక్కు, కెమెరా: అబ్బూరి ఈషే.



● సతీష్ వర్మ, కార్తీక్ రత్నం, రవితేజ, శ్రీవిష్ణు, హరీష్ శంకర్, గోల్డీ నిస్సీ

ఛాంగురే బంగారురాజాని ఎంజాయ్ చేస్తారు: రవితేజ

''ఛాంగురే బంగారురాజా' టైటిల్ నాకు నచ్చింది. ఈ కథని సతీష్ చెబుతున్నంత సేపు నాకు 'లేడీస్ టైలర్' సినిమా, దర్శకులు వంశీ గుర్తొచ్చారు. ఆయనతో నేను 'ఔను.. వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు' సినిమా చేశాను. అలాంటి వినోదం 'ఛాంగురే బంగారు రాజా'లో ఉందనిపించింది. ఈ సినిమాను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారనే నమ్మకం ఉంది'' అన్నారు హీరో రవితేజ. కార్తీక్ రత్నం, గోల్డీ నిస్సీ జంటగా నటించిన చిత్రం 'ఛాంగురే బంగారురాజా'. సతీష్ వర్మ దర్శకత్వంలో ఫ్రేమ్ బై ఫ్రేమ్ పిక్చర్స్‌తో కలిసి రవితేజ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న రిలీజ్‌కానుంది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో దర్శకుడు హరీష్ శంకర్ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. రవితేజ మాట్లాడుతూ– ''కార్తీక్ రత్నం ఇందులో మంచి ఎంటర్‌టైనింగ్ రోల్ చేశాడు. నా టీమ్ సభ్యులపై నమ్మకంతో నేను ఒక్కరోజు కూడా ఈ సినిమా షూటింగ్‌కి వెళ్లలేదు.. ఈ మూవీ విజయం సాధించి అందరికీ మంచి పేరు రావాలి'' అన్నారు. ''ప్రతిభా వంతులను, కష్టపడేవారిని రవితేజగారు ఎప్పుడూ ప్రోత్సహిస్తూనే ఉంటారు. సతీష్ వర్మతో నాకు పదేళ్ల పరిచయం. ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు హీరో శ్రీవిష్ణు. ''శ్రీనువైట్లగారి నుంచి మొదలుపెడితే వంశీ వరకు చాలా మంది కొత్త దర్శకులను అన్నయ్య(రవితేజ) ఇండస్ట్రీకి పరిచయం చేశారు. దర్శకులనే కాదు.. సాంకేతిక నిపుణులు, ఆర్టిస్టులను కూడా ప్రోత్సహిస్తారు. ఆయన సినిమాలపై అప్పుడప్పుడు విమర్శలు వస్తుంటాయి. అలా అన్నవాళ్లు పడిపోయారు కానీ అన్నయ్య అలానే ఉన్నారు. 'ఇడియట్' మూవీలోలా 'ఇండస్ట్రీకి ఎందరో వస్తుంటారు.. వెళ్తుంటారు. రవితేజ మాత్రం ఇక్కడే ఇలానే ఉంటారు'' అన్నారు దర్శకుడు హరీష్ శంకర్. ''నేను హీరోగా రవితేజగారు సినిమాను నిర్మించారనే ఆ స్పెషల్ మూమెంట్ లోనే ఇంకా నేను ఉన్నాను'' అన్నారు కార్తీక్ రత్నం. ''కుటుంబంతో కలిసి ఎంజాయ్ చేసే ఫిల్మ్ ఇది'' అన్నారు సతీష్ వర్మ. ఈ వేడుకలో దర్శకులు వెంకటేష్ మహా, కేవీ అనుదీప్, సందీప్ రాజ్, వంశీ, కృష్ణ చైతన్య, నిర్మాతలు వివేక్ కూచిభొట్ల, శరత్ మరార్, ఎస్‌కేఎన్, చిత్రయూనిట్ సభ్యులు మాట్లాడారు.

యాక్షన్ థ్రిల్లర్

సందీప్ మాధవ్, కేథరిన్ త్రెసా జంటగా 'ఓదెల రైల్వేస్టేషన్' ఫేమ్ అశోక్ తేజ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. కేసీఆర్ ఫిల్మ్స్, శ్రీ మహా విష్ణువు మూవీస్‌పై సోమ విజయ్ ప్రకాష్ నిర్మాణంలో దావులూరి జగదీష్, పల్లి కేశవరావు నిర్మిస్తున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. కాగా ఆదివారం (సెప్టెంబర్ 10న) కేథరిన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమె బర్త్ డేని చిత్ర యూనిట్ సెట్స్‌లో జరిపింది. అశోక్ తేజ మాట్లాడుతూ– ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న చిత్రమిది. రెండవ షెడ్యూల్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. త్వరలోనే పవర్ ఫుల్ టైటిల్‌ని ప్రకటించబోతున్నాం'' అన్నారు. ఈ కార్యక్రమంలో సందీప్ మాధవ్, హీరోయిన్లు కీర్తీ చావ్లా, నిష్మా, దీక్షా పంత్, దావులూరి జగదీశ్, పల్లి కేశవరావు పాల్గొని, కేథరిన్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సతీష్ ముత్యాల, సంగీతం: అనూప్ రూబెన్స్, సహ నిర్మాతలు: గౌటి హరినాథ్, రొంగుల శివకుమార్.



● కేథరిన్

సరికొత్త ప్రేమ కథ



● కృష్ణవంశీ, మోక్ష

కృష్ణవంశీ, మోక్ష జంటగా చిలుకూరి ఆకాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. హైనివా క్రియేషన్స్‌పై హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ''అలనాటి రామచంద్రుడు' సరికొత్త ప్రేమ కథా చిత్రం. కుటుంబ సమేతంగా చూడాల్సిన సినిమా ఇది. షార్ట్ ఫిల్మ్స్ తీసి అవార్డులు అందుకున్న ఆకాష్ రెడ్డి తొలిసారి దర్శకునిగా అడుగుపెడుతున్నాడు'' అన్నారు హైమావతి, శ్రీరామ్ జడపోలు. ''మా సినిమా చిరుజల్లుల్లా హాయిగా ఉంటుంది. ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు చిలుకూరి ఆకాష్ రెడ్డి. ఈ చిత్రానికి అసోసియేట్ నిర్మాత: విక్రమ్ జమ్ముల, కెమెరా: ప్రేమ్ సాగర్, సంగీతం: శశాంక్ తిరుపతి, లైన్ ప్రొడ్యూసర్: అవినాష్ సామల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: గద్దల అన్వేష్.

ఫ్యామిలీ డ్రామా

కమల్ కామరాజు, అపర్ణాదేవి ప్రధాన పాత్రల్లో రఘుపతి రెడ్డి గుండా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సోదర సోదరీమణులారా...'. 9 ఈఎమ్ ఎంటర్‌టైన్మెంట్స్, ఐఆర్ మూవీస్ పతాకాలపై విజయ్ కుమార్ పైండ్ల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా రూపొందిన మా చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది'' అని యూనిట్ పేర్కొంది. 'కాలకేయ' ప్రభాకర్, పృథ్వీ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు నేపథ్య సంగీతం: వర్ధన్, కెమెరా: మోహన్ చారి.



● అపర్ణ



భారత ఫుట్‌బాల్ జట్టుకు నిరాశ

కింగ్స్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టు చివరిదైన నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. థాయ్‌లాండ్‌లో నాలుగు దేశాల మధ్య జరిగిన ఈ టోర్నీలో భారత్‌కు వర్గీకరణ మ్యాచ్‌లోనూ ఓటమి ఎదురైంది. లెబనాన్ జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సందేశ్ జింగాన్ నాయకత్వంలోని భారత జట్టు 0-1 గోల్ తేడాతో ఓడిపోయింది. లెబనాన్ తరఫున ఆట 77వ నిమిషంలో కాసీమ్ ఎల్ జీన్ గోల్ సాధించాడు. వ్యక్తిగత కారణాలతో రెగ్యులర్ కెప్టెన్ సునీల్ ఛెత్రి ఈ టోర్నీకి దూరంగా ఉన్నాడు.



కిరణ్ జార్జికి సింగిల్స్ టైటిల్

భారత బ్యాడ్మింటన్ రైజింగ్ స్టార్ కిరణ్ జార్జి తన కెరీర్‌లో రెండో అంతర్జాతీయ టైటిల్‌ను సాధించాడు. జకార్తాలో ఆదివారం ముగిసిన ఇండోనేసియా ఓపెన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-100 టోర్నీలో 23 ఏళ్ల కిరణ్ జార్జి విజేతగా నిలిచాడు. కేరళకు చెందిన కిరణ్ జార్జి ఫైనల్లో 21-19, 22-20తో జపాన్‌కు చెందిన ప్రపంచ 82వ ర్యాంకర్ కూ తకహాషిపై గెలుపొందాడు. కిరణ్ జార్జికు 7,500 డాలర్ల (రూ. 6 లక్షల 22 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 5,500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



వాన వచ్చింది...

ఆట ఆగింది

- భారత్, పాక్ మ్యాచ్ నేటికి వాయిదా
- టీమిండియా 24.1 ఓవర్లలో 147/2
- ఇదే స్కోరు నుంచి కొనసాగనున్న భారత ఇన్నింగ్స్
- రోహిత్ శర్మ, గిల్ అర్ధ సెంచరీలు
- నేడూ వర్ష సూచన



కొలంబో: వేదిక మారినా... భారత్, పాకిస్తాన్ క్రికెట్ జట్లను మాత్రం వర్షం వెంటాడుతోంది. ఆసియా కప్ టోర్నీలో భాగంగా ఈ రెండు జట్ల మధ్య గ్రూప్ దశ మ్యాచ్ వర్షార్పణం కాగా... ఆదివారం జరగాల్సిన 'సూపర్-4' దశ మ్యాచ్‌కూ వాన అంతరాయం కలిగించింది. వాతావరణ పరిస్థితిని ముందే ఊహించిన నిర్వాహకులు ఈ మ్యాచ్‌కు మాత్రమే 'రిజర్వ్ డే' కేటాయించగా... వారి అంచనా నిజం అయింది. ఫలితంగా భారత్, పాక్ 'సూపర్-4' మ్యాచ్ నేటికి వాయిదా పడింది. వర్షం వల్ల ఆట నిలిచిపోయే సమయానికి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 24.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 147 పరుగులు సాధించింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (49 బంతుల్లో 56; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (52 బంతుల్లో 58; 10 ఫోర్లు) ధాటిగా ఆడి అర్ధ సెంచరీలు చేశారు. తొలి వికెట్‌కు వీరిద్దరు 100 బంతుల్లో 121 పరుగులు జోడించారు. వర్షంతో ఆట నిలిచే సమయానికి విరాట్ కోహ్లి (16 బంతుల్లో 8 బ్యాటింగ్), కేఎల్ రాహుల్ (28 బంతుల్లో 17 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. మూడో వికెట్‌కు వీరిద్దరు అజేయంగా 24 పరుగులు జత చేశారు. సాయంత్రం గం. 4:50కు వర్షం మొదలై 5:30కు ఆగిపోయింది. సిబ్బంది పని మొదలుపెట్టగా అరగంట తర్వాత 6 గంటలకు వర్షం మళ్లీ వచ్చింది. పది నిమిషాల తర్వాత నిలిచిపోయింది. కవర్లు తీసేసిన సిబ్బంది మళ్లీ తమ పని మొదలుపెట్టారు.



ఈ క్రమంలో అంపైర్లు రెండుసార్లు మైదానాన్ని పరిశీలించారు. మ్యాచ్‌ను 34 ఓవర్లకు కుదించి రాత్రి 9 గంటలకు ఆట తిరిగి ప్రారంభించాలని అంపైర్లు ఆలోచిస్తున్న సమయంలో రాత్రి 8:30కు వర్షం మళ్లీ వచ్చింది. దాంతో అంపైర్లు మ్యాచ్‌ను నేటికి వాయిదా వేశారు. నేటి మధ్యాహ్నం 3 గంటల నుంచి భారత ఇన్నింగ్స్ 24.1 ఓవర్ల నుంచి మొదలవుతుంది. అయితే సోమవారం కూడా కొలంబోలో భారీ వర్షం పడే అవకాశముందని వాతావరణ శాఖ సమాచారమిచ్చింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) ఫహీమ్ అష్రఫ్ (బి) షాదాబ్ ఖాన్ 56; శుబ్‌మన్ గిల్ (సి) ఆగా సల్మాన్ (బి) షాహీన్ అఫ్రిది 58; కోహ్లి (బ్యాటింగ్) 8; కేఎల్ రాహుల్ (బ్యాటింగ్) 17; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (24.1 ఓవర్లలో 2 వికెట్లకు)**147. **వికెట్ల పతనం:** 1-121, 2-123. **బౌలింగ్:** షాహీన్ 5-0-37-1, నసీమ్ 5-1-23-0, అష్రఫ్ 3-0-15-0, రవూఫ్ 5-0-27-0, షాదాబ్ 6.1-1-45-1.

'క్వీన్' కోకో...

యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ నెగ్గిన అమెరికా టీనేజర్ కోకో గాఫ్

ఫైనల్లో సబలెంకాపై విజయం ● కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ కైవసం
● రూ. 24 కోట్ల 90 లక్షల ప్రైజ్‌మనీ సొంతం




సబలెంకా

న్యూయార్క్: అందరి అంచనాలను తారుమారు చేస్తూ అమెరికా టీనేజర్ కోకో గాఫ్ యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ మహిళల సింగిల్స్ చాంపియన్‌గా అవతరించింది. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఫైనల్లో ఆరో సీడ్ కోకో గాఫ్ 2-6, 6-3, 6-2తో రెండో సీడ్, ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత సబలెంకా (బెలారస్)పై విజయం సాధించింది. గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్ చేరి రన్నరప్‌తో సరిపెట్టుకున్న 19 ఏళ్ల కోకో గాఫ్ సొంతగడ్డ తన గ్రాండ్‌స్లామ్ కలను నెరవేర్చుకుంది. 2 గంటల 6 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో కోకో తొలి సెట్‌ను కోల్పోయినా ఆందోళన చెందలేదు. 23 వేల మంది ప్రేక్షకులతో 'హౌస్‌ఫుల్' అయిన స్టేడియంలో కోకో తన అనవసర తప్పిదాలను తగ్గించుకుంది. ర్యాలీలకు సూపర్ ఫినిష్ ఇస్తూ పాయింట్లు గెలిచి సబలెంకాపై ఒత్తిడి పెంచింది. నాలుగో గేమ్‌లో సబలెంకా సర్వీస్‌ను బ్రేక్ చేసి తన సర్వీస్‌ను నిలబెట్టుకొని కోకో గాఫ్ 4-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరులో రెండో సెట్‌ను దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో సెట్‌లోనూ కోకో తన దూకుడు కొనసాగించింది. తొలి గేమ్‌లో, మూడో గేమ్‌లో సబలెంకా సర్వీస్‌లను బ్రేక్ చేసి తన సర్వీస్‌లను కాపాడుకున్న కోకో 4-0తో ఆధిక్యంలోకి వచ్చింది. అయితే ఐదో గేమ్‌లో తన సర్వీస్‌ను నిలబెట్టుకొని ఆరో గేమ్‌లో కోకో సర్వీస్‌ను బ్రేక్ చేసిన సబలెంకా ఈ ఆధిక్యాన్ని 4-2కి తగ్గించింది. అయితే ఏడో గేమ్‌లో సబలెంకా సర్వీస్‌ను బ్రేక్ చేసి 5-2తో ముందంజ వేసిన కోకో ఎనిమిదో గేమ్‌లో అద్భుతమైన బ్యాక్‌హ్యాండ్ విన్నర్ షాట్‌తో విజయాన్ని ఖాయం చేసుకుంది. విజేత కోకో గాఫ్‌కు 30 లక్షల డాలర్లు (రూ. 24 కోట్ల 90 లక్షలు), రన్నరప్ సబలెంకాకు 15 లక్షల డాలర్లు (రూ. 12 కోట్ల 45 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

ఫైనల్ గణాంకాలు

కోకో గాఫ్		సబలెంకా
2	ఏస్‌లు	4
5	డబుల్ ఫాల్ట్‌లు	6
7/10	నెట్ పాయింట్లు	13/21
5/9	బ్రేక్ పాయింట్లు	4/10
13	విన్నర్స్	25
19	అనవసర తప్పిదాలు	46
83	మొత్తం పాయింట్లు	74

4 క్రిస్ ఎవర్ట్ (1975లో), ట్రేసీ ఆస్టిన్ (1979లో), సెరెనా విలియమ్స్ (1999లో) తర్వాత యూఎస్ ఓపెన్ టైటిల్ నెగ్గిన నాలుగో అమెరికన్ టీనేజర్‌గా కోకో గాఫ్ గుర్తింపు పొందింది.

3 యూఎస్ ఓపెన్ టైటిల్‌తో కోకో గాఫ్ సోమవారం సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ మూడో ర్యాంక్‌కు చేరుకోనుంది. సహచరురాలు జెస్సికా పెగూలాతో కలిసి డబుల్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌నూ అందుకుంటుంది. డబుల్స్ విభాగంలో కోకో గాఫ్-జెస్సికా జోడీ క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయింది.

4 ఈ ఏడాది కోకో గాఫ్ నెగ్గిన సింగిల్స్ టైటిల్స్. ఆక్లాండ్ ఓపెన్, వాషింగ్టన్ ఓపెన్, సిన్సినాటి ఓపెన్, యూఎస్ ఓపెన్‌లో ఆమె విజేతగా నిలిచింది.

9 ఓపెన్ శకంలో (1968 నుంచి) యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ సాధించిన తొమ్మిదో అమెరికా ప్లేయర్‌గా కోకో గాఫ్ గుర్తింపు పొందింది. 2017లో స్లోన్ స్టీఫెన్స్ తర్వాత యూఎస్ ఓపెన్ టైటిల్ నెగ్గిన అమెరికా ప్లేయర్ కోకో గాఫ్ నిలిచింది.

> ఈ విజయం నాకెంతో ప్రత్యేకం. గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచే సత్తా నాలో లేదని చాలా మంది వ్యాఖ్యానించారు. ఈ గెలుపుతో అమితానందంతోపాటు కాస్త ఉపశమనం కలిగింది. గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ఓడిపోయాక చాలా బాధ పడ్డాను. కానీ దేవుడు మనందరికి పరీక్ష పెడతాడని భావించి ముందుకెళ్లాను. ఈరోజు విజయం నా జీవితంలో మధురస్మృతిగా మిగిలిపోతుంది.
> -కోకో గాఫ్

రజతం నెగ్గిన నిత్య



చండీగఢ్: ఇండియన్ గ్రాండ్‌ప్రి ఐదో మీట్‌లో తెలంగాణ అథ్లెట్ జి. నిత్య మహిళల 100 మీటర్ల విభాగంలో రజత పతకం సాధించింది. ఆదివారం జరిగిన ఈ మీట్‌లో నిత్య 100 మీటర్ల దూరాన్ని 11.85 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచింది. శ్రాబణి నందా (ఒడిశా; 11.77 సెకన్లు) స్వర్ణం, దానేశ్వరి (కర్ణాటక; 11.94 సెకన్లు) కాంస్యం సాధించారు.

ప్రథమేశ్ 'రజత' గురి



హెర్మొసిల్లో (మెక్సికో): ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్స్ టోర్నీలో భారత ప్లేయర్ ప్రథమేశ్ జాకర్ రజత పతకంతో మెరిశాడు. ఆదివారం జరిగిన కాంపౌండ్ ఈవెంట్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో ప్రథమేశ్, మథియాస్ ఫులెర్టన్ (డెన్మార్క్) నిర్ణీత 15 బాణాల తర్వాత 148-148 పాయింట్లతో సమంగా నిలిచారు. 'షూట్ ఆఫ్'లో ఇద్దరు 10 పాయింట్ల షాట్ కొట్టారు. అయితే మథియాస్ కొట్టిన బాణం కేంద్ర బిందువుకు అతి సమీపంలో ఉండటంతో అతనికి స్వర్ణ పతకం దక్కింది. ప్రథమేశ్‌కు 15 వేల స్విస్ ఫ్రాంక్‌లు (రూ. 13 లక్షల 94 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. భారత్‌కే చెందిన అభిషేక్ వర్మ ఒక పాయింట్ తేడాతో కాంస్య పతకాన్ని చేజార్చుకున్నాడు. మహిళల వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖ, అదితి క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగారు.

'టాప్' ర్యాంక్‌లోకి ఆస్ట్రేలియా

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే టీమ్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా జట్టు మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకుంది. ఇప్పటి వరకు టాప్ ర్యాంక్‌లో ఉన్న పాకిస్తాన్ జట్టు రెండో ర్యాంక్‌కు పడిపోయింది. బ్లూమ్‌ఫాంటీన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో ఆస్ట్రేలియా 123 పరుగుల తేడాతో గెలవడంతో ఈ ర్యాంకింగ్స్‌లో మార్పు చోటు చేసుకుంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా ఖాతాలో 121 రేటింగ్ పాయింట్లు.. పాక్ ఖాతాలో 120 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. 114 రేటింగ్ పాయింట్లతో భారత్ మూడో స్థానంలో ఉంది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్‌బీఐలో 2000 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సెంట్రల్ రిక్రూట్‌మెంట్ -ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్.. ప్రొబేషనరీ ఆఫీసర్(పీవో) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 2000
» **అర్హత:** ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.04.2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు బేసిక్ పే రూ.41,960.
» **ఎంపిక విధానం:** స్టేజ్-1 ప్రిలిమినరీ పరీక్ష, ఫేజ్-2 మెయిన్ ఎగ్జామినేషన్, ఫేజ్-3 సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ ఎక్సర్‌సైజ్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 27.09.2023.
» **ప్రిలిమినరీ పరీక్ష హాల్‌టికెట్స్ డౌన్‌లోడ్:** 2023, అక్టోబర్ రెండో వారంలో
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://sbi.co.in

ఓఎన్‌జీసీలో 2500 అప్రెంటిస్‌లు

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్.. దేశవ్యాప్తంగా ఓఎన్‌జీసీ సెక్టార్లలో వివిధ ట్రేడులు/విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా, ట్రేడ్ అప్రెంటిస్‌ల భర్తీ దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 2500
» **సెక్టార్ల వారీగా ఖాళీలు:** నార్తర్న్ సెక్టార్-159, ముంబై సెక్టార్-436, వెస్టర్న్ సెక్టార్-732, ఈస్టర్న్ సెక్టార్-593, సదరన్ సెక్టార్-378, సెంట్రల్ సెక్టార్-202.
» **అర్హత:** పదో తరగతి, పన్నెండో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ట్రేడులు/విభాగాలు:** అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సెక్రటేరియల్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, సివిల్ ఎగ్జిక్యూటివ్, పెట్రోలియం ఎగ్జిక్యూటివ్, ఆఫీస్ అసిస్టెంట్, ఫైర్ సేఫ్టీ టెక్నీషియన్, ఫిట్టర్, మెకానిక్, డీజిల్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, స్టోర్ కీపర్, మెషినిస్ట్, సర్వేయర్ తదితరాలు.
» **వయసు:** 20.09.2023 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8000, ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.7000.
» **ఎంపిక విధానం:** అర్హత పరీక్షలో సాధించిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పనిచేయాల్సిన ప్రదేశం:** డెహ్రాడూన్, మెహసానా, జోర్హాట్, నజీరా అండ్ శివసాగర్, సిల్చార్, చెన్నై, కాకినాడ, కరైకాల్, రాజమండ్రి, అగర్తల, కోల్‌కతా, ఢిల్లీ, జోధ్‌పూర్, గోవా, హజీరా, ముంబై, ఉరాన్, అహ్మదాబాద్, అంకలేశ్వర్, బరోడా, బొకారో,కాంబే.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.09.2023
» **ఫలితాల వెల్లడి తేది:** 05.10.2023
» **వెబ్‌సైట్:** www.ongcindia.com

ఏపీ సివిల్ సప్లైస్, పార్వతీపురంలో 570 పోస్టులు

పార్వతీపురంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్ జిల్లా కార్యాలయం.. పార్వతీపురం మన్యం జిల్లాలో ధాన్య సేకరణకు సంబంధించి రెండు నెలల కాలానికి ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 570
» **పోస్టుల వివరాలు:** టెక్నికల్ అసిస్టెంట్-190, డేటాఎంట్రీ ఆపరేటర్-190, హెల్పర్-190.

అర్హత

» **టెక్నికల్ అసిస్టెంట్:** బీఎస్సీ(అగ్రికల్చర్/మైక్రోబయాలజీ /బయోకెమిస్ట్రీ/ బయోటెక్నాలజీ)/బీఎస్సీ(బీజెడ్‌సీ)/బీఎస్సీ(లైఫ్ సైన్సెస్) /డిప్లొమా(అగ్రికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **డేటా ఎంట్రీ ఆపరేటర్:** ఏదైనా డిగ్రీతో పాటు పీజీడీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **హెల్పర్:** 8, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** టీఏ/డీఈవో పోస్టులకు 21 నుంచి 40 ఏళ్లు, హెల్పర్‌కు 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కులు, పని అనుభవం, అదనపు విద్యార్హతలు (టీఏ/డీఈవో పోస్టులకు) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** నోటిఫికేషన్ ప్రకారం నిర్ణీత నమూనాలో ఆఫ్‌లైన్ దరఖాస్తులను సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను జతచేసి రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా డిస్ట్రిక్ట్ సివిల్ సప్లైస్ మేనేజర్ ఆఫీస్, ఏపీ పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం, సబ్ కలెక్టరేట్ కాంపౌండ్, పార్వతీపురం, పార్వతీపురం మన్యం జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 11.09.2023.
» **వెబ్‌సైట్:** parvathipurammanyam.ap.gov.in

ఎస్‌బీఐలో.. అప్రెంటీస్ మేళా

ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిరుద్యోగ యువతకు చక్కటి అవకాశం కల్పిస్తోంది. మొత్తం 6,610 అప్రెంటీస్ ట్రైనీ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులను అప్రెంటీస్‌లుగా నియమించుకుని బ్యాంకింగ్ రంగంలో కెరీర్‌కు అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ అప్రెంటీస్ ట్రైనీ నోటిఫికేషన్ వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..

» 6,160 అప్రెంటీస్ నియామకాలకు ఎస్‌బీఐ నోటిఫికేషన్
» ఆంధ్రప్రదేశ్‌లో 390, తెలంగాణలో 125 ఖాళీలు
» ఎంపికైతే నెలకు రూ.15 వేల స్టయిఫండ్
» బ్యాంకులో జూనియర్ అసోసియేట్ పోస్టుల్లో ప్రాధాన్యం
» బ్యాంకింగ్ కెరీర్ అభ్యర్థులకు చక్కటి అవకాశం


స్కిల్ డెవలప్‌మెంట్

మొత్తం అప్రెంటీస్ ఖాళీలు 6,160

ఎస్‌బీఐ అప్రెంటీస్ తాజా నోటిఫికేషన్ ప్రకారం -జాతీయ స్థాయిలో మొత్తం 6,160 అప్రెంటీస్ ట్రైనీలను నియమించనుంది. రాష్ట్రాల వారీగా, ఆయా రాష్ట్రాల్లో జిల్లాల వారీగా అప్రెంటీస్ పోస్టుల సంఖ్యను పేర్కొంది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి.. ఆంధ్రప్రదేశ్‌లో 390 పోస్టులు, తెలంగాణలో 125 పోస్టులు అందుబాటులో ఉన్నాయి.

అర్హతలు

- 2023, ఆగస్ట్ 1 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 01.08.2023 నాటికి 20 - 28 ఏళ్ల ఉండాలి.
- రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల ప్రకారం వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రూ.15వేల స్టయిపెండ్

అప్రెంటీస్ ట్రైనీగా నియమితులైన అభ్యర్థులు వారికి కేటాయించిన బ్రాంచ్‌లలో ఏడాది పాటు ట్రైనీగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ సమయంలో నెలకు రూ.15 వేలు చొప్పున స్టయిపెండ్ అందిస్తారు.

రాత పరీక్ష ద్వారా ఎంపిక

ఎస్‌బీఐ అప్రెంటీస్ ట్రైనీలను ఎంపిక చేసేందుకు రాత పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా అప్రెంటీస్ ట్రైనీగా నియామకం ఖరారు చేస్తారు. అభ్యర్థులు తాము ఏ రాష్ట్రానికి దరఖాస్తు చేసుకుంటున్నారో.. ఆ రాష్ట్రానికి నిర్దేశించిన భాషలో పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది. ఏపీ, తెలంగాణ విద్యార్థులు తెలుగు, ఉర్దూ భాషలో పరీక్షకు హాజరు కావచ్చు.

100 మార్కులకు రాత పరీక్ష

ఎస్‌బీఐ అప్రెంటీస్ ట్రైనీ రాత పరీక్షను నాలుగు విభాగాల్లో 100 ప్రశ్నలు-100 మార్కులకు నిర్వహిస్తారు. జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు -25 మార్కులకు; జనరల్ ఇంగ్లిష్ 25 ప్రశ్నలు-25 మార్కులకు; క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 25 ప్రశ్నలు-25 మార్కులకు; రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ అప్టిట్యూడ్ 25 ప్రశ్నలు-25 మార్కులకు పరీక్ష జరుగుతుంది.పరీక్ష సమయం 60నిమిషాలు.

పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది. మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్ అడుగుతారు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు లభిస్తుంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4వంతు మార్కు తగ్గిస్తారు.

ప్రాంతీయ భాష పరీక్ష కూడా

ఎస్‌బీఐ అప్రెంటీస్ నియామక ప్రక్రియలో రాత పరీక్షతో పాటు అభ్యర్థులు ప్రాంతీయ భాష పరీక్షలోనూ ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. రాత పరీక్షలో మార్కుల ఆధారంగా మెరిట్ జాబితాలో నిలిచిన వారికి ఈ ప్రాంతీయ భాష పరీక్ష నిర్వహిస్తారు. ఇందుకోసం అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న ప్రాంతీయ భాషను ఎంచుకోవాలి. పదో తరగతి, ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో సదరు ప్రాంతీయ భాషను అభ్యసించి ఉంటే వారికి పరీక్ష నుంచి మినహాయింపు లభిస్తుంది. ఆన్‌లైన్ పరీక్షతోపాటు ప్రాంతీయ భాషలోనూ ఉత్తీర్ణత సాధించి ఫైనల్ మెరిట్ లిస్ట్‌లో నిలిచిన అభ్యర్థులకు తుది దశలో మెడికల్ టెస్ట్ నిర్వహించి అప్రెంటీస్ ట్రైనీగా నియామక పత్రం అందిస్తారు.

ట్రేడ్ టెస్ట్

ఏడాది వ్యవధిలోని అప్రెంటీస్ ట్రెనింగ్ పూర్తి చేసుకున్న వారికి.. స్కిల్ ఎవాల్యుయేషన్ టెస్ట్ పేరుతో ట్రేడ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఎస్‌బీఐ-ఎన్ఎస్‌డీసీ/బీఎఫ్ఎస్ఐ-సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌లు సంయుక్తంగా అప్రెంటీస్‌షిప్ సర్టిఫికెట్ అందిస్తారు. ఈ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారినే అప్రెంటీస్ పూర్తి చేసుకున్న వారిగా పరిగణిస్తారు.

కెరీర్ అవకాశాలు

- ఎస్‌బీఐలో అప్రెంటీస్ ట్రెనింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి.. బ్యాంకు చేపట్టే జూనియర్ అసోసియేట్స్ నియామకాల్లో ప్రాధాన్యం ఇస్తారు. అప్రెంటీస్ ట్రైనీ సమయంలో చూపిన ప్రతిభ, పనితీరు వంటి వాటిని పరిశీలించి ప్రతి ఒక్క అప్రెంటీస్‌కు సంబంధించి ప్రత్యేక రికార్డ్ నిర్వహిస్తారు.
- ఎస్‌బీఐ అప్రెంటీస్ ట్రైనీగా శిక్షణ పొందిన వారికి భవిష్యత్తులో బ్యాంకింగ్ రంగంలో ఉజ్వల కెరీర్ సొంతం చేసుకునేందుకు ఆస్కారం లభించనుంది. ఎందుకంటే.. ప్రముఖ బ్యాంకులో శిక్షణ పొందిన వారికి ప్రైవేటు రంగ బ్యాంకులు నియామకాల్లో ప్రాధాన్యం ఇస్తుంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 21.09.2023
- **రాత పరీక్ష:** అక్టోబర్/నవంబర్‌లో నిర్వహించే అవకాశం.
- **తెలుగు రాష్ట్రాల్లో రాత పరీక్ష కేంద్రాలు:** **ఆంధ్రప్రదేశ్:** చీరాల, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://bank.sbi./careers, https://www.sbi.co.in/careers

విజయం సాధించండిలా

- **జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్:** ఈ విభాగంలో రాణించాలంటే.. తాజా బ్యాంకింగ్ రంగం పరిణామాలు, విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించి చట్టాలు, రిజర్వ్ బ్యాంకు విధులు వంటి వాటిపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలి. జనరల్ అవేర్‌నెస్‌లో కరెంట్ అఫైర్స్, స్టాక్ జనరల్ నాలెడ్జ్ కోణంలోనూ ఆర్థిక సంబంధ వ్యవహారాలు(ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- **ఇంగ్లిష్ లాంగ్వేజ్:** ఈ విభాగంలో ఇడియమ్స్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్‌పై పట్టు సాధించాలి. గ్రామర్‌కే పరిమితం కాకుండా.. జనరల్ ఇంగ్లిష్ నైపుణ్యం పెంచుకోవాలి. ఇందుకోసం ఇంగ్లిష్ దినపత్రికలు చదవడం, వాటిలో వినియోగిస్తున్న పదజాలం, వాక్య నిర్మాణం వంటి వాటిపై దృష్టి పెట్టాలి.
- **క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్:** దీనికి సంబంధించి అర్థమెటిక్ అంశాలు(పర్సంటేజెస్, నిష్పత్తులు, లాభ-నష్టాలు, నంబర్ సిరీస్, బాడ్‌మాస్ నియమాలు)పై పట్టు సాధించేలా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా అనాలిసిస్‌లపై ఫోకస్ చేయాలి.
- **రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ అప్టిట్యూడ్:** రీజనింగ్‌లో మంచి మార్కుల సాధనకు కోడింగ్-డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్స్, సిలాజిజమ్ విభాగాలను ప్రాక్టీస్ చేయాలి. కంప్యూటర్ ఆప్టిట్యూడ్ విభాగంలో రాణించాలంటే.. కంప్యూటర్ ఆపరేషన్ సిస్టమ్స్, కంప్యూటర్ స్ట్రక్చర్, ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై దృష్టి పెట్టాలి. కీ బోర్డ్ షాట్ కట్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ సంబంధిత అంశాలు(సీపీయూ, మానిటర్, హార్డ్ డిస్క్ తదితర) గురించి తెలుసుకోవాలి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
333	93
66,599	19,820

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శనివారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,762	▲	13
డోజోన్స్	34,576	▲	76
ఎఫ్‌టీఎస్ఈ 100	7,478	▲	36
డాక్స్	15,740	▲	22
షాంఘై	3,117	▽	6
నికాయ్	32,607	▽	384

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.39	84.06
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	102.32	105.69
€	యూరో	ఒకటి	87.65	90.76
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.67	57.41
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.06	54.36
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.07	61.98
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.16	22.79
UAE D	యూఏఈ దిర్హమ్	ఒకటి	21.69	23.48
¥	చైనా యువాన్	ఒకటి	10.18	12.25

సంపద సృష్టికి సక్సెస్ మార్గం!

- అన్నింటికంటే పొదుపు ముఖ్యం
- లక్ష్యం, ఆకాంక్షల మేరకు పెట్టుబడులు
- వివిధ సాధనాల మధ్య అస్సెట్ అలోకేషన్
- రిస్క్ తెలుసుకుని అడుగులు వేయాలి
- ఇతరులను గుడ్డిగా అనుసరించొద్దు
- నిపుణుల సాయం తప్పనిసరి

పొదుపు మొత్తాన్ని పెట్టుబడిగా మలిచి, మంచి రాబడి తెచ్చుకోవాలని అందరూ కోరుకుంటారు. కానీ, ఈ విషయంలో సక్సెస్ చూసే వారు కొద్ది మందే ఉంటారు. పెట్టుబడి అనేది వాస్తవిక దృక్పథం, విస్తృతమైన అధ్యయనం, సమాచార విశ్లేషణ ఆధారంగానే ఉండాలి. లేదంటే.. చిన్న తప్పులకే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఎంతగా అధ్యయనం చేసినప్పటికీ, ఒక్క తప్పు దొర్లినా ఆశించిన ఫలితం రాకుండా పోతుంది. అందుకే మంచి రాబడి కోసం పెట్టుబడి ఉంటే చాలదు. అనుసరించే మార్గం తెలియాలి. ఇన్వెస్టర్‌గా ఎలాంటి తప్పులు చేయకూడదనే అవగాహన కలిగి ఉండాలి. నువమా వెల్త్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ ప్రెసిడెంట్ రాహుల్ జైన్ పెట్టుబడుల విషయంలో ఎలాంటి తప్పులకు దూరంగా ఉండాలనే విషయాల గురించి వెల్లడించారు.



గుడ్లు అన్నింటినీ ఒక్కటే బుట్టలో పెట్టేయకూడదన్న సూత్రం తెలిసే ఉంటుంది. అలాగే పెట్టుబడులు అన్నింటికీ తీసుకెళ్లి ఒకే సాధనంలో ఉంచేయకూడదు. ఎందుకంటే ఆయా విభాగం నిర్ణీత కాలం పాటు ప్రతికూల పనితీరు చూపించినట్టయితే పోర్ట్‌ఫోలియో విలువపై (పెట్టుబడులు) ప్రభావం పడుతుంది. నష్టాలు కనిపిస్తాయి. అందుకే పెట్టుబడు

అస్సెట్ అలోకేషన్

లను వివిధ సాధనాల (అస్సెట్ క్లాసెస్) మధ్య వర్గీకరించుకోవాలి. దీనివల్ల ప్రత్యేకంగా ఒక్కో విభాగంలో ఉండే రిస్క్‌ను అధిగమించే అవకాశం ఉంటుంది. వైవిధ్యం చేసుకోవడం వల్ల వివిధ విభాగాల్లో ఏదైనా ఒకటి రెండు ప్రతికూల ఫలితాలు చూపించినా, అదే కాలంలో మిగిలిన విభాగాల్లో మెరుగైన పనితీరు నుంచి ప్రయోజనాన్ని పొందొచ్చు. తగినంత వైవిధ్యం కోసం పెట్టుబడులను ఈక్విటీ, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ (డెట్), కమోడిటీ, రియల్ ఎస్టేట్ బంగారం మధ్య విస్తరించుకోవాలి. ఇలా చేయడం వల్ల వీటిల్లో ఏదైనా ఒకటి రెండు విభాగాలు ప్రతికూలతలు ఎదురు చూసినా, మిగిలినవి ఆదుకుంటాయి.

సరైన పెట్టుబడి సాధనం..

ఆర్థిక మార్కెట్లు ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతూనే ఉంటాయి. మార్కెట్ పరిస్థితులు, ఆర్థిక, భౌగోళిక అంశాలు వివిధ పెట్టుబడి సాధనాల పనితీరును ప్రభావితం చేస్తుంటాయి. కనుక సరైన లేదా కచ్చితమైన పెట్టుబడి సాధనం కోసం అన్వేషించడం అనేది అవకాశాలను కోల్పోయేందుకు దారితీయవచ్చు. పరిమితికి మించి సమాచారాన్ని మెదడులోకి చేర్చుకోవడం వల్ల నిర్ణయాల్లో జాప్యానికి దారితీస్తుంది. దీంతో అనుకూలమైన పెట్టుబడి అవకాశాలను కోల్పోవాల్సి రావచ్చు. అందుకే ఇన్వెస్టర్లు తమ లక్ష్యాలు, రిస్క్ సామర్థ్యాలకు అనుకూలమైన పెట్టుబడి సాధనాన్ని ఎంపిక చేసుకుని ఇన్వెస్ట్ చేయాలి.

టిప్స్‌ను ఫాలో అవ్వడం..

నేడు సోషల్ మీడియాలో సలహాలిచ్చే వారు కోకొల్లలు కనిపిస్తుంటారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, టెలీగ్రామ్, యూట్యూబ్‌లో భారీ సంఖ్యలోనే అకౌంట్లు ఉన్నాయి. వేగంగా లాభాలు సంపాదించాలనే ఆశే ఇన్వెస్టర్లను నష్టపోయేలా చేస్తుంటుంది. టిప్స్ సాయంతో త్వరగా పెట్టుబడిని రెట్టింపు చేసుకోవాలనే ధోరణి ఇక్కడ పనికిరాదు. పెట్టుబడి ప్రపంచం ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక రాజకీయాలు, టెక్నాలజీలో పురోగతి తదితర ఎన్నో అంశాలు మార్కెట్లను ప్రభావితం చేస్తుంటాయి. వీటిని ఎవరూ కచ్చితంగా అంచనా వేయలేరు. కనుక పెట్టుబడుల విషయంలో స్వీయ అప్రమత్తత, అవగాహన అవసరం. అవసరమైతే నిపుణుల సాయం తీసుకోవాలే కానీ, ఉచిత టిప్స్‌ను అనుసరించడం సురక్షితం కాదు.

లక్ష్యం లేకుండా..

పెట్టుబడికి లక్ష్యం ఉండాలి. లక్ష్యం లేకపోతే అది చుక్కాని లేని నావ మాదిరే అవుతుంది. మీరు ఎందుకు ఇన్వెస్ట్ చేస్తున్నారనేది మీకు తెలిసి ఉండాలి. లక్ష్యం తెలిసినప్పుడే చేసే పెట్టుబడి ఆశించిన రాబడులు ఇస్తుంది. వివిధ లక్ష్యాలకు భిన్నమైన పెట్టుబడి వ్యూహాలు అవసరం పడొచ్చు. మీ పెట్టుబడుల విధానానికి మీ లక్ష్యం బ్లూప్రింట్ మాదిరిగా పనిచేస్తుంది. మీ లక్ష్యాలను స్వల్పకాలం, మధ్యకాలం, దీర్ఘకాలం అని మూడు భాగాలుగా వర్గీకరించుకోవాలి. నెలల నుంచి గరిష్ఠంగా రెండు సంవత్సరాల కాలానికి సంబంధించినవి స్వల్పకాల లక్ష్యాల కిందకు వస్తాయి. అత్యవసర నిధి, సెలవుల్లో పర్యటనలకు కావాల్సినది సమకూర్చుకోవడం ఇలాంటివి స్వల్పకాల లక్ష్యాలు అవుతాయి. 2–5 ఏళ్ల కాల అవసరాలు మధ్యకాలిక లక్ష్యాల కిందకు వస్తాయి. ఇల్లు లేదా కారు కొనుగోలుకు కావాల్సిన డౌన్ పేమెంట్ సమకూర్చుకోవడం వంటివి మధ్యకాల లక్ష్యాలు అవుతాయి. ఇక 10–20 ఏళ్లు అంతకుమించిన కాలానికి ఉద్దేశించినవి దీర్ఘకాల లక్ష్యాల కిందకు వస్తాయి. పిల్లల ఉన్నత విద్య, రిటైర్మెంట్ లక్ష్యాలు దీర్ఘకాలానికి సంబంధించినవి అవుతాయి. ఈ లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడి సాధనాలను ఎంపిక చేసుకోవాలి. స్వల్పకాలం, మధ్యకాలానికి సంబంధించి పెట్టుబడులను ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలు అయిన బ్యాంక్ ఎఫ్‌డీలు, కార్పొరేట్ బాండ్లు, ఎన్‌సీడీల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. దీర్ఘకాల లక్ష్యాల కోసం ఉద్దేశించిన పెట్టుబడులను మ్యూచువల్ ఫండ్స్, స్టాక్స్, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల మధ్య వర్గీకరించుకోవచ్చు. మీ ఆదాయం, రుణ బాధ్యతలు, రిస్క్ సామర్థ్యం ఆధారంగా అనుకూలమైన సాధనాలను ఎంపిక చేసుకోవాలి. ఇందుకోసం ఫైనాన్షియల్ అడ్వైజర్ సాయం తీసుకోవాలి.

కాంపౌండింగ్

పెట్టుబడులకు కాలం కూడా కీలకమే. ఎంత ఎక్కువ వ్యవధి ఉంటే అంత అధికంగా అది కాంపౌండింగ్ (వృద్ధి) అవుతుంది. కాంపౌండింగ్ అంటే పెట్టుబడిపై వృద్ధి కాకుండా, రాబడి కూడా వృద్ధి చెందడం. దీన్ని రాబడిపై రాబడిగా చెబుతారు. ముందుగానే పెట్టుబడిని ఆరంభించడం వల్ల ఈ కాంపౌండింగ్ ప్రయోజనంతో దీర్ఘకాలంలో మంచి సంపదను సృష్టించుకోవచ్చు. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో మ్యూచువల్ ఫండ్ పథకంలో పెట్టుబడులు మొదలు పెట్టినా, కనీసం 5–10 ఏళ్లపాటు వాటిని కొనసాగించినప్పుడే కాంపౌండింగ్ ప్రయోజనం కనిపిస్తుంది. మధ్యలో నిలిపివేస్తే పూర్తి స్థాయిలో ఆ ఫలితం కనిపించదు. కాంపౌండింగ్ ప్రయోజనాన్ని పూర్తి స్థాయిలో పొందేందుకు ఎంతో ఓపిక, క్రమశిక్షణ అవసరం.

రిస్క్ అంతర్భాగం

పెట్టుబడుల్లో రిస్క్ అంతర్భాగంగా ఉంటుంది. ప్రతీ పెట్టుబడితోనూ వచ్చే రిస్క్‌ను అర్థం చేసుకున్నప్పుడే దాన్ని అధిగమించడం సాధ్యపడుతుంది. మార్కెట్ అనుసంధానిత సాధనం అయిన స్టాక్, ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసే ముందు వాస్తవ అంశాలను తెలుసుకోవాలి. కంపెనీల ఆర్థిక మూలాలు, క్రెడిట్ నాణ్యత ఇవన్నీ చూడాలి. మీ రిస్క్ సామర్థ్యం (అస్థిరతలను ఏ మేరకు భరించగలరు) గురించి తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యం. అధిక రిస్క్ తీసుకునేట్టు అయితే ఈక్విటీ ఆధారిత సాధనాల్లో ఇన్వెస్ట్ చేయవచ్చు.

తగినంత వ్యవధి

పెట్టుబడులకు తగినంత వ్యవధి ఇవ్వాలి. పెట్టుబడుల విజయానికి ఇది కీలకం అవుతుంది. నిర్ణీత కాలానికోసారి పెట్టుబడుల సమీక్షకు కొంత సమయం కేటాయించుకోవాలి. చాలా మంది ఇన్వెస్టర్లు కీలకమైన ఈ సమీక్షకు దూరంగా ఉంటుంటారు. ఫైనాన్షియల్ అడ్వైజర్‌ను కలసి పెట్టుబడుల విషయంలో వారి నుంచి కీలక సూచనలు తీసుకోవాలి. దీనివల్ల మీరు అనుసరిస్తున్న పెట్టుబడులు మీ లక్ష్యాలు, రిస్క్ సామర్థ్యానికి అనుగుణంగానే ఉన్నాయా? అన్నది తెలుసుకునే వీలు చిక్కుతుంది. పెట్టుబడులను సమీక్షించడం వల్ల మెరుగుపరుచుకునే అవకాశాలు, మార్పులు చేర్పులకు అవకాశం లభిస్తుంది. మారుతున్న మార్కెట్, ఆర్థిక పరిస్థితులను ఎదుర్కొనే విధంగా పెట్టుబడుల నిర్వహణ సాధ్యపడుతుంది. అవకాశాలను అందిపుచ్చుకుని, రిస్క్‌ను అధిగమించొచ్చు. లోపాలను ఆరంభంలోనే తొలగించుకోవచ్చు. కనుక ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఫైనాన్షియల్ అడ్వైజర్‌ను కలిసి సమీక్షించుకోవాలి.



పొదుపు చేయలేకపోవడం

తగినంత పొదుపు చేయడం పెట్టుబడులకు కీలకం. లేదంటే లక్ష్యాలకు కావాల్సినంత పెట్టుబడులు సమకూర్చుకోలేరు. పొదుపులో 50–30–20 బడ్జెట్ సూత్రాన్ని అనుసరించాలి. నెలవారీ నికర ఆదాయం నుంచి 50 శాతమే ఖర్చు చేయాలి. అది కూడా గ్రోసరీ, యుటిలిటీ, పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి అద్దె కోసం. ఇక 30 శాతాన్ని అత్యవసరం కాని రెస్టారెంట్ ఫుడ్, పర్యటనలు, గ్యాడ్జెట్ల కొనుగోలు, మూవీ తదితర వాటికి కేటాయించుకోవాలి. మరో 20 శాతాన్ని పొదుపు చేసి, దాన్ని పెట్టుబడిగా మార్చుకోవాలి.

ఇతరులను అనుసరించడం

మెజారిటీ ఇన్వెస్టర్లు సాధారణంగా ఇతరుల పెట్టుబడులను, నిర్ణయాలను అనుసరిస్తుంటారు. సరైన సమయంలో కొనుగోళ్లు, విక్రయాలు చేయడం కాకుండా, దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తుంటారు. ఒకే సమయంలో ఎక్కువ మంది ఏదైనా సాధనాన్ని అనుసరించినప్పుడు అక్కడ ధరలు కృత్రిమంగా పెరిగిపోతాయి. దీన్నే స్పెక్యులేషన్ బబుల్‌గా చెబుతారు. దీంతో ఆయా సాధనాల విలువలు ఖరీదుగా మారతాయి. దీంతో తదుపరి మార్కెట్ కరెక్షన్‌లో అవి ఎక్కువ నష్టాన్ని చూసే అవకాశాలు ఉంటాయి. ప్రతి ఇన్వెస్టర్ తనకుంటూ ఓ విధానాన్ని రూపొందించుకోవాలి. మార్కెట్ ధోరణులను అధ్యయనం చేయడం అలవాటు చేసుకోవాలి. తమ రిస్క్ సామర్థ్యం పరిధిలోనే పెట్టుబడుల నిర్ణయాలు ఉండాలి. తప్పిదాల నుంచి నేర్చుకున్న పాఠాలను ఆచరణలో పెట్టాలి.

నిపుణుల సాయం

చాలా మంది ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను తామే నిర్వహించుకోగలమని భావిస్తుంటారు. ఈ విషయంలో నిపుణుల సాయం తీసుకుంటే మెరుగైన ఫలితాలకు అవకాశం ఉంటుందని మర్చిపోవద్దు. ఫైనాన్షియల్ అడ్వైజర్లు, ప్లానర్లు, వెల్త్ మేనేజర్లు అందరూ ఫైనాన్షియల్ మార్కెట్ల పట్ల లోతైన విషయ పరిజ్ఞానంతో ఉంటారు. ఆధునిక ధోరణులు, ఆర్థిక, మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తుంటారు. దీనికి అనుగుణంగా పెట్టుబడుల విధానాల్లో మార్పులు చేస్తుంటారు. కనుక నిపుణుల సాయంతో రాబడిని మరింత పెంచుకునే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా మార్కెట్ పతనాల్లో నిపుణుల సాయం ఎంతో ఆదుకుంటుంది. మనో ధైర్యాన్ని, మెరుగైన మార్గాన్ని చూపుతుంది. వారి విలువైన సలహాలతో రిస్క్‌ను సులభంగా అధిగమించగలరు.

రెండు గ్రూప్ సంస్థల్లో అదానీ వాటాల పెంపు



న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తదనంతర పరిణామాల నేపథ్యంలో అదానీ గ్రూప్ కంపెనీల్లో ప్రమోటర్ సంస్థలు వాటాలను పెంచుకుంటున్నాయి. తాజాగా అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో వాటాలను 69.87 శాతం నుంచి 71.93 శాతానికి, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్‌లో (ఏపీసెజ్) 63.06 శాతం నుంచి 65.23 శాతానికి పెంచుకున్నాయి. ప్రమోటర్ గ్రూప్‌నకు చెందిన రిసర్జెంట్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఏపీసెజ్‌లో దాదాపు ఒక్క శాతం వాటాలను, ఎమర్జింగ్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ డీఎంసీసీ 1.2 శాతం కొనుగోలు చేశాయి. అలాగే, అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో వాటాలను కెంపాస్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్, ఇన్ఫినిట్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కొనుగోలు చేశాయి. ఆగస్టు 14 నుంచి సెప్టెంబర్ 8 మధ్యలో ఈ లావాదేవీలు జరిగాయి. అదానీ గ్రూప్ కంపెనీల ఖాతాలు, షేర్లలో అవకతవకలు జరిగాయంటూ అమెరికన్ హెడ్జ్ ఫండ్ హిండెన్‌బర్గ్ ఆరోపణలు చేయడం, ఆ దెబ్బతో అదానీ గ్రూప్ సంస్థల షేర్లు కుప్పకూలడం తెలిసిందే. ఆ తర్వాత నుంచి అదానీ గ్రూప్ క్రమంగా మళ్లీ కోలుకుంటోంది. జీక్యూజీ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు గ్రూప్ సంస్థల్లో ఇన్వెస్ట్ చేస్తున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-9-2023	
విశాఖ	505–00
చిత్తూరు	493–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505–00
విజయవాడ	505–00
రిటైల్ ధర (డజను)	72.00
10-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	465–00
వరంగల్	467–00
రిటైల్ ధర	5.25

స్టాక్స్ వ్యూ

ఎల్అండ్‌టీ — ఐసీఐసీఐ సెక్యూరిటీస్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 2,900
టార్గెట్: రూ. 3,141



ఎందుకంటే: సౌదీ అరేబియాకు చెందిన జాఫురా సాంప్రదాయేతర గ్యాస్ క్షేత్రం అభివృద్ధికి సంబంధించి 3.9 బిలియన్ డాలర్ల ఆర్డర్‌కు ప్రాధాన్య కాంట్రాక్టర్‌గా ఎల్అండ్‌టీని ఎంచుకున్నట్టు తాజా వార్తలు వెలువడ్డాయి. అంతేకాకుండా, 2023–24లో ఇప్పటిదాకా కంపెనీ చేతిలో రూ. 75,000 కోట్ల ఆర్డర్లు ఉన్నాయి. ఈ జోరుతో ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (క్యూ2)లో కూడా 20% ఆర్డర్ల వృద్ధి ఉండొచ్చని మేము అంచనా వేస్తున్నాం. మధ్య ప్రాచ్యంలో హైడ్రోకార్బన్స్ వ్యాపారంలో మెరుగైన అంచనాల నేపథ్యంలో త్రైమాసికంగా తమ ఆర్డర్లు మెరుగ్గానట్లు కూడా ఎల్అండ్‌టీ వెల్లడించింది. అయితే, 2023–24 పూర్తి ఏడాదికి ఆర్డర్ల రాక వృద్ధి అంచనాలు వార్షికంగా 15 శాతంగా ఉండొచ్చని చెబుతోంది. తాజా భారీ ఆర్డర్‌తో సహా ప్రస్తుత ఇన్‌ఫ్లోను చూస్తే, కంపెనీ తన అంచనాలను అధిగమించే అవకాశం కనిపిస్తోంది. అంతేకాకుండా 2023–24 క్యూ1లో భారీ స్థాయిలో షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించడం ద్వారా మైనారిటీ వాటాదారులకు మరింత మెరుగైన రాబడి అందించడంపై కంపెనీ దృష్టి సారించడం కూడా షేరుకు దన్నుగా నిలిచే అంశం. రిటర్న్ ఆన్ ఈక్విటీ (ఆర్ఓఈ) మధ్యకాలికంగా 200 బేసిస్ పాయింట్లు (2%) మెరుగుపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 2024–25 నికర లాభం అంచనాలను పెంచుతున్నాం. ఈ ఆర్థిక సంవత్సరం తొలి రెండు క్వార్టర్లలో పటిష్టమైన వరుస ఆర్డర్లు, ఆర్ఓఈ మెరుగుదల అంచనాలు, షేర్ల బైబ్యాక్ వంటి అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని ఈ షేరును కొనొచ్చని సిఫార్సు చేస్తున్నాం.


ఇక్రా — యస్ సెక్యూరిటీస్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 5,780
టార్గెట్: రూ. 6,700

ఎందుకంటే: ఇక్రా ప్రస్తుతం అందిస్తున్న రేటింగ్స్ కార్యకలాపాలలో ప్రధానంగా అయిదు అంశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. రంగాల వారీగా మరింత దృష్టి కేంద్రీకరిస్తూ రేటింగ్స్ టీమ్ స్వరూపాన్ని పునర్వ్యవస్థీకరించడం, కీలక రంగాలకు సంబంధించిన వ్యాపార అభివృద్ధి టీమ్‌లకు కొత్త రూపు ఇవ్వడం, పటిష్టమైన రేటింగ్స్ పనితీరు అలాగే కాలానుగుణంగా తగిన చర్యలు చేపట్టడం, రెమ్యూనరేటివ్ అలాగే సరైన ప్రైసింగ్/ఈల్డ్‌లపై దృష్టి పెట్టడం, ఇక చివరిగా వేగంగా వృద్ధి చెందుతున్న రంగాల్లో (సెక్యూరిటైజేషన్, ఇన్‌ఫ్రా, ఫైనాన్షియల్‌తో సహా), బాండ్ రేటింగ్స్‌లో అంతర్గత బలం (మార్కెట్లో దిగ్గజ స్థానం) వీటిలో ఉన్నాయి. 2021–23 ఆర్థిక సంవత్సరంలో టర్న్‌అరౌండ్ అయిన తర్వాత ఇక్రా ఆదాయ వృద్ధి పటిష్టమవుతూ వస్తోంది. 2022–23లో 14 శాతం వృద్ధి, 2023–24 తొలి క్వార్టర్‌లో 16 శాతం వృద్ధి నమోదైంది. వాల్యూమ్ వాటాపై కాకుండా ఆదాయ వాటాపై దృష్టిసారించేలా అనుసరిస్తున్న సరైన వ్యాపార విధానం, అన్ని రంగాలు/వినియోగదారుల వ్యాప్తంగా ప్రైసింగ్ మెరుగుదల అలాగే ఉద్యోగ వ్యయం పెరుగుదలను సరిగ్గా బదలాయించడం వంటివి వృద్ధికి దన్నుగా నిలుస్తున్నాయి. ఫైనాన్షియల్, ఇన్‌ఫ్రా రంగాల్లో జోరు కొనసాగుతుండటం, పెట్టుబడి వ్యయాలు పుంజుకోవడం, 12–18 నెలలుగా రేట్లు దిగొస్తున్న నేపథ్యంలో రేటింగ్స్ వృద్ధి కూడా స్థిరంగా నిలదొక్కుకోనుంది. రానున్న రెండేళ్లలో స్థిరమైన రేటింగ్స్ వృద్ధి, ఎనలిటిక్స్‌లో ఓ మోస్తరు వృద్ధితో పాటు మార్జిన్లు మెరుగ్గానే ఉంటాయని భావిస్తున్నాం. 2023–2025 ఆర్థిక సంవత్సరాల్లో ఆదాయం/ఎబిటా/నికర లాభంలో చక్రీయగతిన 14%/17%/18% వృద్ధిని పరిగణనలోకి తీసుకొన్ని మేము తాజా టార్గెట్ ధరను నిర్ణయించాము.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

దీర్ఘకాలం పెట్టుబడులకు అనువైన సాధనం?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

దీర్ఘకాలం కోసం లార్జ్‌క్యాప్ లేదా ఫ్లెక్సీక్యాప్ పథకాల్లో ఏ విభాగం మెరుగ్గా ఉంటుంది?

- సుశాంత్

దీర్ఘకాలంలో సంపద సృష్టించుకోవాలని అనుకుంటే పోర్ట్‌ఫోలియోలో ఈక్విటీ ఆధారిత పెట్టుబడులు చెప్పుకోతగ్గ స్థాయిలో ఉండాలి. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో కొన్ని ఉప విభాగాలు కూడా ఉన్నాయి. అందులో లార్జ్‌క్యాప్ ఫండ్స్, ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ భాగం. లార్జ్‌క్యాప్ పథకాలు లార్జ్‌క్యాప్ (పెద్ద మార్కెట్ విలువ) కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేస్తాయి. చిన్న ఇన్వెస్టర్లు తమ దగ్గరున్న పరిమిత పెట్టుబడులతో విడిగా లార్జ్‌క్యాప్ స్టాక్స్‌ను ఎక్కువగా (ఒకటికి మించి కంపెనీలు) కొనుగోలు చేయలేరు. అటువంటి వారు ఒక లార్జ్‌క్యాప్ పథకం ద్వారా ఎక్కువ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టుకునేందుకు వీలుంటుంది. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ అలా కాదు. వివిధ మార్కెట్ విలువ కలిగిన (లార్జ్, మిడ్, స్మాల్) కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. లార్జ్‌క్యాప్ మాదిరిగా ఏదో ఒక మార్కెట్ విలువకే పరిమితం కావు. వివిధ రంగాల్లోని, వివిధ స్థాయి కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. పన్ను పరంగా చూస్తే ఈ రెండు ఈక్విటీ పథకాలే కనుక ఒకే మాదిరి ఉంటుంది. ఏడాది లోపు లాభాలపై 15 శాతం, ఏడాది మించిన లాభాలపై (రూ.ఒక లక్ష తర్వాత) 10 శాతం పన్ను పడుతుంది. 2013 నుంచి లార్జ్‌క్యాప్, ఫ్లెక్సీక్యాప్ విభాగాల్లో చెరో రూ.10,000 చొప్పున సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేసి ఉంటే, 2022 జూన్ నాటికి రూ.11.60 లక్షల మొత్తం పెట్టుబడి పెట్టి ఉంటారు. కానీ, రాబడుతో కలిపి మొత్తం నిధి ఫ్లెక్సీక్యాప్‌లో రూ.24.63 లక్షలు అయి ఉండేది. అదే లార్జ్‌క్యాప్‌లో రూ.22.78 లక్షలు సమకూరేది. అంటే ఫ్లెక్సీక్యాప్ విభాగం రూ.1.84 లక్షల అధిక రాబడి ఇచ్చింది. లార్జ్‌క్యాప్, ఫ్లెక్సీక్యాప్ రెండూ పూర్తిగా ఈక్విటీల్లోనే పెట్టుబడులు పెడతాయి. కనుక అస్థిరతలు ఉంటాయని మర్చిపోవద్దు. మార్కెట్లలో ఆటుపోట్లను, స్టాక్ మార్కెట్ పనిచేసే తీరును అర్థం చేసుకున్న వారికి ఇవి అనుకూలం. కేవలం లార్జ్‌క్యాప్ కంపెనీలకే ఎక్కువ ప్రాధాన్యం కోరుకునే వారు లార్జ్‌క్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. దాదాపు ఇన్వెస్టర్లు అందరికీ లార్జ్ క్యాప్ అనుకూలం. మార్కెట్లో ఏ విభాగంలో అయినా ఇన్వెస్ట్ చేసే సౌలభ్యంతో ఉండేవి ఫ్లెక్సీక్యాప్ పథకాలు. కొంచెం అదనపు రిస్క్ తీసుకునే వారికి అనుకూలం. పేరులో ఉన్నట్టు.. మార్కెట్‌లో ఎక్కడ అనుకూల అవకాశాలు ఉంటే అక్కడికి పెట్టుబడులు మళ్లించే వెసులుబాటు ఫ్లెక్సీక్యాప్ పథకాలకు ఉంటుంది. కానీ, లార్జ్‌క్యాప్ పథకాలకు ఈ స్వేచ్ఛ ఉండదు. కనుక వైవిధ్యం కోరుకునే వారికి ఫ్లెక్సీక్యాప్ అనుకూలం. కనీసం ఐదేళ్లు, అంతకుమించి కాలానికి వీటిల్లో ఇన్వెస్ట్ చేసినప్పుడే అసలైన రాబడులు కనిపిస్తాయి. అందుకని పెట్టుబడుల లక్ష్యాలు, రిస్క్ ఎంత మేరకు తీసుకోగలరు, ఎంత కాలం పెట్టుబడి పెట్టగలరనే అంశాల ఆధారంగా వీటిల్లో ఒకటి ఎంపిక చేసుకోవాలి. సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవడం మెరుగైన మార్గం అవుతుంది.

షార్ట్ డ్యురేషన్ ఫండ్, బంగారం వీటిల్లో ఏది మెరుగైనది?

- రాజేంద్రన్

వడ్డీ రేట్లు పెరుగుతున్న తరుణంలో బంగారం స్థిరంగా ఉండడమే కాకుండా, రాబడినిస్తుంది. అనిశ్చిత పరిస్థితుల్లో ఇది సురక్షిత సాధనం. అయితే, ఇది సిద్ధాంతం మాత్రమే. నిజానికి బంగారంలోనూ ఎన్నో అస్థిరతలు ఉంటాయని నిరూపితమైంది. ఎన్నో కారణాలు ఈ అస్థిరతలకు దోహదం చేస్తుంటాయి. ఇందులో ఒకటి డిమాండ్-సరఫరా. పైగా బంగారం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీ ఒకటి. మన దేశం పెద్ద ఎత్తున ఏటా బంగారం దిగుమతి చేసుకుంటోంది. అనుత్పాదక సాధనం కనుక బంగారం దిగుమతులను నిరుత్సాహపరిచేందుకు ప్రభుత్వం సుంకాలను విధిస్తుంటుంది. ఇవి ధరలపై ప్రభావం చూపిస్తాయి. కనుక స్వల్ప కాలం కోసం అల్ట్రా షార్ట్ డ్యురేషన్ డెట్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. పెరుగుతున్న వడ్డీ రేట్ల సైకిల్‌ను అధిమించడానికి ఇదే మెరుగైన మార్గం అవుతుంది.

నూరు శాతం నగదు రహిత హెల్త్ క్లెయిమ్

బీమా కంపెనీలతో ఐఆర్‌డీఏఐ చర్చలు



ముంబై: పాలసీదారులు త్వరలోనే నూరు శాతం నగదు రహిత వైద్య సదుపాయం పొందేందుకు వీలుగా బీమా సంస్థలతో కలసి పనిచేస్తున్నట్టు బీమా రంగ అభివృద్ధి, నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) ప్రకటించింది. నూరు శాతం క్యాష్‌లెస్ క్లెయిమ్ పరిష్కారాల కోసం బీమా సంస్థలు, నేషనల్ హెల్త్ అథారిటీ, బీమా కౌన్సిల్‌తో చర్చిస్తున్నట్టు ఐఆర్‌డీఏఐ చైర్మన్ దేవాశిష్ పాండా వెల్లడించారు. ముంబైలో జరుగుతున్న ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో భాగంగా ఆయన ఈ అంశంపై మాట్లాడారు. పాలసీదారులు నగదు రహిత చికిత్సలు పొందే విషయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పాండా దీన్ని ప్రస్తావించడం గమనార్హం. క్లెయిమ్ మొత్తంలో బీమా సంస్థలు నిబంధనల పేరుతో కొంత కోత పెడుతుండగా, కొన్ని క్లెయిమ్‌లను తిరస్కరించడం, రీయింబర్స్‌మెంట్ విధానంలో రావాలని కోరుతున్నాయి. నేషనల్ హెల్త్ ఎక్స్ఛేంజ్ పరిధిలోకి మరిన్ని హాస్పిటల్స్ చేర్చేందుకు కూడా ఇన్సూరెన్స్ కౌన్సిల్, నేషనల్ హెల్త్ అథారిటీతో సంప్రదింపులు చేస్తున్నట్టు పాండా తెలిపారు. వృద్ధులకు హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం అందుబాటులో ఉండేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు.

డీఎస్‌పీ ఎంఎఫ్ నుంచి మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్

ముంబై: డీఎస్‌పీ మ్యుచువల్ ఫండ్ తాజాగా మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్ (డీఎస్‌పీ ఎంఏఏఎఫ్)ను ఆవిష్కరించింది. దేశీ ఈక్విటీలు, అంతర్జాతీయ స్టాక్స్, డెట్ సాధనాలు, గోల్డ్ ఈటీఎఫ్‌లు, ఇతర కమోడిటీలు మొదలైన వివిధ రకాల అసెట్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా తక్కువ రిస్కులతో ఇన్వెస్టర్లకు గరిష్ఠ ప్రయోజనాలు అందించడం దీని ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా ఈక్విటీల్లో 35–80 శాతం వరకు, డెట్‌లో 10–50 శాతం, గోల్డ్ ఈటీఎఫ్‌లలో 10–50 శాతం వరకు, ఈటీఎఫ్‌లు మొదలైన వాటి ద్వారా ఇతర కమోడిటీల్లో 0–20 శాతం వరకు ఇది ఇన్వెస్ట్ చేస్తుంది. సెప్టెంబర్ 21తో ఈ న్యూ ఫండ్ ఆఫర్ ముగుస్తుంది.

చక్రం తిప్పడం పక్కా..

ఈ బరువు నాకొక లెక్కా



ఆటో నడుపుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



బార్ ఎత్తుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

చివ్వెంల(సూర్యాపేట)/ఖమ్మం స్పోర్ట్స్: విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని మున్యానాయక్ తండాలో గృహలక్ష్మి పథకం కింద మంజూరైన ఇంటి నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ కార్యకర్త భానోతు రవి తాను కొనుగోలు చేసిన ఆటో ప్రారంభించాలని మంత్రిని కోరారు. వెంటనే మంత్రి జగదీశ్‌రెడ్డి ఆటో నడుపుతూ శంకుస్థాపన చేయనున్న ఇంటి వరకు వెళ్లారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం జిల్లాస్థాయి మహిళల ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీలను రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వెయిట్ లిఫ్టింగ్ బార్‌ను సరదాగా ఎత్తి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

రెగ్యులరైజ్ చేయండి ప్లీజ్...



కైలాస్‌నగర్: ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో ఆదివారం వంటావార్పుతో నిరసన తెలిపారు. కాగా బడులకు సెలవు కావడంతో తల్లిదండ్రులతో పాటు హాజరైన పలువురు చిన్నారులు 'మా అమ్మ, నాన్నలను రెగ్యులరైజ్ చేయాలంటూ..' ఇలా ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఆకర్షించారు.

పెళ్లిపీటలెక్కిన మాజీ మావోయిస్టు భూషణం

హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు



చెందా భూషణం వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రవిబాబు

పాడేరు రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): మావోయిస్టు పార్టీ మాజీ నేత, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ మాజీ నాయకుడు చెందా భూషణం పెళ్లి పీటలెక్కారు. జిల్లా కేంద్రమైన పాడేరు మోదకొండమ్మ తల్లి కల్యాణ మండపంలో ఆదివారం వివాహం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ కె.రవిబాబు తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కాగా, మావోయిస్టు ఉద్యమంలో సుదీర్ఘ కాలం పనిచేసిన భూషణం సుమారు 15 ఏళ్లపాటు జైలు జీవితం గడిపాడు. ఇటీవలే విశాఖ సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యాడు.

ఉద్యోగి ఆత్మహత్య చేసుకుంటే

కారుణ్య నియామకం వర్తించదు

- ఎస్‌బీటీ పథకం కింద ఎక్స్‌గ్రేషియా కూడా రాదు: ఆర్టీసీ స్పష్టీకరణ
- పాత సర్క్యులర్‌లను కోట్ చేస్తూ తాజాగా ఆదేశాలు జారీ
- ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం వేళ చర్చనీయాంశమైన ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: సర్వీసులో ఉన్న ఉద్యోగి ఆత్మహత్య చేసుకుంటే ఆ ఉద్యోగి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందే అర్హత లేదని ఆర్టీసీ తేల్చి చెప్పింది. ఆయా కేసుల్లో మానిటరీ బెనిఫిట్ కింద కుటుంబ సభ్యులకు నగదు మాత్రమే అందిస్తామని స్పష్టం చేసింది. ఉద్యోగి సర్వీసులో ఉండగా సహజ మరణం పొందితేనే కారుణ్య నియామకం (బ్రెడ్ విన్నర్ స్కీం) కింద కుటుంబ సభ్యుల్లో అర్హులైన ఒకరికి ఉద్యోగం ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు 2008లో జారీ చేసిన సర్క్యులర్‌ను ఉటంకిస్తూ కొత్త సర్క్యులర్‌ను జారీ చేసింది. అలాగే స్టాఫ్ బెనెవలెంట్ ట్రస్ట్ (ఎస్‌బీటీ) పథకం కింద చనిపోయిన ఉద్యోగుల కు అందించే ఎక్స్‌గ్రేషియాను సైతం సర్వీసులో ఉండగా ఆ త్మహత్య చేసుకున్న ఉద్యోగుల కుటుంబాలకు అందించడం సాధ్యం కాదని ఆ సర్క్యులర్‌లో ఆర్టీసీ పునరుద్ఘాటించింది. ఇవి మినహా ఎస్ఆర్‌బీఎస్, ఈడీఎల్ఐఎఫ్, ఇతర బెనిఫిట్స్‌ను సెటిల్‌మెంట్ రూపంలో అందించనున్నట్లు వెల్లడించింది. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేస్తున్న తరుణంలో పాత సర్క్యులర్‌లను కోట్ చేస్తూ ఆర్టీసీ కొత్తగా సర్క్యులర్ జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

నాడు అనుమతించి...

సాధారణంగా ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో కారుణ్య నియామకానికి వెసులుబాటు ఉంది. ఆర్టీసీలో కూడా అది అమలులో ఉంది. కొన్నేళ్లుగా ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి బాగో లేకపోవటంతోపాటు ఖాళీలు లేవన్న సాకుతో కారుణ్య నియామకాలను సంస్థ పెండింగ్‌లో పెట్టింది. కానీ ఆ వెసులుబాటు మాత్రం అమలులోనే ఉంది. 2019లో దీర్ఘకాలం ఆర్టీసీ సమ్మె జరిగిన సమయంలో కొందరు ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురై ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వారి కుటుంబ సభ్యులకు అప్పట్లో కారుణ్య నియామకాలకు సంస్థ అనుమతించింది. కానీ ఇప్పుడు సాధ్యం కాదని స్పష్టం చేస్తూ ఆర్టీసీ సర్క్యులర్ జారీ చేయడం గమనార్హం.

ఎస్‌బీటీ పథకం ఉన్నా...

ఆర్టీసీ ఉద్యోగులు ఎస్‌బీటీ పథకం కింద ప్రతినెలా వేతనంలో రూ.100 చొప్పున ఆ పథకం ట్రస్టుకు జమ చేస్తారు. ట్రస్టును ఆర్టీసీనే నిర్వహిస్తుంది. ఉద్యోగులు పదవీ విరమణ పొందినప్పుడు వారు నెలనెలా చెల్లిస్తూ పోగు చేసిన మొత్తాన్ని వడ్డీతో కలిపి సంస్థ చెల్లిస్తుంది. ఒకవేళ ఉద్యోగి సర్వీసు పూర్తి కాకుండానే మరణిస్తే ఆ మొత్తంతోపాటు రూ. లక్షన్నర ఎక్స్‌గ్రేషియా కూడా చెల్లిస్తుంది. ఇప్పుడు ఆత్మహత్య చేసుకున్న ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడం సాధ్యం కాదని ఆర్టీసీ స్పష్టం చేసింది. ఇందుకు 1983లో జారీ చేసిన సర్క్యులర్‌ను కోట్ చేసింది.

నిమ్స్‌లో చిన్నారులకు ఉచిత గుండె ఆపరేషన్లు

ఈ నెల 24 నుంచి 30 వరకు నిర్వహించనున్న బ్రిటన్ వైద్య బృందం

లక్డీకాపూల్: గుండె సమస్యలతో బాధపడే చిన్నారులకు నిమ్స్‌లో ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు ఉచితంగా గుండె ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. నవజాత శిశువులు మొదలు ఐదేళ్లలోపు చిన్నారుల గుండె వ్యాధులకు చికిత్స అందిస్తామని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రిటన్‌లోని ఆల్డర్ హే చిల్డ్రన్స్ హాస్పిటల్ కార్డియాక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రమణ దన్నపునేని ఆధ్వర్యంలోని 10 మంది సర్జన్ల బృందం నిలోఫర్ సర్జన్లు, నిమ్స్ కార్డియోథొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ అమరేశ్వరరావు, ఇతర వైద్య బృందంతో కలసి నిమ్స్‌లో ఈ శస్త్రచికిత్సలు చేపట్టనున్నట్లు వివరించారు. 'హీలింగ్ లిటిల్ హార్ట్స్ చార్లీస్ హార్ట్ హీరోస్ క్యాంప్'లో భాగంగా ఉచిత శస్త్రచికిత్సలు జరగనున్నాయని బీరప్ప పేర్కొన్నారు. తమ చిన్నారులకు ఆపరేషన్లు అవసరమైన తల్లిదండ్రులు మరిన్ని వివరాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య 040–23489025 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఏపీ హైకోర్టు జడ్జికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

చివ్వెంల (సూర్యాపేట): హైదరాబాద్ నుంచి కారులో విజయవాడకు వెళ్తున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ సుజాత రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం జి.తిర్మలగిరి గ్రామ శివార్లలో ప్రయాణిస్తుండగా.. కారు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టింది. ప్రమాదంలో జస్టిస్ సుజాత చేతులు, తలకు గాయాలయ్యాయి. వెంటనే సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి, తర్వాత ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆమెకు మెరుగైన చికిత్స అవసరమని వైద్యులు సూచించడంతో హైదరాబాద్‌కు తరలించేందుకు సిద్ధమయ్యారు. అయితే తిర్మలగిరి గ్రామంలో ఓ శుభకార్యానికి వెళ్లి వస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డికి ఈ ప్రమాదం విషయం తెలిసింది. ఆయన వెంటనే వెళ్లి జడ్జిని పరామర్శించారు. తన కాన్వాయ్ మధ్యలో అంబులెన్స్‌ను ఉంచి, హైవేపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేలా పోలీసులను అప్రమత్తం చేసి.. జడ్జిని గంటన్నర సమయంలో హైదరాబాద్‌కు తరలించేలా తోడ్పడ్డారు.



ఆదివారం హైకోర్టు ఆవరణలో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో ఏజీ బీఎస్ ప్రసాద్, నాగేశ్వరరావు, కల్యాణ్ రావు, కృష్ణ కుమార్ గౌడ్ తదితరులు

పేదల ఇళ్లకు రూ.100 కోట్లు

- జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే ఇళ్ల నివాసితులకు ప్రయోజనం
- మరమ్మతులు, పునరుద్ధరణకు కేటాయింపు
- మునిసిపల్ మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ నగరంలో గతంలో ప్రభుత్వం పేదలకు జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే పథకాల ద్వారా అందజేసిన ఇళ్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన ఆ ఇళ్లలో ఉంటున్న వారికి వర్షాలు కురుస్తున్న పరిస్థితుల్లో తగిన భద్రత, రక్షణ లేకుండా పోయింది. వాటిల్లోని నివాసితులకు అవసరమైన మరమ్మతులు చేసుకొని, పునరుద్ధరించుకునేందుకు తగిన ఆర్థికస్తోమత లేదు. ఈ విషయాల్ని ఇటీవల మునిసిపల్ మంత్రి కేటీఆర్‌తో జరిగిన సమావేశంలో నగర ఎమ్మెల్యేలు ఆయన దృష్టికి తెచ్చారు. పేదల కోసం రూ.9100 కోట్లతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి ఉచితంగా అందజేస్తున్న ప్రభుత్వం పాత ఇళ్లలో నివసిస్తున్న ఆ కుటుంబాలకు సైతం తగిన జీవన పరిస్థితులు కల్పించాల్సిన ఆవశ్యకతను కేటీఆర్ గుర్తించారు. కొన్ని నిధులు కేటాయిస్తే వేల సంఖ్యలో పేదలకు లబ్ధి చేకూరుతుందంటే ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడదని ఎమ్మెల్యేలకు చెప్పారు. వెంటనే సీఎం కేసీఆర్‌కు పరిస్థితిని వివరించారు. దాంతో రూ.100 కోట్లను ఆ ఇళ్లకు అవసరమైన మరమ్మతులు, పునరుద్ధరణలకు గ్రాంట్‌గా కేటాయించారు. హెచ్ఎండీఏ నుంచి ఆ నిధులను అందజేస్తారు. పునరుద్ధరణ పనులను జీహెచ్ఎంసీ ఇంజినీర్లు చేస్తారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. నగరంలో జంగమ్మెట్, బండ్లగూడ తదితర ప్రాంతాల్లో జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే కాలనీలు ఉన్నాయి. ఆ కాలనీల్లోని ఇళ్లకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేయనున్నారు.

మూసివేత దిశగా బీసీ హాస్టళ్లు

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ధ్వజం



కాచిగూడ: బీసీ హాస్టళ్లను మూసివేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. 8 నెలలుగా మెస్ బిల్లులు చెల్లించకపోవడంతో హాస్టళ్లకు నిత్యావసర వస్తువులు, కూరగాయలు, నూనెలు, పప్పులు, చికెన్, గుడ్లు ఇతర ఆహార దినుసులు సరఫరా చేసే వాక్యపారులకు బిల్లులు చెల్లించ లేదని ఈ నేపథ్యంలో వారు సరఫరాను నిలిపివేస్తున్నారని తెలిపారు.ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో హాస్టళ్లను మూసివేసే పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో 700లకు పైగా బీసీ హాస్టళ్లలో ఆశ్రయం పొందుతున్న 70 వేల మంది విద్యార్థుల మెస్ చార్జీల బిల్లులు 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. భవనాల అద్దెలు, కరెంట్ బిల్లులు చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం బీసీ వ్యతిరేక వైఖరి మార్చుకోవాలన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఎత్తివేశారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించారన్నారు. తొమ్మిదేళ్లుగా ఒక్కరికి కూడా బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వ లేదన్నారు. రాష్ట్రంలో 295 బీసీ కాలేజీ హాస్టళ్లకు, 321 బీసీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేవని, వాటికి కేటాయించిన ప్రభుత్వ స్థలాలను ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. ఇతర కులాలకు పూర్తి ఫీజులు మంజూరు చేస్తూ కేవలం బీసీ విద్యార్థులపై వివక్ష చూపడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి బీసీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.